185/186

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక

అచారిత్రక ప్రజల చరిత్ర రచన

నిర్వహణ
'సాహితీమిత్రులు'

మార్చి/ఏప్రిల్
1991

సృజన
ఆధునిక సాహిత్య వేదిక

185/186 మాసపత్రిక మార్చి/ఏప్రిల్ 1991

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Baghlingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002
Working Editor : Vara Vara Rao

సంపాదకీయం :

వేళ్ళూడే పార్లమెంటు

భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థ పటిష్టంగా లేదనడానికి లేదు!

సూయజ్ కాలువ సమస్యపై అంథోనీ ఈడెన్ ప్రభుత్వం బ్రిటన్‌లో రాజీనామా ఇచ్చినట్లు అమెరికా యుద్ధవిమానాలకు బొంబాయిలో ఇంధనం నింపినందుకు చంద్రశేఖర్ ప్రభుత్వం రాజీనామా ఇవ్వకపోవచ్చు గానీ-

క్రిస్టన్ కీలర్ ఉదంతంపై ప్రొఫ్యూమో మాత్రమేకాక బ్రిటిష్ మంత్రివర్గమంతా రాజీనామా ఇచ్చి పార్లమెంటు రద్దయి మళ్ళీ ఎన్నికలు జరిగినట్లు-

రాజీవ్‌గాంధీ ఇంటిముందు, ఇద్దరు హర్యానా గూఢచారులు తచ్చాడిన అనుమానంపై లేదా ఆరోపణపై చంద్రశేఖర్ మంత్రివర్గం రాజీనామా చేసింది- పార్లమెంటు రద్దయింది. మే నెలలో మళ్ళీ లోక్‌సభకు ఎన్నికలవుతున్నాయి.

ఆ గూఢచారులకు ఆ హుకుం జారీచేసిన హుకుంసింగ్, అప్పుడు హర్యానా ముఖ్యమంత్రిగా ఆ బాధ్యత తీసుకోలేదు. రాజీనామా కూడా చేయలేదు. ఓంప్రకాశ్ చౌతాలా అధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగడానికి మాత్రమే రాజీనామా చేశాడు. ఓంప్రకాశ్ చౌతాలా మన ప్రజాస్వామ్య సంప్రదాయానికి పదునైన గీటురాయి! అసెంబ్లీలో నీ బలం నిరూపించుకో అన్నాడు గవర్నర్. ఎందుకు అంతకన్న ఉన్నతమైన ప్రజా న్యాయస్థానంలో నా తడాఖా చూపిస్తాను ఇప్పుడైతే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలు పెట్టమన్నాడు చౌతాలా!

వెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక తమిళ ఈలం పులి దొరికినందుకు కరుణానిధి ప్రభుత్వం రద్దయింది. ఇప్పుడు తమిళనాడు అసెంబ్లీకి కూడా ఎన్నికలు అవుతున్నాయి.

కనుక సీతమ్మ వారిని అడవులకు పంపడానికి రామునికి ఒక అపవాదు సరిపోయినట్లు మన ప్రజల్ని ఎన్నికల రొంపిలోకి దింపడానికి మన పాలకవర్గాలకు ఏదైనా ఒక సాకు చాలు అయితే అసలు రహస్యమేమిటంటే అది వాళ్ళు కోరుకున్న రీతిలో కోరుకున్న సమయంలో రావాలి- రాముడో, రాజీవుడో కాక మరె

పది ప్రభుత్వాలను పడగొట్టగలరని! (అందుకే అస్సాం, పంజాబ్, కాశ్మీర్‌లలో ఎన్నికలు- రద్దయిన అసెంబ్లీలకే కాదు లోక్‌సభకు కూడా జరగవు. ఉల్ఫాను అస్సాం గణపరిషత్ ప్రభుత్వం ఉసిగొల్పుతున్నదని రద్దు చేసిన కేంద్రప్రభుత్వం ఇవాళ తాను ఉల్ఫాను చర్చలకు ఆహ్వానిస్తున్నది కానీ అక్కడ "ప్రజాస్వామ్యాన్ని" పునరుద్ధరించాలనుకోవడం లేదు. మాన్‌తో మాట్లాడినందుకే 'దేశభక్తు'లందరితో తిట్లుతిన్న చంద్రశేఖర్ 'టెర్రరిస్ట్' పంజాబ్, కాశ్మీర్‌లలో ఎన్నికలు పెడ్తానని బెదరించడం తానెంత ప్రజాస్వామ్యవాదో చూపుకోవడానికే.)

కేంద్రమూ, పార్లమెంటూ, బలపడ్తూ మనల్ని భయపెడ్తున్న తరుణంలోనే వాటి లక్క- ఇళ్ళ పునాదులు లుకలుకలాడడం ప్రారంభమయింది. అలహాబాద్ హై కోర్టు తీర్పును అధిగమించడానికి, పార్లమెంట్ మెడలు వంచి ఎమర్జెన్సీ చట్టాన్ని ఒప్పించిన ఇందిరాగాంధీ. నక్సల్బరీ, శ్రీకాకుళాలలో రైతాంగ పోరాటాలపై, రైల్వే సమ్మెలో కార్మికులపై, ఈశాన్య రాష్ట్రాలు, కాశ్మీర్, అస్సాం, పంజాబ్‌లలో జాతుల పోరాటాలపై ప్రయోగించిన ఇనుపపాదం స్వర్ణ మందిరంలో బ్లూస్టార్ ఆపరేషన్‌తో పూర్తి యూనిఫామ్ ధరించింది. పార్లమెంటు ద్వారా, ఆమె తనకు దత్తం చేసుకున్న అధికారాలన్నింటినీ ఆమెను అంతం చేసి, అంతం చేయగలమనుకున్నారు ఇద్దరు అంగరక్షకులు.

అదెలా ఉన్నా కేంద్రంలో 'సుస్థిర' ప్రభుత్వాల కీళ్ళు మాత్రం సడలి పోయాయి. పదిహేడు సంవత్సరాలు పాలించిన నెహ్రూకానీ, పదకొండు సంవత్స రాలు పాలించిన ఇందిరాగాంధీ గానీ, రాజీవ్‌గాంధీ వలె 401 లోక్‌సభ స్థానాలు ఎన్నడూ గెలుచుకోలేదు. అయితే భారత ప్రజలు నిజంగా హిందూ రాజ్యస్థాపన కోసమే ఆయనకు ఓటు వేసివుంటే ఆ ఓడ ఐదేళ్ళకే అడుగు ఊడి ఉండేదికాదు.

ఇంక తర్వాత పార్లమెంటు చరిత్ర- మామూలుగా పౌరశాస్త్రాలలో విద్యా ర్థులు చదువుకునే పాఠంలాగ లేదు. ఒక మెజార్టీ పార్టీ నాయకుడు ప్రధాని అవుతాడు అన్న నిర్వచనం నిలువలేదు. అధికారంలోకి రావాలంటే లోక్‌సభలో సగానికన్నా ఎక్కువ స్థానాలు రావాలన్న నియమమూ నిలువలేదు.

'రామరాజ్యం' తేవడానికి కాదు రామదేవాలయం నిర్మించడానికి (అది

కూడా ఒక మసీదును కూల్చి) ప్రభుత్వం పడిపోవచ్చు. రాజ్యాంగంలో గ్యారంటీ చేయబడిన రిజర్వేషన్లను అమలు చేస్తానన్నందుకో, రాజ్యాంగం తన స్వభావంగా చెప్పుకున్న సెక్యులరిజాన్ని పాటిస్తానన్నందుకో ప్రభుత్వాలు పడిపోవచ్చు.

పట్టుమని పద్నాలుగు నెలలైనా పాలించలేని రెండు కేంద్రప్రభుత్వాలు, ఐదేళ్ళు కాదుగదా రెండేళ్ళయినా నిలువలేని పార్లమెంట్- ఇంక మనకు వేళ్ళాడే పార్లమెంటే (హంగ్ పార్లమెంట్) తప్ప వేళ్ళూనే పార్లమెంట్ ఉండదని రాజ్యాంగ నిపుణులే జోస్యం చెప్తున్నారు. 'జాతీయ' ప్రభుత్వ అనివార్యత గురించి రాష్ట్రపతి మొదలు రాష్ట్రస్థాయి నాయకుల దాకా మాట్లాడుతున్నారు.

ఈ రాజ్యాంగం ఇంకెంత మాత్రమూ ఈ దేశ ప్రజల సమస్యలను తీర్చి అవసరాలను పరిపూర్తి చేయగల స్థితిలో లేదు, దీన్ని రద్దు చేసి మరో రాజ్యాంగాన్ని రాసుకోవాలనేవాళ్ళూ, ఈ రిపబ్లిక్‌ను రద్దుచేసి మరో రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసుకోవాలనేవాళ్ళూ ఇవాళ మనకు ఈ చట్రంలోనే ఎందరో కన్పిస్తున్నారు.

నిజానికి ఈ చట్రానికి లోబడి 1967 లోనే- ఒకవైపు లోహియా, రాజాజీలు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పాలనను అంతం జేసి మిశ్రమ ప్రభుత్వాలను ఏర్పాటు చేసే ప్రతిజ్ఞను నెరవేర్చుకుంటుండగా

ఈ చట్రాన్నే బద్దలు కొట్టి ప్రజల ప్రజాస్వామ్యాన్ని, నూతన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకుందామనే నిర్ణయానికి నక్సల్‌బరీలో రైతాంగం తన రక్తంతో చాలుపెట్టింది. 25 ఏళ్ళు గడిచేవరకు, అంటే ఒక తరం మారే వరకు.

పార్లమెంటు అక్షరాలా 'పందులదొడ్డి' కాదు 'బందెల దొడ్డి' అయింది. దొంగ గొడ్డుకు మెడలో బరువేసినట్లు చట్టాలు చేసి 'అయారాం గయారాం' లను ఆపుకోవాల్సివచ్చింది. అక్కడికీ గోడలూ కంచెలూ దూకితే హరియానా సూరజ్ కుంజ్ కొట్టాల్లో కట్టేయాల్సి వచ్చింది. లెనిన్ అన్నట్లు అది బాతాఖానీ క్లబ్బుగా గానీ, తరిమెలనాగిరెడ్డి అన్నట్లు అది సాలెగూడుగా గానీ మిగిలి వుంటే కనీసం అక్కడ అందమైన మాటల అల్లిక చూసేవాళ్ళం. ఇప్పుడది క్రైం సినిమా పేర్లకు సరిపోయే సంస్కృతికి దిగజారింది.

ప్రభుత్వ సారా దుకాణాలను ఏడాడి కోసారి గాంధీ పుట్టినరోజు వేలం వేస్తారు. పార్లమెంటు సీట్లనూ, అట్లా వేలం వేసే రాజకీయ ఆర్థిక విధానంలోకి మనం ప్రవేశించాం.

ఏ పరమార్థం కోసం- ఇప్పుడు ఈ ఏడాదికోసారి పార్లమెంటు ఎన్నికలు- భూములు పంచడం పూర్తి కాలేదనా ? బువ్వ అందించడం పూర్తి కాలేదనా ? కాలి నిండా బట్ట కంటినిండా నిద్ర సమకూర్చాలన్న తపనతోనా ? ఈ పనులు ఎన్నికలూ పార్లమెంటూ చేయగల్గితే ఇన్నాళ్ళ 'ప్రజా ప్రభుత్వాలు' ఎందుకీ పని చేయనట్టు ?

రాజ్యాంగం గ్యారంటీ చేసిన పరిమితమైన హక్కుల్ని ఉద్యోగ విద్యా రంగాల్లో అమలు చేయడానికో, కాదు, కూడదు, మసీదు కూల్చి రామమందిరం కట్టడానికో ఇంత పెద్ద కురుక్షేత్ర యుద్ధం లాంటి ఎన్నికలు అవసరమయ్యాయంటే నిజంగానే ప్రతి ఒక్కరికీ రోటీ, మకాన్, కపడా, (రొట్టె, ఇల్లు, బట్ట) సమకూర్చగల ప్రభుత్వాలు ఎట్లా ఏర్పడతాయి మరి !

ఆ ప్రభుత్వాలు ప్రజలు తలపట్లు పట్టుకొని చేతులు దులుపుకొని రాల్చే ఓట్లకు పుట్టవు. వాళ్ళందరి ఓట్లు కట్ట గట్టి కాంట్రాక్ట్‌గా వేసే రిగ్గింగ్ బూతుల్లోనూ పుట్టవు. అవి మనం అలవాటుగా చూస్తున్న ప్రభుత్వాలవంటివీ కావు.

కూడు, గూడు, గుడ్డనిచ్చే ఒక ఉద్యమం ఒక చైతన్యాన్ని రగిలించి మనసుకు ఒక స్వేచ్ఛా భావనను తగిల్చి, మనిషికొక ప్రజాస్వామ్య విలువను సంతరించి నేలమీది పోరాటంగా ప్రారంభమవుతుంది. అవుతుంది కాదు- అయింది. అదే నక్సల్‌బరీలో ప్రారంభమైన నూతన ప్రజాస్వామిక విప్లవం.

అది భూస్వామికీ, వ్యవసాయ కూలీకీ సమానమైన ఓటు హక్కు గురించి మాట్లాడదు. దున్నేవానికీ భూమి హక్కు గురించి మాట్లాడదు. అది టాటాలకు, బిర్లాలకు, తాడితులకు, పీడితులకు సమానంగా వర్తించే ఒక్క మనిషి ఒక్క ఓటు గురించి చెప్పదు. 'లోహయంత్రముల కోరలతోనే' శ్రామిక శక్తికి అధికారం గురించి చెపుతుంది. ఉత్పత్తి సాధనాలపై, వనరులపై, ఉత్పత్తిపై ఉత్పత్తి శక్తుల స్వామ్యం గురించి చెబుతుంది.

అప్పట్నుంచి ఓటేసే స్వేచ్ఛ ఎంత ప్రాథమిక హక్కుగా దోపిడీ వర్గాలు, వాళ్ళ తాబేదార్లు, చివరకు భ్రమాన్వితులు, అమాయకులు నమ్మజూపుతున్నారో లేదా నమ్ముతున్నారో

ఓటు వేయకుండా ఉండే స్వేచ్ఛ, ఎన్నికలను బహిష్కరించే స్వేచ్ఛ, అంత స్వచ్ఛందమైన హక్కుగా వర్గపోరాటంలో తలమునకలైన ప్రజలూ భావిస్తున్నారు.

(తరువాయి 33 వ పేజీలో)

అయోధ్యపట్నం

వంగపండు

ఆలు, మగల సంవాదం –

ఆమె : అయోధ్య వత్తావా - మావ
రథం ఎక్కుతావా-
రామకోవిలీ - కట్టడానికే
రక్తం -ఇత్తావా - మావ
నాతో - వత్తావా- ॥ అ॥ వ॥

అతడు : అయోధ్య మనకొద్దే పిల్లా
రాముడు-మనకొద్దే
రక్తం ఇచ్చి-పోరాడితే-
భూములు వత్తాయే-బుగతల
భూములు వత్తాయే ॥ అ॥ మన॥

ఆమె : అప్పుడు ముస్లిం-రాజు ఎప్పుడో
కూలగొట్టెనట-రామ కోవిలీ
ఇప్పుడు మంత్రులు మసీదు ఒకటి
కూలగొడతరట-మీసం నులిపి
కుంకంబొట్టు నెత్తిన బెట్టే-బల్లెం బట్టే
బయల్దేరుదాం- ॥ అ మన॥

అతడు : దేవుల్లందరు ఒకటే అంటరు
ఇందులో-అందులో వున్నాడంటరు
అదెపుడో ఒక పిచ్చోడయ్యా-
ఆలయాన్ని-పడగొట్టిండంటే
అంతకన్న పిచ్చెత్తి మంత్రులు
మతం పిచ్చి మనకెక్కిస్తుండ్రూ ॥ అ ॥మన॥

ఆమె : అయోధ్యలోను రామచంద్రుడు
పుట్టినట్లుగా-తెలిసిందంటా

ఉమాభారతి-అద్వానీలు
గురుదక్షిణగా-గుండులు గొట్టి
కోదండరాముని-కోవెల గడితే—
గవరమెంటు వద్దంటుం దాటా ॥ అ. వ॥

అతడు : పుడితే పుట్టేడు దేవుడు గానీ
మసీదులోపల పుడతా డేటి
హిందూ, ముస్లిం-భేదం బెట్టి
అల్లా దేవుడ్ని-అల్లరి బెట్టి
వాజ్‌పాయ్-అద్వాని మంత్రులు
ఓట్లుల కోసం నాటక మెట్టిరి ॥ అ ॥వ ॥

ఆమె : అదేటి మావ-అలాగంతవూ
మనదేవుడు-మన ప్రాణం గాటె
ఇటికె బెడ్డ-మన పంతొక్కిద్దాం
సందాదబ్బు-కుండీలెడదాం
రామ మందిరం మల్లా గట్టి-భజన జేసుకుని
ఎదురుగ వుందాం ॥ అ ॥మన ॥

అతడు : ఊరు, ఊరునా రాముడు గుడిలు
వున్నాయమ్మా-లక్షల కొలదీ
ఇంతమంది-శ్రీరాముడ్లు వుండగ
హిందీ రాముడు-ఎందుకు మనకు
మల్లా రాముడు గుడికన్నా-
మాలపేట బడి గట్టుట మిన్న ॥ అ. మన ॥

ఆమె : దేపుడు కింతా ప్రసాదమెట్టి
గుడి కడితే కద-గుడికుంటాదీ
దేవుడుంటె కద-ఉద్యోగానికి
దారుంటాదీ-పేరుంటాదీ
అలు, మగలం-పూజలు జేస్తే-అపై
స్వర్గం మనకుంటాదీ ॥ అ॥ వ॥

అతడు : దేవుడు ప్రసాద మొందిన దానికీ
భూమి దున్న నిదె-అన్న మొచ్చునా
ఇసకా, సున్నం-మనిషి కలపనిదె
దేవుడున్న-గుడి గోడ గట్టైనా
కోతుల సాయం-కోరినవాడు
రాముడెట్ట మరి దేవుడవుతడే— ॥అ ॥ మన॥

ఆమె : తండ్రి మాట-జవదాటని రాముడు
రామన్న-రాముడు-గొప్ప దేవుడు
విశ్వామిత్రుని-యజ్ఞ-యాగము
కాపాడిన-పట్టాభి-రాముడు
అట్టి దేవుడు-మన శ్రీరాముడు
పుట్టిన అయోధ్య పుణ్యం కాదా ॥ అ ॥ ప ॥

అతడు : శ్రీరామ సెంద్రుడు -సిన్నోడు గాదే
సీతమ్మ తల్లిని అడివికి పంపేడు
అగ్ర కులాలకు-అండగ వుండే
శెంభుకుడ్ని- తలనరికి సంపేడు
సెట్టుసాటునా బాణం బట్టి వాలిని-
కొట్టిన దొంగ రాముడు ॥ అ. మన ॥

ఆమె : దేవుడు పుట్టిన మూరెడు సోటు
దొరక్క దొరక్క దొరికిందాటా
కలిగిన దాతలు-కరసేవోలు
కత్తులొట్టుకొని-బైల్దేరిరట
అద్వానీకి-మద్దతు ఇద్దాం బాబ్రీ
మసీదు బద్దలు గొడదాం ॥ అ. ప॥

అతడు : దేవుడు పుట్టిన-మూరెడు సోటుకి
హిందూ, ముస్లిం-తగువు లొచ్చులుకుని
మనిషికి ఎకరం-భూమి పంచమని
అందరి మొకతై-బందూ కెత్తితే-
రాజీవ్ గాంధిని-అద్వానీనీ-రక్షించే-
ఏ దేవుడుండడూ- ॥అ మన ॥

ఇందూరు జిల్లాలో
మంజీర

1 ఇందూరు జిల్లాలో ఇంగిలమై మండి
రక్తాల వాదుల్లో ఎఱ్ఱజెండాలెత్తి
పుడమి తల్లి గుండెలోనా సాతీషు
అమరులయ్యి ఒరిగినారా రమేషు

2 కృష్ణ జిల్లా ముద్దు మురిపాల మురళన్న
కరిమినగరు క్రాంతి వెలుగుల సత్తన్న
నిజామాబాదు కొచ్చినారా సాతీషు
చేతులో చెయి గలిపినారా రమేషు

3 బూర్జువా చదువుల భూమంత్రమూ జేయ
విద్యార్థి యువకుల ఉద్యమాల్లో జేర్చి
శాస్త్రీయ విద్యకోసామూ సాతీషు
సమరమూ సాధించినారా రమేషు

4 సమస్యల మూలమూ సర్కారు దోపిడని
సర్కారునూ దించ సంఘటితమవ్వమని
హమాలి కూలీల జూట్ మిల్ కార్మికుల
హాస్టల్ల తమ్ములా కాలేజి విద్యార్థి
ఊరేగింపులై నారా సాతీషు
ఉద్యమం ఊపిరై నారా రమేషు

5 టెక్నికల్ విద్యలో పట్టాలు దీసినా
పొట్టకే లేకుండ సైన్సునూ గుప్పిట్ల
పెట్టినా అధికార యంత్ర అంతానికై
టెక్నిక్ను సృష్టించమంద్రా సాతీషు
తెగించి పోరాడమంద్రా రమేషు

6 రాజకీయార్థాన్ని చెప్పి ఒప్పించారు
మార్క్సిస్టు తత్వాన్ని యిప్పి చెప్పినారు

ఈ భరత ఖండం బాధలోసూ సాతీషు
శుద్దైన బుద్ధి చెప్పింద్రా రమేషు

7 వీరులు అంతంకారు విప్లవం చావదూ
పోరాట హోరులో మీ ఊపిరై నాము
ఎర్రజండల దండ గుచ్చి సాతీషు
ఎదకద్ది సాగిపోతామూ రమేషు

[1986 జూన్ 10న కామారెడ్డిలో, 1986 జూన్ 24న నిజామాబాద్‌లో ఎన్‌కౌంటర్ పేర హత్య చేయబడ్డ విద్యార్థి నాయకులు కామ్రేడ్స్ మురళీధర్ రాజు, సత్యంల స్మృతికి అరుణాంజలి ఘటిస్తూ....]

"నాయన్నాదమ్ములారా"

బాటసారి

పోరాడో అన్నాలార — పోరన్నాలారో	నాయన్నాదమ్ములారా
మీరంతా వచ్చారా — నా బిడ్డాడేడీ	నాయన్నాదమ్ములారా
ఎతికెతికీ నా కళ్ళు — కాయ గాసాయే	” ”
వరిచేను ముక్కల్లే — పెంచుకొన్నానే	” ”
కంటికి రెప్పల్లే — కాచుకొన్నానే	” ”
పైనెగిరే పక్షులార — నా పేగూ ఏదీ	” ”
వీచేటి ఓ గాలీ — ఊసు జెప్పమ్మో	” ”
సూరీడా, చంద్రుడా — మీరు జూసారా	” ”
పేదలా రాజ్యంకై — పోరు జేసిండానీ	” ”
బాధలా పోనీకి — బందూకెత్తిండానీ	” ”
పోలీసూ, దొరలంతా — కచ్చగట్టారే	” ”
చూస్తు జూస్తుండంగానే — చుట్టుముట్టారే	” ”
నా కంటీ ముందారే — కుళ్ళ బొడిసారే	” ”

గొడ్డునూ బాదినట్టూ — చితక బాదింద్రే నాయన్నాదమ్ములారా
గడియాలో నా బిడ్డాను — గుంజుకెల్లింద్రే " "
నా గుండే ఎంతగా — గత్కుమన్నాదో " "
నా కడుపు ఎంతగా — కాలిపోయిందో " "
కుప్పయ్యీ నా మనస్సు — కూలిపోయిందో " "
నా కంటి నీరంతా — ఏరై పారిందో " "
తిరిగొస్తాడన్న ఆశ — కరిగిపోయిందో " "
కొడుకులేడన్న బాధ — కడుపు కోసిందో " "
పుట్టెడూ దిగులుతో — కుమిలిపోయానే " "
నా ఆశ అడియాసై — తల్లడిల్లానే " "
పండంటి నా బిడ్డా — మట్టి పాలాయే " "
నా కోటీ కలలన్నీ — కాటి పాలాయే " "
ఇది ఎవరి పాపమంటే — నేనేమి చెబుదో " "
ఈ పోలీసూ కొడుకులవైపూ — చేయి జూపెద్దో " "
ఈ పోలీసే నా ఇంటా — దీపమార్పిందో " "
ఈ సర్కారే నా కడుపూన — చిచ్చు బెట్టిందు " "
అయినాగాని నా మనసూనూ — నిమ్మళించుకొందో " "
మీ కళ్ళల్లో నా కొడుకూ — కనిపిస్తూ వుండో " "
నా కొడుకూ ఆశయాన్ని — మోసుకెళదామూ " "
నా కంటి నెత్తురోసి — కత్తి నూరుకొందో " "
ఈ సర్కారు దొంగలా — గుండె చీల్చుదామూ " "
నా బిడ్డా కలలానూ — ఇలలో నిలుపుదామూ " "

"యనకొచ్చే ఆవులారా — యద్రావులారో — శ్రీరామరామచంద్రా
మీరంతా వొచ్చారే — నాయమ్మా ఏదీ — శ్రీరామరామచంద్రా
— అనే జానపద బాణీలో పాడుకోవాలి.

బహిరంగ పహారా

గౌతమ్

ఊపిరి వార్తను శ్వాసించడం మొదలుపెట్టాక
గుండె చప్పుడు వాడికి భూకంపమైపోయింది
తనకు మాత్రమే పరిమిత మనుకున్న హక్కుని
జనం అడగడం మొదలైనాక
సభలు వాడికి పెండుకంపల పోగు అయ్యింది
అగ్నిపర్వతం లావాగా ప్రవహించాకా
స్పర్శసోకిన ప్రతి పల్లె నిప్పుల వాకిలే అయ్యింది
రాజ్యాంగ యంత్రాన్ని కిడ్నాప్ చేసి
రాజకీయ అధికారాన్ని డిమాండ్ చేస్తున్న మిలిటెంట్లు
పల్లెల్లో ఎగరేసిన ఎర్ర జండాలయ్యాక
"ప్రజలు నక్సలైట్లతో కుమ్మక్కవుతున్నారు"
ఒక్క కరచాలనాన్ని నిషేధించడం కోసం వాడు
వేల తలకాయల్లోకి పరకాయ ప్రవేశం చేస్తున్నాడు
భగ్నమైపోయిన ప్రతి సభ
వేల కరచాలనాలుగా — వేల కలయికలుగా విడిపోయాక
యిక్కడి ప్రతి అణువు ఒక సభావేదిక అయ్యింది
కంటిరెప్పల ప్రతి కలయిక శత్రువుపై నిఘా అయ్యింది
ప్రవాహం దాపరికం పరుచుకున్న నీరు అయ్యాక
పచ్చిక శత్రువు పాదాన్ని వెంటాడే చూపు అయ్యింది
ఆకులురాల్చుకున్న ప్రతిచెట్టూ అమరుని జ్ఞాపకం అయ్యాక
ఇక్కడి ప్రతి చెట్టూ అజ్ఞాతానికి బహిరంగ పహారాయిస్తోంది
యిప్పుడిక నువు ఏ బహిరంగాన్ని నిషేధించగలవు ?
ఏ అజ్ఞాతాన్ని వెంటాడగలవు ?
వేల తలకాయలకి బూట్లు తొడిగి నువు విషేధించిన బహిరంగం
అజ్ఞాతంగా నిన్ను నిరంతరం వెంటాడే భూమయ్యింది

వాల్ పోస్టర్

పి. శశిధర్

సమ్మిరెడ్డి అదరాబాదరాగా వచ్చి షెడ్లో సైకిల్ పడేసి మ్యాన్-వే దిక్కు నడిచిండు. ఆయన మనసంతా ఆందోళనతో నిండివుంది.

బొగ్గు గని మ్యాన్-వే ఆఫీసుపక్క నోటీసు బోర్డు ముందు కార్మికులంతా గుమిగూడింద్రు. నాలుగు రోజులుగా నడుస్తున్న సమ్మెకు బాధ్యులని ఇద్దరు కార్మికులకు డిస్మిసల్ చార్జిషీట్లు ఇస్తున్నట్టుగా కంపెని ఆ నోటీసుబోర్డులో కాయిదం అంటించింది. దాంతో కార్మికుల్లో కలకలం రేగింది.

"ఈ దెబ్బతో సమ్మె ఫెయిలైతది? దొంగ నా కొడుకులు తూట్లు పొడుస్తున్నరు. ఎట్లా? ఈ సమయంల అన్నే కనుక ఉంటెనా !" సమ్మిరెడ్డికి అన్న యాదికచ్చే వరకు గుబగుబాని దుఃఖం పొంగుకవచ్చింది. అన్న నర్సన్నకూ తనకూ ఉన్న అనుబంధం యాదికచ్చింది. రైలు పట్టాల పక్కన- పిచ్చి తుమ్మల మధ్యన- దుమ్ములో అన్న గుండె- రక్తసిక్తమైన గుండె- పిట్టపిల్ల తీరుగ కొట్టుకుంటున్నట్టుగ....

సమ్మిరెడ్డికి అన్న మరణం యాదికచ్చేవరకు కడుపులోంచి దుఃఖం ఎత్తేసుకచ్చింది.

"ఏమున్నది గంగల కలుపుతరు." సీనియర్ కోల్‌ఫిల్లర్ రాజేశం మర్రి కొమ్మల్లోకి చూస్తూ అన్నడు. అతని మాటలకు స్పందిస్తూ మరో కార్మికుడు "కలుపుడే కాదు— మన దాంట్లకెల్లి రోజొగన్ని గిట్లనే గొంతు కోరికి సంపుతరు" అన్నడు.

సమ్మిరెడ్డి చాటుగా కండ్లనీడు బొగ్గుపంచెతో తుడుచుకుని మ్యాన్-వే దిక్కు నడిచిండు. మ్యాన్-వే ఆఫీసులో క్లర్కు నాగయ్య "ఇంతాలస్యమాన న్యా" అంటూ మష్టర్ వేసుకుని 'ఒకటీ, రెండూ,' అంటూ మష్టర్లు పడ్డవారిని లెక్కిస్తూ లెక్కచీటి తయారుచేస్తున్నడు.

"బాయంత (గని) ఉరుకులాడినట్లు ఏందో లావు లావు లెక్కచీటి తయారు చెయ్యబట్టివి" అంటూ రోజూ ఆలస్యంగానే వచ్చే ట్రామర్ మొగిలి మ్యాన్-వే కిటికి ముందుకచ్చి చేతులు తిప్పిండు.

రైటరోసారి (క్లర్కు) మొగిలి మొఖంలకు చూసి "నడిసినా నడువకున్నా-నాకు తప్పదు కదనోయీ" అనుకుంట మొగిలి మస్టర్ వేసుకున్నడు.

సమ్మిరెడ్డి ఓసారి మొత్తం కార్మికుల దిక్కు చూసిండు.

మ్యాన్-వే ముందు (గని ముఖద్వారం) ఉన్న మర్రిచెట్టు గద్దెమీదా- యాప చెట్టు గద్దెమీదా- అల్లనేరేడు చెట్టు గద్దెలమీదా చాలామంది కార్మికులు కూర్చున్నరు. ఎవరూ ల్యాంపులు కట్టుకోలేదు. తట్టలూ, చెమ్మసులు (షవల్సు) ఇతర పనిముట్లు తెచ్చుకోలేదు. గనిలో సపోర్టులు పెట్టే టింబరింగు కార్మికులు పరాచికాలాడుకుంట వాట్ల (కర్రల) మీద కూర్చున్నరు. మరికొందరు మజ్దూర్సు బండలమీద కూర్చుని సమ్మె ఏమవుతుందా అని చూస్తున్నరు.

నాలుగురోజుల క్రితం ఫిల్లర్సు కార్మికులకు సమయం అయిపోయినాక ఖాళీ టబ్బులు ఇచ్చింది కంపెని. సమయం అయిపోయింది కనుక న్యాయంగా తమకు జీతాలు కట్టివ్వాలని ఆ ఫిల్లర్సు కార్మికులు పైకి వచ్చేశారు. కంపెని ఇవ్వనంది. దాంతో నాలుగురోజుల క్రితం రెండోబదిలి- మధ్యాహ్నం- నుంచి సమ్మె మొదలైంది- సమ్మెకు బాధ్యులని ఇద్దరు కార్మికులకు డిస్మిసల్ చార్జిషీట్లను ఇష్యూ చెయ్యడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది ఈరోజు.

సమ్మిరెడ్డి ఆ మందిలో అటూ ఇటూ కాలుగాలిన పిల్లికూన తీరుగ తిరిగిండు కాసేపు. ఆ తరువాత తన ఫైలు (జతపనివాడు) మల్లేశం కోసం అటూ ఇటూ మందిలో వెతుకుతున్నడు.

కోల్‌కట్టరుగా పనిచేసే కాంగ్రేసు డెలిగేటు పిట్టల రాయపోశం- అతను కాండ్రకించి ఉమ్మివేసి "సీ తల్లి- ఒక్కరోజు మస్టర్ కోసం నాలుగు రోజులు సమ్మెచేసుడు నేనెక్కడ సూల్లేదు" అన్నడు. ఆ మాటలు విన్న అల్లం కొమురయ్య కొరకొరచూసి- మొఖం అటు తిప్పుకోని "ఎంటికలు నరుసంగనే అయిపోయిందా" అన్నడు. దాంతో రాయపోశంకు రోషమచ్చింది. కాని తన డెలిగేటు చాలుబాజి తనంతో

"ఎన్నడన్న సాధించిండ్రా అని అడుగుతాన" అన్నడు.

"సాధించుకోకపోతె సచ్చినట్టు దిగుమంటవ్" కొమురయ్య కోపంగా.

"ఇగగిట్ల నలుగురు నాలుగు దిక్కుల గుంజినంత ఏం సాధించుతమే పొరా దుండ్రి" కోల్‌ఫిల్లర్ సామల లస్మయ్య అనుకచ్చిండు.

దాంతో రాయపోశం "ఇప్పుడు ఎవలెటు గుంజిన్రే బాంచెన్! సాధించుండ్రి! ఎవరద్దన్నడు" అన్నడు.

"ఎవరద్దంటె ఎవడాగుతడు తియ్యుండ్రి- కడుపునొచ్చినోడు ఓమ బుక్కు-తడు" లస్మయ్య.

రాయపోశం మాటలు వింటుంటె సమ్మిరెడ్డికి మండుకచ్చింది కని తమాయించు కున్నడు- ఇంతకుముందు అయితేనా- ఇటువంటి సమయాలల్ల ఒక్కొక్క దెలి గేటును ఊపికొట్టిండు- ఇప్పుడా ధైర్యంలేదు- ఇప్పుడా బలంలేదు- తానెందుకో వెన్నుపూసలేని మనిషిలాగ అయిపోయిండు- ఇన్నాళ్ళు తనవెనుక వెయ్యి ఏనుగుల బలం తీరుగున్న అన్నను నేలకూల్చిండ్రిప్పుడు- ఊకుండ మనసొప్పదు- ముందుబడ చాతగాదు- ఆట్లా ద్వైదీభావంతో సమ్మిరెడ్డి మందిలో అడికీడికి తిరుగుతున్నడు. ఎవరో పలకరిస్తున్నరు- ఎవరో ఏదో అడుగుతున్నరు- వినీవిననట్టుగా చూసీచూడ నట్టుగా తప్పుకు తప్పుకు తిరుగుతున్నడు.

"ఇన్రోజులు బుదుకుపిట్టల తీరుగ ఉరికినోళ్ళందరికి ఏమైందుర్ర" ఒక ముసలి కార్మికుడు అరిచిండు.

సమ్మిరెడ్డి తన పాదాల వైపుకు చూసుకుంటూ ఉండిపోయిండు. హాలర్ డ్రైవర్- కమ్యూనిష్టు దెలిగేటూ అయిన తాటూరి వెంకటి నేముకుంట నేముకుంట వచ్చి "పనిచేసుకుంట కొట్లాడుదాం- కాకపోతే కన్సిలేషన్ ఉండనే ఉండె" అన్నడు. ఆయన మాటమీదికెల్లి ఒక పడుచు కార్మికుడు "ఎవరూ ఎంకటి బావా! పూరాగ నల్ల పూసవై పెయినవ్- దూటికి వత్తలెవ్వా బావా" అన్నడు. ఆ మాటల్లోని వ్యంగ్యానికి మనసులోనే నొచ్చుకుని, "అదెనోయి బామ్మర్దీ రోజు రానేపట్టి" అని ఏడుపలేక నవ్విండు. ఎందుకోగాని కొందరు కార్మికులు నవ్వారు. మరెవరు మాట్లాడలేదు. బాయిమీద ఊడికాడికి గద్దల తీరుగ దెలిగేట్లు కలె మెలుగుతున్నరు. మధ్యమధ్యలో వెళ్ళి మేనేజర్ను, ఏజెంటును కలిసివస్తున్నరు.

"ఎట్ల తిరుగుతాండ్రో సూడు- కొకుల గద్దలు కలెమెలిగినట్టు- నిన్నమొన్నటి మొన్నటిదాక ఎవనికి బాయిల మీదికి అచ్చే ధైర్యం లేదుకని- ఇయ్యాల గోసులు బిగిచ్చుకోని ఉరికురికి వస్తున్నరు బిడ్డలు" అన్నడు.

"పులిని పడగొట్టింద్రే నాయిన పులిని పడగొట్టిండ్రు- నక్కలు రాజ్యం మీదికచ్చినయి" అన్నడు మరో కార్మికుడు.

సమ్మిరెడ్డికి మనసు మనసులో లేదు-

దొంగ లంజా కొడుకుల్లార ఇదంతా అన్యాయం అనీ- చార్జిషీట్లు వాపస్ తీసుకోవాలని, కార్మికులకు న్యాయంగా రావాల్సిన జీతాలు కట్టివ్వాలని, అంతదాక సమ్మెను కొనసాగించాలనీ, గొంతెత్తి చెప్పాలని వుంది.

ఒకరిద్దరు దెబిగేట్లు సమ్మిరెడ్డిని కనిపెట్టి చూస్తూనే వున్నరు. సమ్మిరెడ్డి అందరి మొఖాలూ పులుకు పులుకున చూస్తూ తిరుగుతున్నడు. దూరంగ- ఉసికె కుప్పలమీద- అల్లరి అల్లరిగా వినిపిస్తున్న దిక్కు నడిచిండు సమ్మిరెడ్డి. అక్కడ అక్కడ బ్లాక్‌స్మిత్ (కమ్మరి) వీరయ్య ప్యాకెట్ల మీద ప్యాకెట్లు దంచివచ్చి రాగాలు తీస్తున్నడు.

"బంతిపూవులా దండలు తెచ్చిన, బావరో తలుపులు తీయవే" తన తొర్రి నోటితో పాడుతోంటె వినేవారికి కుక్క ఏడ్పులాగ తోస్తోంది. మజ్దూర్ మధు నయ్య తువ్వాలును కొంగులాగ అడ్డం వేసుకుని "నే తీయజాలలేనూ, నీ మొఖము చూడలేనూ" అంటూ చెంచులక్ష్మిలాగ చింగిడిబింగిడి ఆడుతున్నడు.

చుట్టూచేరిన కార్మికులు నవ్వుతున్నరు- ఈలలు వేస్తున్నరు- చప్పట్లు చరుస్తున్నరు- నాట్యం చేస్తున్నరు- ఎవరో పాతటబ్బుపై మద్దెల వాయిస్తున్నారు.

"బాయి బందంటె ఎట్ల సంకలు గొడుతున్నరో సూడు" యేషన్ సక్కపోశం-

"చాతగానోనికి అద్దన్నోడే తల్లి దండ్రి" మరెవరో కలిపిండ్రు.

సమ్మిరెడ్డి నవ్వరాక నవ్విండు.

అంతలోనే బాయి ఆవరణలోకి బురబురలాడుతూ పోలీసు జీపు వచ్చింది. దున్నపోతులాగ బలిసిన సర్కిల్ చేతిలో రివాల్వర్ తిప్పుతూ విజయవిలాసంతో ముందుకు నడుస్తుండె-అతనికి కుడి ఎడమల-వెనుకపక్క ముగ్గురు పోలీసులు మూడు తుపాకులు పట్టుకుని కుక్కల తీరుగ బెదిరిబెదిరి చూస్తూ కార్మికుల దిక్కు నడుస్తున్నరు.

మేనేజరు ఎదురుపోయిండు 'నమస్తే' అన్నడు. సర్కిల్ తలాడించిండు.

"సూడంగ సూడంగ మనల్ను బాయిల మీదనే పిట్టపిల్లల తీరుగ కాల్చి చంపెటట్టున్నరు" అని ఒక ముసలి కార్మికుడు విచారించిండు. అందుకు ఒక పడుచు కార్మికుడు జవాబు చెబుదామనుకొని అటుపక్క ఇటుపక్క జాగ్రత్తగా చూసి, కొంచెం తమాయించుకుని "అంత సర్కిల్ కూడ ఎంత బయబడుతాందో సూడు"

అన్నడు. మొదట విచారించిన ముసలాయినె "ఔ ఇది కూడ నిజమేనోయి పిలడా" అని తలాడించిండు.

సమ్మిరెడ్డికి సర్కిల్ కనిపించగానే ఒళ్ళుమీద రోమాలు లేచినిలబడ్డాయి. మనిషి గొంతు కొరికి నెత్తురు తాగివస్తున్న పులితీరుగ సర్కిల్- అతను అడుగుతీసి అడుగువేస్తుంటె కండలు ఊగుతున్నయి. మీసాలమీద చెయ్యివేసి కార్మికులనుద్దేశించి

"బాయి నడిపిస్తున్నరా లేదర్రా" అన్నడు. మందిలోంచి ఎవరో సన్నగా అబ్బ నీ కండ్లు కాలిపోను వారివారికి ఊగితివిగదరా" అని గొణిగిండు. అంతకు మించి మందిలోంచి ఎవరూ మాట్లాడలేదు. మూగన్నల తీరుగ పోలీసులను చూస్తూ నిలబడ్డరు.

"నోర్లు లెవ్వురా ఎవనికి" చుట్టూ చూస్తూ అన్నడు, అయినా ఎవరూ నోరు మెదపలేదు. అందరూ చూసేలా మరోసారి రివాల్వర్ ఎడమచేత్తో విలాసంగా తిప్పుతూ మేనేజరువైపు పోయాడు.

"పీడేకదా సర్వయ్యను చంపింది" ఎవరో రోషంగా గొణిగారు.

"హుష్ నోరుమూసుకో" మరెవరో కసిరారు.

వివిధ యూనియన్ల డెలిగేట్లు - అధికార్లూ - పోలీసులు ఆఫీసు గదులవైపు కదిలారు.

ఆ దృశ్యాన్ని చూస్తూ ఒక కార్మికుడు. "నాయకుడు లేని తండా, నవాబు లేని జండా అన్నట్టు-అయింది మన సంగతి" అని అన్నాడు.

చాలా మంది ఆ మాటలతో ఏకీభావం ప్రకటిస్తున్నట్టుగా మౌనం వహించారు. అట్లాగే ఎక్కడివారక్కడ దిక్కుతోచనట్టుగానే వుండిపోయారు.

అంతలోనే పసుపు రంగు అంగి తొడుక్కున్న డెలిగేటు ఒకడు గసపోస్తూ వచ్చి "హైదరాబాదుకు ఫోనిచ్చినం-ఎమ్మెల్యేసాబు బైలుదేరిండు-" అన్నడు.

"ఇగ అచ్చిండు సూడు—అన్నట్టు" మందిలోంచి- "రాత్రివరకు రావాలె తెల్లారి ఏదో ఒకటి సెటిల్ అయిపోవాలె" అతనే దమ్ము తీసుకుని వివరించాడు. ఆ తరువాత ఆయన్నెవరూ పట్టించుకోలేదు. ఆయనతో పాటు మరో ఇద్దరు కార్మికులు దూరంగా జరిగి ఎమ్మెల్యేను తీసుకువచ్చి ఎట్లా లబ్ధిపొందుదామా అని ఆలోచిస్తున్నరు.

మల్లేశం వచ్చి-క్యాంటిన్లో కూర్చున్న సమ్మిరెడ్డి బుజం తట్టిండు

"అప్పట్నుంచి చూస్తున్న ఏడ తిరుగుతానవు" నవ్వుతూ అన్నడు మల్లేశం. "నేనూ నీకోసం చూసిచూసి ఈడికచ్చికూచున్న" సమ్మిరెడ్డి మామూలుగానే జవాబిచ్చిండు. ఆ తరువాత మల్లేశు మొఖంలోకి చూసిండు. అతని మొఖంలో ఏ భావమూ కనిపించలేదు. సమ్మిరెడ్డి చుట్టూ ఓమారు కలియచూసిండు. క్యాంటిన్లో కప్పులగలగల-మాటలూ-చాయ్ పూర్తిగ పలుచనౌతోందని ఎవరో కార్మికుడు-పేరు లేకుండా బూతులు తిడుతున్నడు. తిరిగి మల్లేశు మొఖంవైపు చూస్తూ-సమ్మిరెడ్డి "అయిపోనట్టే-అంతా అయిపోయినట్టే-సమ్మె ఫేలైనట్టే" అని గొణిగిండు మల్లేశు ఏమనలేదుగానీ ఎటోచూస్తూ ఉండిపోయిండు.

"నెల అయిపోయిందా- కండ్లల్ల మెరుస్తుండు" సమ్మిరెడ్డి టేబుల్ పైకి మొఖం వేళ్ళాడేసిండు.

మల్లేశు అంతూపొంతూలేని ఆలోచనలతో వేగిపోతున్నడు.

'మరైతె ఎట్లా ? ఏంచేయడం ?'

× × ×

పొద్దు వాలిపోతోంది-బయట కార్మికులు ఇళ్ళదారి పట్టారు. సమ్మిరెడ్డి-మల్లేశూ సైకిళ్ల వేసుకుని మండిలోంచి బయటపడ్డారు.

ఒకరి వెనుక మరొకరు సైకిళ్ల తొక్కుకుంటూ పోతున్నరు. మెయిన్‌స్టోర్ ముందునుంచి రైలు పట్టాల మీదికి వచ్చారు. ఇంజన్లు రాల్చిన చిట్టెం బూడిదపైనుంచి సైకిళ్లు నడుస్తున్నయి

పొద్దు పూర్తిగా ముంకింది. నెత్తుటితో తడిసిన నేలలాగ పడమటి ఆకాశం-దూవంగా, తలలునరికి నిలిపిన మనుషుల మొండాల తీరుగ ఫ్యాక్టరీ పొగ గొట్టాలు-చివ్వున పైకి చిమ్ముతున్న రక్తంలాగ బుసబుసలాడుతున్న పొగ-

సమ్మిరెడ్డికి కళ్లు తిరిగినట్టు అనిపించింది. సైకిల్ రైలుపట్టాకు తాకి పడిపోయింది. కంకరరాళ్ళపై పడిపోయిన సమ్మిరెడ్డిని దబదబ వచ్చి హుస్సేన్ లేపాడు.

"ఏమైందన్నా" అంటూ ఆత్రంగా అడిగాడు. సమ్మిరెడ్డి మాట్లాడకుండా మల్లేశు మొఖంలకు చూస్తు నిలబడిపోయిండు. క్రమంగా ఆయన కండ్లలోంచి కన్నీరు రాలింది. మల్లేశు మరేం అడగలేదు. సమ్మిరెడ్డి ఏమీ చెప్పలేదు.

కుడి ప్రక్క మూరికి తుమ్మల మధ్యగా దారి-దారికి ఎడమ ప్రక్క మంగలి షాపు- ఆ షాపు ముందు దుమ్ములో కొట్టుకుంటున్న హృదయం - నెత్తురోడుతున్న హృదయం- మరుక్షణంలో నవ్వుతున్న నర్సన్న- మల్లేశుకు కూడా ఒక్కసారిగా కడుపులోంచి దుఃఖం పొంగుకచ్చింది. కాని ఏడవలేదు. సమ్మిరెడ్డిని ఓదార్చిండు.

"ఇట్ల బాధపడితె ఎట్లనే సమ్మన్న" ధైర్యం చెప్పిండు. సమ్మిరెడ్డి మనసు తేలిక అవడంకోసం మరేవో నాలుగు మాటలు మాట్లాడిండు. "రేపు డూటికి రాకపోయేవు" అని హెచ్చరించి తను పోవాల్సిన బస్తీవైపు సైకిల్ తిప్పిండు- సమ్మిరెడ్డి మనసు కూడదీసుకుంటూ ముందుకు-ఇంటిదారి పట్టిండు.

అప్పటికే చీకటి చిక్కగా పడుచుకుంది.

× × ×

సమ్మె అయిదోరోజు- నిన్నటి సమయమే-కార్మికులు ఎప్పటిమాదిరిగానే మ్యాన్-వేకిక్కు నడుస్తున్నరు- ఇద్దరులాల్చిలో వున్న రైటరు నాగయ్య కోపంతో అరుస్తున్నడు.

"పోస్టర్ తరువాత చదువుకుందురుగని ముందుగ మష్టర్సు చెప్పండిరా మొగలార అవుకల మిండెడు ఆగుతలేదు" అంటూ కార్మికుల మష్టర్సు వేస్తున్నడు.

మ్యాన్-వే కిటికీ ప్రక్కన ఎరుపు అక్షరాల్లో పోస్టర్ అతికించివున్నది.

కార్మికులు గుంపుగా ఆ పోస్టర్ చుట్టూ గుమిగూడారు. చాలామంది కార్మికులు కళ్ళతోనే చదువుకుంటున్నరు- మరికొందరు పెదిమలాడిస్తున్నరు. చదువురాని కార్మికులు మిగతావారి మొఖాల్లోకి చూస్తున్నరు.

"ఎవళకువాళ్ళే నదువుకోబట్టిరి- గందుకేనానో మిమ్ములెవ్వండర్ని సదివించింది." సీనియర్ కోతకట్టర్ రాజమ్మదు రొండ్లకు చేతులానించుకుని గట్టిగానే అన్నడు.

"సీయప్పసిపోకడ కాలిపోసూ" మరో కార్మికుడు- ఎర్రతేలు లాంటి ఫ్లోటింగ్ బదిలీఫిల్లర్ (కేజువల్ వర్కర్) బీక్యా రాజమ్మదు దిక్కు తిరిగి "పోష్టరేసింద్రు" అన్నడు.

"సరేనోయి మనుమడా! ఎవరేసింద్రు? ఏమనేసింద్రు" రాజమ్మదు "అన్నలేసింద్రు" బీక్యా చెప్పిండు. అందాకవింటున్న మరో కార్మికుడు "చెయ్యిమనా వద్దనా" అని సందేహంగా అడిగిండు- రాజమ్మదు కనుబొమలు పైకెత్తి "ఎవల డూటి వాళ్ళ చేసుకోండ్రని" అన్నడు.

"అన్నలు గడ్లేత్తారు !" అతను నమ్మలేదు. రాజమ్మరు ఆ కార్మికుని భుజం మీద పరాచికంగ ఒక్క చరుపు చరిచిండు.

"కొట్లాడుమనకపోతె అన్నలు వద్దంటారో" అన్నడు. అతను నైజాం కాలపు సంగతులూ, రజాకార్లు, కమ్యూనిష్టోళ్ళ గురించి సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతా వుంటాడు.

కార్మికుల్లో ఆ పోస్టర్ పెద్ద సంచలనం రేపింది. ఇంతా చేస్తే మళ్ళీ పోస్ట రెట్లా పడ్డది అని డెలిగేట్లు నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తున్నరు. వీళ్ళలో కొంచెం భయం మళ్ళీ ప్రారంభమైంది. బాయినడుపుదాం అనే ధైర్యం అడుగంటింది. యాజమాన్యం మళ్ళీ మవునం వహించింది.

సమ్మిరెడ్డి ఆశ్చర్యానికి అంతులేదు. మళ్లా ఎవరైన అన్న వచ్చిండా ? వస్తె తమకు తెలియదా ? మరెట్లా ? మొత్తంమీద చాలా హుషారు వచ్చింది.

"కొత్త యూనియన్లను తరిమికొట్టండి-

కార్మికులకు ఇష్యూచేసిన చార్జిషీట్లు వాపస్ తీసుకోవాలి-

కార్మికుల సమ్మెకాలానికి కూడా వేతనం కట్టివ్వాలి ?

సమ్మె కొనసాగించండి-" అంటూ ఒక కార్మికుడు గట్టిగా చదువుతున్నాడు.

ముఖం ముడుచుకుపోయిన సర్కిల్, తెల్లగా వాడిపోయిన మొఖపు మేనేజరూ- ఇద్దరూ ఆఫీసు గదిలోంచి బయటకు వచ్చేసరికి అధికార పార్టీ ఎమ్మెల్యే అట్టహాసంగ బీరపువ్వురంగు వేషంలో కారు దిగిండు. ఆయనతోపాటు కొత్త బిచ్చగాళ్ళ తీరుగ మరో ఇద్దరు లీడర్లు దిగిండ్రు

"అత్తాండు సూడో నప్పతట్ల ముండకొడుకు" అని గుంపులోంచి ఎవరో అన్నారు.

"మజ్దూరుగున్నప్పుడు పీరీల కట్టె తీరుగుండెటోడు".

"ఎమ్మెల్లే అయినంక బొత్త పెరిగింది కొడుక్కు".

"అప్పుడు జీతం దొరుకంగనే కొడుకు సారాదంచి ఎనుగుల్ల వీడే, బూడిది కుప్పల్ల వీడే- అచ్చోలీని ఖదర్ పూర్తిగ మారినట్టున్నది".

కార్మికులు తలా ఒక రకంగా కామెంట్లు చేశారు. చుట్టూ అనుచరగణం కదులగా డాంబికంగా నడుస్తూ వచ్చిన ఎమ్మెల్యే కార్మికుల ముందుకువచ్చి ఆగిండు.

"సోదరులారా ! నేను అసెంబ్లీ జరుగుతుంటె నడుమనే లేసి రావాల్సి వచ్చింది, వస్తున్నప్పుడు అన్నగారికి చెప్పే వస్తున్న.

కంపిని మెడలు వంచి హక్కుల్ని తీసుకుందాం...." "అట్నే నీ బాంచెన్" మందిలోంచి ఎవరో.

"అవసరంబడితె హైకోర్టుదాకాపోదాం".

"అన్నుండగ మళ్ళ హైకోర్టుకెందుకోవాయీ" మరెవరో తీకునం తీశారు.

"మీరు బాయిపడుపుండ్రి- కేసును అన్నదాక తీసుకపోదాం- అన్న లేబర్ మినిష్టర్‌తోని మాట్లాడి...." "గాపిత్తు ముందే పిత్తుతెగాదా ముందుగ బాయినడు పల్లట బాయి" కార్మికుల్లోంచి కోపంగా ఎవరో-

ఎమ్మెల్యేకు మాటలు వినిపించేయి కాని మనిషి కనిపించలేదు. అటు మేనేజిమెంటుకూ ఇటు కార్మికులకూ చెప్పిచెప్పి జగ్గెడన్ని మంచినీళ్ళు తాగిండు ఎమ్మెల్యే- హైద్రాబాద్ నుంచి ఫోనొచ్చిందని మళ్ళా కారెక్కిండు. కార్మికులు నవ్వుతున్నరు. "ఎందుకచ్చినట్టు ఎందుకు పోయినట్టు వీడు" ఒకాయన ఆశ్చర్యంలో మునిగిండు.

తరువాత కార్మికులంతా కూడబలుక్కున్నట్టుగా బిలబిలలాడుతూ సైకిల్ షెడ్డు వైపు కదిలారు-

సమ్మిరెడ్డి మల్లేశు చేయి దొరకబుచ్చుకొని 'పోస్టర్ చూసినవా' అన్నట్టుగ చూసిండు మల్లేశు 'చూసిన' అన్నట్టుగ తలాడించిండు సమ్మిరెడ్డి మరేదో అడుగబోయిండు. మల్లేశు సమ్మిరెడ్డి చెయ్యి గట్టిగా నొక్కిండు వద్దని.

ఉత్సాహంగా ముచ్చట్లు బెడుతూ కార్మికులు కదులుతున్నరు. ఆ మందిలోంచి కాస్తా బయటకు వచ్చినంక సమ్మిరెడ్డి మల్లేశుతో అన్నాడు.

"మనకు తెలువకుంట-ఇక్కడికి ఎవరన్న అన్న అచ్చిండంటవా"

మల్లేశు ముసిముసిగా నవ్విండు.

సమ్మిరెడ్డి కనుబొమలు ముడివేసి మల్లేశు మొఖంలకు చూసిండు.

"నేనే రాసుకచ్చి ఏసిన" మల్లేశు.

సమ్మిరెడ్డి నోరెళ్ళబెట్టిండు. తిరిగి మల్లేశు చెప్పకచ్చిండు. "మొన్నటినుంచి మనుసు మనుసులలేదు. నువ్వు బైటికి కనిపిచ్చినప్గాని నాకు నీ తీరుగనే లోపల అంత ఎట్లనో అనిపిచ్చింది.

ఎటు చూసినా ఏ దారి కనిపియ్యకపాయె. ఇగ అన్నుంటె ఏంజేసెటోడు అని ఆలోచన చేసిన. గంతే! నిన్న పోతపోత బజారుకుపోయి కాయితాలు తెచ్చి రాసి, రాత్రి బదిలికి అచ్చినట్టు అచ్చి అతికిచ్చిపోయిన. →

చైనీస్ కథ :

తామరమడుగు

సున్ లీ

మబ్బులేని ఆకాశంలో మచ్చలేని చంద్రవంక చల్లగా వెలుగుతూంది. పిండారబోసినట్టున్న వెన్నెల్లో చక్కగా వూడ్చిన వాకిలి అద్దంలా మెరిసిపోతూంది. అది 1940 ఎండాకాలం. ఆ పగలే చీరిన తుంగ పరకలు పదునుగా మెత్తగా వాకిట్లో ఓ వార అల్లకానికి సిద్ధంగా ఉన్నాయి. ఒద్దిగ్గా పోగుపెట్టారు.

ముంగిట్లో కూచున్న ఓ అక్క పొడుగాటి వేళ్ళు చకాచకా తిప్పుతూ తుంగ పరకల్ని గబాగబా జడలా అల్లుతూంది. సుతిమెత్తని తుంగపాయలు వయ్యారంగా ఆమె చేతుల్లో పడి తిరుగుతూ అందంగా హత్తుకుపోతున్నాయి.

బియాంగ్డిన్ సరస్సు హూబె రాష్ట్రం నడుమ ఉంటుంది. అక్కడి తుంగ, రెల్లు చైనా అంతటా పెద్ద పేరు మోసినవి. అవి ఏయే వూళ్ళలో పెందూరో సాలు మొత్తం మీద ఎంత దొరుకుతుందో ఆ వివరాలు నేను ఖచ్చితంగా చెప్పలేను. కాని ఏటేటా ఆరెల్లు పూత వెల్లి విరిసి రేకులు బంగారు రంగుకు తిరగ్గానే కోసి ఒడ్డున కుప్పలు పెడితే అదో పెద్ద "గ్రేట్ వాల్" లాగా కనబడుతుందని మాత్రం అంటారు.

→ —తప్పో! ఒప్పో! అన్నలు కలిసినంక 'శెనార్తి' అంట" మల్లేశు చెప్ప కచ్చిండు.

సమ్మిరెడ్డి మల్లేశును కావలించుకున్నడు. "తప్పెట్ల అయిద్ది? నీ తీరుగనే నేనూ, బాలయ్య కడుమోళ్ళందరం తండ్లాడుతున్నం గద- ఒక్కముచ్చట గిట్లగిట్ల అంటె అందరం కలిసే చేద్దుం కదా" అన్నడు సమ్మిరెడ్డి.

"తోసలేదు. ఇగముందు గట్లనే చేద్దాం" మల్లేశు అన్నడు.

సమ్మిరెడ్డి మల్లేశు చేయి గట్టిగా నొక్కి విడిచిండు.

షెడ్లోంచి సైకిళ్ళు తీసిండ్రు

తారు రోడ్డుమీద సైకిల్ చక్రాలు జరజర జారిపోతున్నయి. వాళ్ళిద్దరిని ఏదో ఉద్వేగం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

(అమరుడు కామ్రేడ్ మేకల నర్సయ్య స్మృతిలో)

ఆడవాళ్ళు అందమైన తుంగ చాపలు అల్లుతారు. కళ్ళాల్లో, ముంగిళ్ళలో ఎక్కడ పడితే అక్కడ తెల్లటి నురుగుల్లాటి చాపలు కుప్పలుకుప్పలుగా అల్లుతుంటారు. తొలకరి వర్షాలు కురిసి కలువ వాగు పొంగిపారుతూ వుంటే ఆ చాప చుట్టలు వేసుకొని చిన్నాపెద్దా నావలు ఎన్నెన్నో పట్నానికి ప్రయాణం కడతాయి. మారుమూల పల్లెలు పట్నాలతో సహా దేశం నలుమూలలా యీ చాపలు నిండి పోతాయి. ముద్దులొలికే డిజైన్లతో రకరకాల సైజుల్లో చూడ ముచ్చటగా వుండే ఆ చాపలు దేశమంతా ఎగబడి కొంటారు.

బయాంగ్డిన్ చాపలంటే వాటికవే సాటి అని పెద్ద ప్రతీతి.

అల్లుతున్న చాప అప్పటికే సగం పూర్తయింది. ఆ చాపమీద కూచుని అల్లుతూ వున్న పడుచు మంచుతరగమీదో మబ్బుల సింహాసనం మీదో కూచున్నట్టుంది. అల్లుతూ అల్లుతూనే ఆమె సంస్సు మీదుగా చూపు సారించి కలువల వాగు దిక్కు కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది. నీటి మీద సన్నని పొగమంచు లేస్తోంది. తడిగాలి మీద తామరతూళ్ళవాసన చల్లగా తేలి వస్తోంది.

మునివాటిక దడి యింకా మూసెయ్యలేదు. మగడింకా యింటికి రాలేదు.

అతను వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. అతనికి పాతికేళ్ళు. ఇరవయ్యేళ్ళున్నా వుండొచ్చు. కాళ్ళకు చెప్పుల్లేవుగాని నెత్తిమీద పెద్దగడ్డి టోపీ పెట్టుకున్నాడు. నల్ల పంట్లాం తెల్లచొక్కా తొడుక్కొని ప్యాంటు మోకాళ్ళవరకు మల్చుకున్నాడు. అతని పేరు సుషెంగ్. 'చిన్నతుంగ' గ్రామం జపాన్ వ్యతిరేక గెరిల్లా దళానికి అతను నాయకుడు. ఆ వూరి కమ్యూనిస్ట్ పార్టీ శాఖకి అతను కార్యదర్శి. తన దళ సభ్యుల్ని తీసుకుని జిల్లా ముఖ్యపట్నంలో ఓ మీటింగుకి వెళ్ళివస్తున్నాడు. ఆయన వాకిట్లో అడుగుపెట్టేసరికి ఆమె చిరునవ్వు చిందించింది.

"ఏం యీరోజు యింత పొద్దుపోయింది?" అంటూనే లేచి అన్నం తేవడానికి యింట్లోకి బయల్దేరింది.

"నేను తినేవచ్చా. యిప్పుడింకేం వద్దు" అన్నాడు.

ఆ మాట వింటూనే ఆమె మళ్ళీ చతికిలబడింది. భర్త ముఖం అంతా గంభీరంగా వుంది. ఆయనేదో వుక్కిరిబిక్కిరవుతున్నట్టు మొసతీస్తున్నాడు.

"మిగిలిన వాళ్ళంతా ఏరీ?" అడిగిందామె.

"వాళ్ళింకా పట్నంలోనే వున్నారు. నాన్న ఎలా వున్నాడు"

"నిద్దరోతున్నాడు".

"సియ్యహంవా"

"వాడు పగలంతా తాతతో కలిసి ఎండుకాయలకోసం తిరిగాడు. పొద్దుపోక ముందే నిద్దరోయాడు. అవునుగాని, మిగతా వాళ్ళంతా రాలేదేం ?"

సుషెంగ్ కావాలని నవ్వు తెచ్చుకుంటూ గొంతు సవరించుకున్నాడు.

"ఏకేవయిందివాళ - ఏంసంగతి ?"

"నేను రేపే సైన్యంలో చేరుతున్నాను" వీలయినంత మెత్తగా సాఫీగా చెప్పాడు.

రెల్లు గడ్డి కోసుకుంటే చటుక్కున చెయ్యివెనక్కి తీసుకున్నట్టు ఆమె చెయ్యి తిప్పింది. నోట్లో వేలేసుకుని అతని మొహంలోకి గుచ్చిగుచ్చి చూసింది.

"ఈ రోజు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. తొందర్లోనే జపాన్ వాళ్ళు యింకా మరికొన్ని బేసులు ఏర్పాటు చెయ్యొచ్చని అంటున్నారు. వాళ్ళు గనుక టాంకౌలో బేస్ పెట్టేరంటే యిక్కడ మనపని పూర్తిగా తలకిందులవుతుంది అది యిక్కడకి ఎంతోదూరం లేదుకూడా. జపాన్ వాళ్ళని రాకుండా అడ్డగించడానికి జిల్లా బ్రిగేడ్ ఒకటి ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అందులో చేరుతానని నేనే మొట్టమొదట పేరిచ్చాను." సమాధానపరుస్తున్నట్టు చెప్పాడు.

ఆయన భార్య తలవంచుకుని తనలో తాను గొణుక్కుంటున్నట్టు అంది.

"అందరికంటె ఓ అడుగు ఎప్పుడూ ముందే వుంటావు. అంతే కదా?"

"నేను మన వూళ్ళో గెరిల్లాలకి బాధ్యుణ్ణి. కేడర్నికూడా కదా. మరి నేను ముందుండవలసిందే కదా. మిగతా వాళ్లు కూడా చేరుతామన్నారు. అయితే వాళ్ళ వాళ్ళంతా ఎక్కడ వెనక్కి లాగుతారోనన్న భయంతో వాళ్ళు యింటికి రాలేదు. అందరి తరుపునా వాళ్ళ కుటుంబాలకు నచ్చచెప్పమని నన్నే పంపేరు. అందరి భార్యల కంటె నువ్వేబాగా ఆలోచించగలవనీ అర్థం చేసుకుంటావనీ అందరూ అన్నారు."

మారు మాటాడకుండా అంతా విని, ఆమె ప్రశాంతంగా అడిగింది.

"నేను నిన్ను వెళ్ళొద్దని ఏమీ అనను. కానీ, మా సంగతేవిటి "?

గట్టిగా మాట్లాడొద్దన్నట్టు అతను తండ్రి గది వేపు చూస్తూ నోటిమీద వేలు అడ్డం పెట్టుకున్నాడు.

"మీకు తప్పకుండా సాయం చేస్తారు. కాని మన వూరే చాలా చిన్నది. ఈసారే ఏడుగురు సైన్యంలో చేరుతున్నారు. అంటే, యిక యింటి దగ్గిర మిగిలే యువకులు ఎక్కువ మంది వుండరు. మనం ప్రతీ దానికీ యితరుల సాయంకోసం ఎదురుచూడలేం. ముఖ్యంగా బరువంతా నువ్వే మొయ్యాలి. నాన్న ముసలాడై పోయాడు. హుంవా మరీ పసివాడు. ఏం చెయ్యగలడు?"

ఆమె గొంతులో దుఃఖం గురగురలాడింది. కాని కళ్ళనీళ్ళు కళ్ళలోనే ఆపుకుంది.

"మనమంతా ఎందుకోసం పోరాడుతున్నామో నీకు తెలుసుకదా. మరి, అంతకంటె ఏంచెప్పాలి" అన్నాడు ఆయన ఆప్యాయంగా.

సుషెంగ్‌కు ఆమెను మరికొంత ఓదార్చాలనే వుంది. కాని సమయం చాలదు. బయల్దేరేలోగా అతను చెయ్యాల్సిన పనులు యింకా చాలా వున్నాయి.

"నేను లేనప్పుడు ఈ బరువు నువ్వు మొయ్యాక తప్పదు. మనం జపాన్ వాళ్ళను తరిమేసామంటే, యికనేను యింటి కొచ్చేస్తే, నిన్నేవీ కష్టపెట్టను. అన్నీ నేనే చూసుకుంటాను."

ఈ నాలుగు మాటలూ చెప్పి సుషెంగ్ మిగతావాళ్ళ యిళ్ళకు బయల్దేరాడు. తాను తిరిగొచ్చి తండ్రికి అన్ని విషయాలూ వివరిస్తాననంటూ బైటికి దారి తీసేడు.

తిరిగి కోళ్ళు కూసేవరకు అతను యిల్లు చేరలేదు. ఆమె అంతదాకా అలా వాకిట్లోనే బొమ్మలా కూచుని అతనికోసం ఎదురుచూస్తూ వుంది.

"నాకు చెప్పాల్సిందింకేమైనా వుందా!" అందామె సమాధానపడుతూ.

"నిజానికి పెద్దగా ఏమీ లేదు. నేను లేకపోయినా నువ్వు అభివృద్ధి కావాలనే సంగతి మర్చిపోవద్దు. కష్టపడి పనిచెయ్యి, రాయడం చదవడం నేర్చుకో".

"ఊఁ ! అలాగే."

"మిగతావాళ్ళకంటె నువ్వు వెనుకబడకూడదు."

"అలాగే....యింకేమైనా?"

"జపాన్ వాళ్ళగ్గాని, దేశద్రోహులగ్గాని నువ్వుబతికుండగా దొరకొద్దు. నువ్వు పట్టుబడిపోతే కడకంటా పోట్లాడు." అతను చెప్పదల్చుకొన్న ముఖ్యమైన సంగతి యిదొక్కటే. కళ్ళనిండా నిండిన నీళ్ళు తొణికి రాల్తూవుంటే ఆమె అలాగేనంటూ తలూపింది.

తెల్లవారేక ఆమె ఒక జతబట్టలు కొత్త తువ్వాలు ఒక జత గుడ్డ చెప్పులు చిన్న మూటకట్టి యిచ్చింది. మిగతా వాళ్ళ భార్యలు కూడా అలాంటివే చిన్న చిన్న మూటలు సుషెంగ్ చేతికి యిచ్చారు. కుటుంబం అంతా అతన్ని సాగనంపారు. మన పడి చేయిపుచ్చుకుని తండ్రి ముందుకొచ్చాడు.

"సుషెంగ్! నువ్వు చేస్తున్న పని చాలా సరైంది. అందుకే నేను నిన్ను ఆపడం లేదు. నువ్వు మనసులో ఏమీ దిగులు పెట్టుకోకుండా వెళ్ళు. నువ్వు తిరి గొచ్చేదాకా కోడల్ని బాబుని నేను చూసుకుంటాను నీకేం దిగులొద్దు" అన్నాడు.

అతన్ని సాగనంపడానికి ఊరుఊరందరూ కదిలివచ్చారు. ఆడ, మగ, పిల్లలు, పెద్దలు, అందరూ సరస్సు వరకూ వచ్చి సాగనంపారు. అందరివైపూ చూసి చిరునవ్వు చిందిస్తూ సుషెంగ్ నావలో కాలుపెట్టి కదిలిపోయాడు.

అయితే ఆడవాళ్ళ మనస్సుల్లో మాత్రం లోలోన ఏదో తీగ సాగుతున్నట్టే అనిపించింది. సుషెంగ్ వెళ్ళిన మూడోనాడు నలుగురి భార్యలూ ఆయన యింట్లోనే కూడేరు, సంగతీ సందర్భమూ మాటాడుకోడానికి

"వాళ్ళింకా యిక్కడే ఎక్కడో వున్నట్టు కన్పిస్తూంది. వాళ్ళప్పుడే అంత దూరం ఏమి వెళ్ళిపోరు. నాకేమీ పనపెట్టాలని లేదు గాని, ఆయనకొక జుబ్బా యివ్వాల్సింది వుండే, మర్చిపోయాను" అంది ఒకామె.

"ఆయనకి నేనో ముఖ్యమైన సంగతి చెప్పేదుండె"— రెండో ఆమె

"టాంగ్కౌలో జపాన్ వాళ్ళు బేస్ పెడుతున్నారట. అలాగని విన్నాన్నేను." అంది సుషెంగ్ భార్య.

"మనం వాళ్ళకి ఎదురుపడే అవకాశమేలేదు. మనం రివ్వున వెళ్ళివచ్చేస్తే సరి, ఏం కాదు" అన్నది మరొక యువతి.

"నాకైతే వెళ్ళాలనిలేదు. కాని మా అత్తే ఒక్కసారి చూసిరమ్మని మరీ పోరు పెడుతూంది. ఎందుకో ఏమిటో తెలిస్తే బావుండు" నాలుగో ఆమె.

ఎవ్వరికీ ఒక్కమాటైనా తెలియనివ్వకుండా ఆ నలుగురు యువతులూ ఓ చిన్న తెప్ప తీసుకుని వాగులోపడి నడుపుకుంటూ అవతల ఒడ్డునున్న 'మా' గ్రామం చేరుకున్నారు.

అక్కడ భర్తల కోసం బాహాటంగా వెతికే సాహసం చేయలేదు గాని, వూరి చివరనున్న ఒక బంధువులింటికైతే చేరారు.

"మీరు చాలా కొద్దిలో తప్పారు" అన్నారు అక్కడి వాళ్ళు. "నిన్న సాయం కాలం వరకూ కూడా వాళ్ళిక్కడే వున్నారు. కాని రాత్రి ఎప్పుడో లేచి వెళిపోయారు. ఎక్కడికి వెళ్ళారో ఏమో మాకెవరికీ తెలీదు. అయితే, మీరేమీ బెంగ పడాల్సిన పని లేదు. సుషెంగ్‌ను నేరుగా ప్లెటూన్ ఉపనాయకుణ్ణి చేశారని విన్నాం. వాళ్ళంతా గొప్ప ఉత్సాహంగా ఉన్నారు." అని చెప్పారు.

సిగ్గుతో మొహాలు కందగడ్డల్లా చేసుకుని మళ్ళీ తెప్ప వేసుకుని ఆ యువతులు వెనక్కి మళ్ళారు. పొద్దు నడినెత్తిమీది కొస్తూంది. ఆకాశంలో ఒక్క మబ్బయినా లేదు. నదిమీద మాత్రం, అటు వరిపొలాల మీంచీ యిటు రెల్లుపూత మీంచీ చల్ల గాలి తోల్తూంది. వెండి వెలుగులు తళ తళ మెరిసిపోతున్న ఆ విశాల జలరాశిమీద అప్పుడు వాళ్ళ నావ ఒక్కటే తేలివస్తూంది.

నిరాశచెంది చిన్నబుచ్చుకున్న ఆ నలుగురూ ఎవరికి వారే లోలోపల తమ భర్తల్ని నిందించుకుంటూ వాళ్ళని మనసులేని మృగాలని ఆడిపోసుకుంటున్నారు. అయితే యువతరం ఎప్పటికీ తిరుగులేని ఆశాజీవులే అందులోనూ ఆడవాళ్ళకు కష్టాలు మరిచిపోయే ప్రత్యేక నేర్పు వుంటుంది. కొద్దిసేపట్లోనే వాళ్ళు నవ్వుకుంటూ మళ్ళీ మాటల్లో పడ్డారు.

"అయితే వాళ్ళంతా అప్పుడే వెళిపోయారన్నమాట".

"వాళ్ళు జీవితంలో ఎప్పుడూ లేనంత ఆనందంగా వుండి వుంటారని నేను ఖచ్చితంగా చెప్పగల్ను. కొత్త సంవత్సరం కంటె, పెళ్ళాడ్డం కంటె యిదే వాళ్ళ కెంతో ఎక్కువ."

"వాళ్ళు అంకెకి రాని పోట్లగిత్తల్లాటి వాళ్ళు. వాళ్ళని కట్టిపడెయ్యటం ఎవ్వరి తరమూ కాదు."

"లేదు, అలా అనకు, వాళ్ళంతా బయటపడతారు".

"నన్నడుగు చెప్తాను. సైన్యంలో చేరిం దగ్గర్నుంచి మా ఆయన యింటి గురించి ఒక్కసారైనా సరిగ్గా పట్టించుకుంటే ఒట్టు".

"ఔను అది నిజం. ఒకసారి కొందరు యువ సైనికులు మా యింట్లో బస చేశారు. తెల్లారింది మొదలు పొద్దుపోయేదాకా ఒకటే పాటలు. మనమైనా ఎన్నడూ

అంత తుళ్ళింతలాడుతూ వుండి వుండం! వాళ్ళకి చేతినిండా పనిలేకపోతే వాళ్ళే డిగాలుపడి కూచుంటారనుకున్నాను. కాని నాదే బుద్ధి తక్కువ. వాళ్ళేం చేసారను కున్నావ్, మా దొడ్డి గోడమీద వరసగా తెల్లటి సున్నాలు చుట్టి ఒకరి తర్వాత మరొకరు టార్గెట్ ప్రాక్టీసుకు తలపడ్డారు. అప్పుడుకూడా ఎంత సేపూ పాటలు పాడు కుంటూనే."

అలా కబుర్లాడుకుంటూ వారు సునాయాసంగా తెడ్లు వేసుకుంటూ అలవోకగా పోతూవుంటే నావకిరుపక్కలా నీళ్ళు గలగల్లాడుతూ అలలు లేస్తున్నాయి. ఒకామె చేతికందిన చిన్న నీటి మొక్కని టప్‌మని తెంపింది. మళ్ళీ దాన్ని వాగులోకే విసి రేసింది. ఆ తూడు అక్కడే అలా స్థిరంగా తేలుతూవుంది.

"ఇంతకీ వాళ్ళు ఎటుపోయారో!"

"ప్రపంచం చివరికి ఎక్కడికైనా పోనీ, నాకేం"

"చూడు, చూడు! అది నావేకదూ"

అందరూ మెడలు సాచి దూరానికి చూపులు నిగిడించారు.

"ఔనౌను. అనుమానం లేదు. వాళ్ళు జపాన్ సైనికులే. ఆ డ్రెస్సులు చూడు."

"గెడవెయ్యి, వేగం. వేగం తప్పుకోవాలి!"

ప్రాణాలు చేతబట్టుకుని పరుగు ప్రారంభించారు. ఇటువంటి ప్రమాదంలో ఎన్నడూ యిరుక్కోకూడదని ఒకరు లోలోన గొణుక్కుంటూ వుంటే, తమని ఒంటరిగా విడిచిపోయిన భర్తల్ని లోలోపల తిట్టుకుంటూంది యింకొకామె. అయితే వెంటనే వారు ఆ ఆలోచనలన్నీ కట్టిపెట్టి నావ వేగం పెంచారు. ఇప్పుడు తెప్ప త్వర త్వరగా నడిపించాలి.

ఆ పెద్ద నావ త్వర త్వరగా తరుముకుంటూ వస్తుంది.

జపాన్ వాళ్ళు రాగలిగినంత వేగంగానూ వస్తున్నారు.

ఈ యువతులందరూ ఈ నది ఒడ్డునే పుట్టి పెరిగిన వాళ్ళు కావడం పెద్ద అదృష్టం. వాళ్ళ నావ గాలిలో తేలిపోతున్నట్టు దూసుకుపోతోంది అది ఎగిరి దుమికే చేప పిల్లలాగా గెంతులేస్తూ పోతూంది. అసలు నీటిమీద ఆననే లేదన్నట్లు రివ్వున పోయింది. వాళ్ళింత పసి పిల్లలప్పటి నుంచి తెప్పలమీద తిరిగిన వాళ్ళే. దారం తీయడమో కుట్టుపోయడమో చేసినంత వేగంగానూ వాళ్ళు తెడ్డు వెయ్యగలరు.

శత్రువు వాళ్ళ నావను దాటగలిగితే వాళ్ళు నీళ్ళలో లోతుకు మునిగిపోతారు.

ఆ పెద్ద బోటు మరింతగా వేగం పెంచి ముందుకు దూసుకువస్తూంది. వాళ్ళు జపాన్ వాళ్ళే. ఏమీ అనుమానంలేదు. యువతులందరూ పళ్ళు బిగపట్టి భయాన్ని అణగదొక్కుకుంటున్నారు. చేతుల్ని వణక నివ్వకుండా తెడ్లు గట్టిగా పట్టుకున్నారు. అవి నీటిని తప తప నెట్టుకుంటూ తెప్పని నిబ్బరంగా ముందుకు తోసుకుపోతున్నాయి.

"కలవల మడుగులోకి పోనిద్దాం. అంత పెద్ద బోటు రావాలంటే అక్కడ లోతు సరిపోదు."

నావను అటు పరుగు తీయించారు. ఆ మడుగు కొన్ని ఎకరాల విస్తీర్ణం ఉంది. కనుచూపు మేర అన్ని పక్కలా తామరాకులు ఒత్తుగా పరుచుకుని వున్నాయి. సూర్యకిరణాల బంగారు కాంతిలో మెరిసిపోతూ అవి కంచుగోడ పెట్టినట్టున్నాయి. ఎర్రటి తామర మొగ్గలు బాణాల్లా నీటిమీద పొడుచుకువచ్చి బయాంగ్టిన్ సరస్సును కాపలా కాస్తున్న సెంట్రీలా వున్నాయి.

వారు తమ నావను బాడుగువైపుకు పోనిచ్చారు. చివరగా తమ బలమంతా కూడదీసుకుని ఆ చిన్న నావను తామర పద్మాల మధ్యకి లాక్కొచ్చారు ఈ అలికిడికి అడవి బాతులు రెక్కలల్లార్చుకుంటూ ఎగిరి కీచుమని గోలచేశాయి.. నీటిమీదే గింగిరాలు కొట్టాయి. ధన్....ధన్....మంటూ వరసగా తుపాకీ గుళ్ళు పేలాయి.

అంతా గందరగోళం అయింది. వాళ్లు అచ్చితంగా శతృవు ఆంబుష్‌లో పడ్డట్టే. ఇక తప్పించుకునే ఆశే లేదు. అందరూ ఒకేసారి నీట్లోకి దూకేశారు. అయితే ఆ పేలిన తుపాకులన్నీ అటు నది వైపు పేలేయి తప్ప తామున్న మడుగుదిక్కు కాదని అప్పుడే గమనించడంతోనే వెంటనే నావ అంచును పట్టుకుని జాగ్రత్తగా అటు తొంగిచూశారు. తమ దగ్గర్లోనే ఓ పెద్ద తామరాకు కింద మనిషి తలకాయ కనపడింది. మిగిలిన శరీరమంతా నీటిలో మునిగి వుంది. అతను సుషెంగే. అటూ యిటూ చూస్తే కుడి ఎడమల్లో వారి వారి భర్తలు కనపడ్డారు.

"ఓహో....అయితే వీరు యిక్కడున్నారన్న మాట!"

అయితే ఆ తామరాకుల కింద దాగున్న మనుషులకు తమ భార్యల వంక కన్నెత్తి చూసే తీరిక లేదు. శతృవుపైకి తదేకంగా గురి చూస్తూ వారు అదే ధ్యాసలో మునిగిపోయారు. వెంట వెంటనే నాలుగైదు వరుసలు తుపాకీ గుళ్ళు పేలాయి. నాలుగైదు రౌండ్లు తుపాకులు పేల్చిన తరువాత చేతి బాంబులు విసిరి వారు ముందుకురికారు.

ఆ గ్రెనేడ్లు శత్రు నావను మొత్తంగా నీట్లో ముంచేశాయి. చిందర వందరై ఎగిసిపడే నీళ్ళు దట్టమైన పొగ తప్పితే మరేమీ కానరావడం లేదు.

నవ్వుతూ, తుళ్ళుతూ మన యువకులంతా తమ బహుమతుల్ని నీటి నుండి బైటికి లాగుతున్నారు. చేపల్ని పడుతున్నట్టు వారు బుడుంగు బుడుంగుమని అడుక్కు మునుగుతున్నారు. శతృవు యొక్క రైఫిల్స్, తూటా బెల్టులు, నీళ్లోడు తున్న పిండి, బియ్యం సంచులు ఒక్కొక్కటి పోటీపడి బైటికి లాగారు. అలలమీద వూగులాడుతున్న ఒక బిస్కట్ డబ్బా కంటపడేసరికి సుషెంగ్ బారసాచి యీదు కుంటూ పోయి దాన్నందుకున్నాడు.

తడిసి ముద్దయిపోయిన ఆ యువతులందరూ తిరిగి తమ నావపైకెక్కారు. బిస్కట్ల డబ్బా ఒక చేత్తో పట్టుకుని రెండో చేత్తో నీటిని బలంగా తోసుకుంటూ సుషెంగ్ వాళ్ళకొక్క బొబ్బ పెట్టాడు.

"ఓ అమ్మాయిలూ, అక్కణ్నించి బయటికి దయచెయ్యండి" అతని గొంతులో కోపం ధ్వనించింది.

ఇక చేసేదేమీ లేక వారు నావను తోసుకుంటూ బయటకు వచ్చారు. వాళ్ళ తేడ్ల కిందనుండే ఒక మనిషి అకస్మాత్తుగా నీటిమీది కొచ్చాడు సుషెంగ్ భార్య అతన్ని గుర్తు పట్టింది. ఆయన జిల్లా బ్రిగేడ్‌కి కెప్టెన్. మొహంమీంచి నీళ్ళు తుడుచు కుంటూ ఆయన అడిగాడు.

"మీరిక్కడేం చేస్తున్నారు."

"మా వాళ్ళకి మరికొన్ని బట్టలు తెచ్చాం." అంది సుషెంగ్ భార్య.

కెప్టెను సుషెంగ్ వేపు తిరిగి-వీళ్ళందరిదీ మీ వూరేనా" అనడిగాడు.

"అవును. అంతా వుత్త వెనకబడ్డ మొద్దులు" అంటూ సుషెంగ్ ఆ బిస్కట్ పాకెట్‌ని వాళ్ళ నావలోకి విసిరి బుడుంగున మునిగి మాయమయాడు. మళ్ళీ చాలా దూరంలో పైకి తేలాడు.

కెప్టెన్ గలా గలా నవ్వేడు.

"కావుండి. మీరు రావడం వృధాపోలేదు. లేకుంటే మా అంబుష్ యింత జయప్రదం అయ్యేది కాదేమో. అయితే మీరొచ్చిన పని పూర్తయింది గనుక మీరు త్వరగా యిళ్ళకుపోయి బట్టలు మార్చుకుంటే మంచిది. ఇక్కడ పరిస్థితి యింకా యింకా తీవ్రంగానే వుంది."

అప్పటికల్లా ఆ యువకులందరూ తాము పట్టుకున్న బహుమతులన్నీ తమ నావల్లోకెక్కించి కదలడానికి సిద్ధంగా వున్నారు. మధ్యాహ్నపు ఎండ తట్టుకోవడానికి వాళ్ళ ప్రతి ఒక్కడు తలమీద పెద్ద పెద్ద తామరాకులు కప్పుకున్నారు. నీళ్ళల్లో పడి నానిపోయిన తాము తెచ్చిన మూటల్ని యువతులు వాళ్ళ నావల్లోకి విసిరేరు. ఆ నావలు మూడూ రయ్యిమని దక్షిణానికి తరలిపోయి నదిమీద తళుక్కుమంటున్న మధ్యాహ్నపు ఎండలో మాయమయ్యాయి.

నీళ్ళకుండలో పడ్డ ఎలుకల్లా చిత్తుగా నానిపోయిన యువతులు తక్షణమే తమ నావను వెనక్కి మళ్ళించేరు. ఉత్కంఠతపూరితమైన ఆ ఘటనలో పాల్గొన్నారేమో వారు అప్పటికప్పుడే నవ్వుల్లో మాటల్లో మునిగిపోయారు బిగుసుకుపోయిన ఒకామె మాత్రం వెనుదిరిగి ముఖం చిట్లించింది

"ఎక్కడైనా చూసావా యిలాంటి వాళ్ళని? కనీసం మనం వున్నామన్న గుర్తు కూడా లేదు వీళ్ళకి!"

"అక్కడికి మనమే మొహం వాచిపోయినట్టు వీళ్ళకోసం!"

తాము చేసిందేమీ ఘనకార్యం కాదని తెలుసు వాళ్ళకి. పగలబడి నవ్వుతున్నారు. అయినా మళ్ళీ అందుకుంది యింకో యువతి.

"మనకి రైఫిల్స్ లేకపాయె, వుంటేనా అలా మడుగులో నక్కిపోకుండా జపాన్ వాళ్ళ మీద ఎదురుదెబ్బ తీసేవాళ్ళం."

"బాగా చెప్పావు. చివరకు భలే యుద్ధమే చూశాం! ఇందులో గొప్పేవుంది? గుండు తగలకుండా వున్నంతసేపు నక్కి కూచుని తుపాకి కొట్టడమే కద. ఎవరైనా చెయ్యగల్రు ఆ మాత్రం!"

"పడవ మునిగిపోయాక నేనూ తేగల్ను సామాన్లు నీట్లో మునిగి, అవ్వతోడంటే నమ్ము, నేను వాళ్ళకంటే బాగా యీదగల్ను. అంతకంటే నేను ఎక్కువ లోతే మునగ్గలను తెల్సా."

"ఇంటికెళ్ళాక మనమూ ఒక యూనిట్ పెడదాం. లేకపోతే ఆ వూళ్ళోంచి బైటికి కదల్లేం."

"లేకపోతే, సైన్యంలో చేరేసరికి మనం యిక ఆ కళ్ళకి ఆనడం లేదు. రెండేళ్ళుపోతే అసలు మనతో పలకనే పలకరు. ఇంతకీ వాళ్ళేనా అంత పాటి చేసేవాళ్ళు!"

ఆ ఏడే వాళ్ళు రైఫిల్ కాల్చడం నేర్చుకున్నారు. మళ్ళీ శీతాకాలానికల్లా

అచారిత్రక ప్రజల చరిత్ర రచన

ఆర్. ఎస్. రావు

టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక 160 వ జన్మదిన సంచిక కోసం ఒక వ్యాసం రాయమని ఆహ్వానం వచ్చినప్పుడు, ఆ వ్యాసానికి 'అచారిత్రక ప్రజల చరిత్ర' అనే అంశాన్ని సూచించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. ఈ అంశంలో వైరుధ్యం ఉన్నదనిపించింది. ఒక ప్రజాసమూహాన్ని అచారిత్రకమైనదని ప్రకటించిన తర్వాత ఇంక వాళ్ళకు చరిత్ర ఎట్లా ఉంటుంది? అంతేకాదు, అసలు చరిత్ర లేని ప్రజలెట్లా ఉంటారు? అచారిత్రక ప్రజలు ఎట్లా ఉంటారు? ఇది ఒక చిక్కుముడి. మేధో ఊహల వల్ల తయారయిన చిక్కుముడి కాదు. భారత ప్రజానీకం తమకు తాము కల్పించుకున్న చిక్కుముడి ఇది. చరిత్ర నిర్మించేందుకు భారత ప్రజలను పురికొల్పే ప్రేరణాత్మక చిక్కుముడి ఇది. తమంత తామే గందరగోళ పరచుకున్న చరిత్రను తిరగ రాసేందుకు పురికొల్పే చిక్కుముడి ఇది. మానవుల ప్రేరణలన్నిటినీ, మానవుల సాంఘిక చరిత్రనూ కనిపెట్టినట్టుగానే కార్ల్ మార్క్స్ ఈ చిక్కుముడిని కూడ కనిపెట్టాడు. భారత చరిత్ర అంటే దురాక్రమణల చరిత్రే తప్ప మరేమీ కాదని, బ్రిటిష్‌వాళ్ళు ఆక్రమించక పోయి ఉంటే భారతదేశాన్ని మరొకరు ఆక్రమించి ఉండే వారని మార్క్స్ తీవ్రంగా రెచ్చగొట్టే ఒక వ్యాఖ్యానం చేశాడు. భారత చరిత్ర గురించి ఆయన క్లుప్తంగానూ, నిశితంగానూ చేసిన వ్యాఖ్యలు ఒక స్థిర ఉత్పత్తి విధానం గురించి సూచిస్తాయి దాన్ని ఆయన ఆసియాటిక్ ఉత్పత్తి విధానం అన్నాడు. భారత సమాజంలో ప్రాబల్యం వహించినది ఈ ఉత్పత్తి విధానమేనని ఆయన అన్నాడు.

మానవ చరిత్రను విభజించడంలో మార్క్స్‌కు ఒక సాధారణ ప్రణాళిక

మంచులో చేపలు పట్టే సమయం వచ్చేసరికి, స్లెడ్జి బండ్లు వేసుకుని, వంతుల వారీగా పూరికి కాపలా కాసేవు. అక్కడి బురదనేలల్ని ఆక్రమించాలని శత్రువు ప్రయత్నించి నపుడు, ఏమాత్రం భయపడకుండా సముద్రంలాంటి ఆ రెల్లుగడ్డి మడుగుల్లోనే అటూ యిటూ పోతూ వస్తూ, సైన్యంతో సమన్వయించి ఎంతో గొప్పగా పనిచేశారు.

[అనువాదం : శంకరయ్య]

ఉంది. ఆ ప్రణాళికలో ఆదిమ కమ్యూనిజం, బానిసత్వం, భూస్వామ్య విధానం, పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం ఉంటాయి. బ్రిటన్ తన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో భారతదేశంలో ప్రవేశించి, భారత సమాజంతో చరిత్రను నిర్మింపజేసేందుకు దానిపై ఆధిపత్యం వహించి, విప్లవీకరించే దాకా ఈ విభజనలో భారతదేశానికి స్థానం లేదు. భారత సమాజం ఆసియాటిక్ ఉత్పత్తి విధానంలో ప్రవేశించిన తర్వాత చరిత్ర నిర్మాణక్రమం అనేదాన్ని మరిచిపోయింది. భారత సమాజాన్ని బ్రిటిష్‌వారు విప్లవీకరించడం, సెటిల్‌మెంటు పద్ధతిని, భూమిలో వ్యక్తిగత హక్కును ప్రవేశపెట్టినందువల్ల కన్న ఎక్కువగా రైల్వేలు ప్రవేశపెట్టినందువల్ల జరిగింది. రవాణా రంగంలో ఒక ఉన్నత ఉత్పత్తి శక్తి అయిన రైల్వేలు వివిధ గ్రామీణ, స్వయం పాలక ప్రాంతాలను ఒకే మొత్తంలో కలిపివేశాయి మరో మాటల్లో చెప్పాలంటే, భారత చరిత్ర గమనాన్ని రైల్వే ఇంజన్ సుసాధ్యం చేసిందని మార్క్స్ సూచించాడు. ఆసియాటిక్ సమాజాన్ని మానవ చరిత్ర మార్గంలోకి రైల్వే ఇంజన్ లాక్కుపోతుందని ఆయన భావించాడు. మార్క్స్ చేసిన ఇతర వ్యాఖ్యానాల లాగనే ఇది కూడ చాల వివాదాస్పదమైనది. ఐతే ఈ వివాదానికి కారణం ఈ వ్యాఖ్యానంలో సారం లేకపోవడం కాదు. ఈ వ్యాఖ్యానం తనకు అనుకూలంగానో, వ్యతిరేకంగానో మనుషులు ఆచరణకు దిగేలా ప్రేరేపిస్తుంది గనుక వివాదం రేగింది.

మార్క్స్ చారిత్రక దృక్పథం మనుషులను ప్రకృతిపై ఆధిపత్యం వహించే వాళ్ళుగా నిర్వచిస్తుంది. ఈ ఆధిపత్యం వహించే క్రమంలో మనుషులు తమ శక్తి సామర్థ్యాలు పెంచుకుంటారు. తమ ఉత్పత్తి శక్తిని మెరుగుపరచుకుంటారు. ఈ క్రమమే మనుషులను పాతరాతి సాధనాల నుంచి కొత్తరాతి సాధనాలకు, ఇనుము, కంచుయుగాలకు, యంత్రాలపై ఆధారపడిన సాధనాలకు, రసాయనాలపై ఆధారపడిన సాధనాలకు తీసుకుపోతుంది. రాతిపాత్ర నుంచి మట్టికుండ నుంచి అల్యూమినియం పాత్ర నుంచి స్టెయిన్‌లెస్‌స్టీలు ప్రెషర్‌కుకర్ వరకు సాగివచ్చిన అభివృద్ధి ఆ చరిత్రలో భాగమే. బరువులు మోసే పెంపుడు జంతువుల నుంచి, సూపర్‌సోనిక్ జెట్ విమానాల నుంచి రోదసి నౌకల వరకు పరిణామం ఆ చరిత్రలో భాగమే. నీటి సహజ ప్రవాహాన్ని అడ్డుకట్టకట్టి ఆపడం నుంచి విద్యుదుత్పాదక బహుళార్థసాధక ఆనకట్ట నిర్మించడం వరకు జరిగిన మార్పు ఆ చరిత్రలో భాగమే. ఈ చరిత్ర క్రమాలన్నిటిలోనూ మనుషులు ప్రకృతిని పునర్నిర్మించడానికి ప్రకృతి నుంచి నేర్చుకుం

టారు. ఈ పునర్నిర్మాణక్రమం కూడ ప్రకృతి పరిధులలోనే జరుగుతుంది. ఈ క్రమంలో వాళ్ళు ప్రకృతిని వ్యతిరేకిస్తారు. ప్రకృతిపై పోరాడతారు. ప్రకృతితో ఐక్యమవుతారు. ప్రకృతితో చేసే పోరాటాలలో, మనుషులు మనుషులను పునర్నిర్మిస్తారు. ప్రకృతితో ఐక్యతలో మనుషులను ప్రకృతికి అధీనం చేస్తారు. ఈ వైరుధ్య క్రమంలోనే మరింత ఎక్కువ ఉత్పత్తి శక్తులు సంతరించుకున్న మానవులు రూపొందుతారు. ఈ పురోగమన క్రమంలో మనుషులు ఒకరకమైన సాధనాలను వదిలిపెట్టి మరోరకమైన సాధనాలను చేపడుతుంటారు, వదిలేసిన సాధనాలు అంతిమంగా ఆధునిక ప్రదర్శనశాలలకు చేరుతాయి. మనుషులు ప్రకృతికి వ్యతిరేకంగా చేసిన పోరాటచరిత్రకు ఆధునిక ప్రదర్శనశాల ఒక చిహ్నంగా ఉంటుంది.

భారత సమాజంలో ఏ అభివృద్ధి జరిగినప్పటికీ, ఏ చరిత్ర నిర్మాణమయినప్పటికీ, అది ఆసియాటిక్ ఉత్పత్తి విధానానికి ముందుదశకే పరిమితమయిందని మార్క్స్ సూచిస్తూ ఉండి ఉంటాడు. ఆ దశకు ఒకసారి చేరుకున్న తర్వాత, మనుషుల

(4 వ పేజీ తరువాయి)

అయితే మళ్ళీ మొదటికొస్తే పార్లమెంటరీ రాజకీయాల పవిత్రత్వం మీద భ్రమలుండి కాదు, ఇవ్వాళ ఎవరైనా ఎన్నికల్లో పాల్గొనేది. దోపిడీ వర్గాలకు కూడా ఇది మినహాయింపు కాదు. వీళ్ళంతా అధ్యక్షతరహా పాలన మొదలు ఈ దేశానికి మిలటరీ పాలనదాకా అవసరమని మాట్లాడుతున్నవారే. హిందూ రాజ్యం మొదలు జాతులకు స్వతంత్ర రాజ్యాలు సాధిస్తామని మాట్లాడుతున్నవాళ్ళే. ప్రచారం చేస్తున్నవాళ్ళే.

ప్రతీ ఊళ్ళో ప్రభుత్వ సారా దుకాణాలు తెరిచినట్లే ప్రతి సంవత్సరం ప్రతి ఊళ్ళో పంచాయితీవో, పార్లమెంట్ వో బూతులు పెడితే ఇదీ ఒక వ్యసనమై ప్రజలు పాల్గొనకపోతారా అనేది ఒక ఎత్తుగడ, ఒక కుట్ర. తమ బతుకులు బాగు చేసుకోవడానికి 'సారా బంద్' అన్నట్లుగానే కష్టజీవులు ఎన్నికలు బంద్ అని, ఓట్లు ముట్టక, పనిముట్లు పట్టుకొని వ్యవసాయ విప్లవంలో సంలీనమైతే....

అదే జరిగి తీరుతుంది.

—సంపాదకుడు

ఉత్పత్తి సామర్థ్యం, స్వీయ సృజనాత్మక కార్యాచరణ రద్దయిపోయాయి. ఎందుకంటే మనుషులు ప్రకృతిని పూజించే జాంతవిక వైఖరిని అవలంబించారు. ప్రకృతిపై పోరాటం చేయకుండా ఉండి పోయారు. ఇట్లా సాధించిన సమతౌల్య స్థితిని విచ్ఛిన్నం చేసినది బ్రిటిష్ పెట్టుబడిదారీ విధానం, దాని రైల్వేలు. రైల్వేలకు ఉత్ప్రేరక పాత్రను ఇవ్వడంలో మార్క్స్ అత్యాశతోనూ, విపరీతంగానూ వ్యాఖ్యానించిన మాట నిజమే. సమకాలీన భారత దృశ్యాన్ని చూసినా ఆయన ఆశలు మరీ అత్యాశ లని అర్థమవుతుంది. అన్ని ఆధునిక ఉత్పత్తి శక్తులు పాత ఉత్పత్తి శక్తుల విభిన్న పొరలతో సహజీవనం చేయడం భారత సమాజంలో ఒక ముఖ్యమైన అంశం. ఒక ఉత్పత్తి శక్తి మరొక ఉత్పత్తి శక్తిని రద్దుచేసి దాన్ని ఆధునిక ప్రదర్శనశాలలోకి నెట్టివేయదు. చరిత్రను అభావం చేసే ఒక రకమైన సమతౌల్య స్థితి కొనసాగుతున్న ట్లనిపిస్తుంది.

కొత్తరాతియుగపు పనిముట్టు లాంటి ఉత్పత్తి సాధనం ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరంతో సహజీవనం చేయగలుగుతుంది. పిండి విసిరే సాధనాల విషయం చూస్తే రాతియుగపు పనిముట్టయిన తిరగలి ఆధునిక గ్రైండర్‌తో సహజీవనం చేస్తుంది. మా ఇంట్లో నాలుగు వేరు వేరు రకాల విసిరే సాధనాలున్నాయి. రెండు రాతియుగానికి ప్రాతినిధ్యం వహించేవి, ఒకటి యంత్రయుగానికి ప్రాతినిధ్యం వహించేది, మరొకటి ఎలక్ట్రానిక్ యుగానికి ప్రాతినిధ్యం వహించేది. తిరగలి, రోలు రాతి యుగానివి కాగా, కాఫీ గ్రైండర్ యంత్రయుగానిది. ఆధునికకాలపు సుమీత్ మిక్సర్ గ్రైండర్ ఎలక్ట్రానిక్ యుగానిది. విద్యుచ్ఛక్తి రాకపోకలు, శ్రమశక్తి చౌకగా దొరికే అవకాశం, తీరిక సమయం, పనిచేసి పెట్టడానికి ఎవరో ఒకరుండడం- అన్నీ విడివిడి గానూ, ఉమ్మడిగానూ అన్ని సాధనాలూ ఏకకాలంలో ఉనికిలో ఉండడానికి దోహదం చేస్తాయి. అదే విధంగా, మా విశ్వవిద్యాలయంలోనే ఉంటున్న ఒక మిత్రునికి వంట కోసం చాల రకాల సాధనాలున్నాయి. ఆ వరుసలో ఒక చివర రెండు గ్యాస్ సిలిండర్లుండగా, మరో చివర మామూలు కట్టెల పొయ్యి ఉంటుంది. ఈ మధ్యలో విద్యుచ్ఛక్తిని ఉపయోగించే హాట్ ప్లేట్, సోలార్ కుకర్; కిరొసిన్ స్టవ్, చివరికి బొగ్గుల పొయ్యి కూడ ఉంటాయి. ఒకే ఒక్క ఇంట్లో ఇన్ని రకాల సాధనాలను చూడగలగడం ఉన్నతావాయ కుటుంబపు మోజు కావచ్చు గాని, సమకాలీన భారత

సామాజిక స్థితిలో ఇన్ని రకాలు ఉనికిలో ఉండడం దానికది మోజుకు సంబంధించిన విషయం కాదు. అది ఒక జీవన విధానం. బ్రిటిష్ ఆధీనంలోనూ, ప్రభావంలోనూ పెరిగిన మొట్టమొదటి పెద్ద పట్నమైన కలకత్తా ఈ పరిణామానికి నిదర్శనంగా ఉంటుంది. అక్కడ ఒక ప్రదర్శనశాల ఉండడంతోపాటు స్వయంగా ఆ నగరమే ఒక సజీవ ప్రదర్శనశాల. ప్రతి ఒక్క సాధారణక్రమానికీ, అక్కడ విభిన్నమైన సాధనాలుంటాయి. ఉదాహరణకు రవాణా చూడండి. అక్కడ మనుషులు లాక్కుపోయే రిక్షా నుంచి ఆధునిక భూగర్భ రైల్వే వరకు అన్నీ ఉన్నాయి. మానవజాతి కనిపెట్టిన ప్రతి ఒక్కదాన్నీ తమ వినియోగం కోసం ఈ నగరంలో పరిరక్షిస్తున్నారు. కొన్ని సాధనాల్ని మరికొన్ని సాధనాలు రద్దు చెయ్యడం ఇక్కడ ఏంత మాత్రం జరగలేదు. అవి అన్నీ సహజీవనం చేస్తున్నాయి. కనుక చరిత్రంటూ ఉంటే, అది సంలీనాల కాదికాగా, ఐక్యతల చరిత్రగా ఉండవలసిందే. అందువల్లనే ఉత్పత్తి శక్తులకు సంబంధించిన నిజమైన చరిత్ర లేదు.

భారత సమాజానికి దాని ఆసియాటిక్ దశలో, ఉత్పత్తి శక్తుల ప్రాతిపదికపై చూసినప్పుడు ఎక్కువ చరిత్ర లేదని మార్క్స్ అన్నమాట పాక్షికంగా సరైనదే; కాని బ్రిటిష్ రైల్వేలు ఈ సమాజాన్ని విప్లవీకరిస్తాయని ఆయన చేసిన ప్రకటనలు మాత్రం పెట్టుబడిదారీ విధానపు శక్తి గురించి అత్యాశతో కూడుకున్నట్టనిపిస్తాయి. అంటే సంలీనం చేసుకోవడంలో ఆసియాటిక్ విధానానికి ఉన్న సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేశాడనిపిస్తుంది. ఆసియాటిక్ సమాజం రైల్వేలను స్వీకరించి తనలో సంలీనం చేసుకోగలదు. అది అణుశక్తిని స్వీకరించి తనలో సంలీనం చేసుకోగలదు. అది ఉపగ్రహాన్ని స్వీకరించి తనలో సంలీనం చేసుకోగలదు. అవసరమైతే, వర్షాలకోసం యజ్ఞాలు నిర్వహించగలదు. వర్షం గురించీ, కరువు గురించీ అంచనా కట్టడానికి పంచాంగాన్ని సాయం అడగగలదు. ప్రకృతిపట్ల ఆసియాటిక్ సమాజపు ప్రాపంచిక దృక్పథాన్ని ఒక ఉన్నత ఉత్పత్తి శక్తి మార్చగలుగుతుందనే మార్క్స్ అభిప్రాయం పొరపాటని అనిపిస్తుంది.

2

ఒక సమాజపు ఉత్పత్తి శక్తిలో మార్పును వెన్నంటి సామాజిక వ్యవస్థలోనూ, నిర్మాణంలోనూ మార్పు రావడం చరిత్రలో మరొక కోణం. రాతియుగ

నుంచి లోహయుగానికి జరిగే మార్పు మరొక మార్పును తీసుకొస్తుంది. గణనీయమైన జనాభాను, వారి సమయాన్ని భౌతిక ఉత్పత్తి రంగంనుంచి బైటికి తోసివేయడమే ఆ మార్పు. ఇందువల్ల ప్రజానీకంలో ఒక భాగం తమను తాము కళా రంగంలో, రాజ్య వ్యవహారాలలో ఉంచుకోగలిగే పరిస్థితులు ఏర్పడతాయి. కమ్మరి కొలిమి నుంచి లోహ ఇంజనీరింగ్ ఆధారంగా నడిచే బ్లాస్ట్ ఫర్నేస్‌కు మార్పు మరొక మార్పును తీసుకొస్తుంది. సమాజ నిర్మాణం చేతివృత్తుల పద్ధతి నుంచి ఫాక్టరీ పద్ధతికి మారిపోతుంది. పత్తిని పండించి, నూలు తీసి, నేసే వృత్తిపరమైన చేనేత పనివారి నుంచి బట్టల మిల్లుకు జరిగే మార్పు ఈ పనులన్నిటినీ స్వతంత్ర కార్యకలాపాలుగా విడదీస్తుంది. ప్రతి దశలోనూ సమాజం కొత్త కొత్త శ్రమ విభజనలను రూపొందిస్తుంది. ఉత్పత్తి సామర్థ్యాల పెరుగుదల ఫలితంగా ఇది జరుగుతుంది. ఈ విభజన వల్ల ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుంది.

ఆస్తి అంటే సారాంశంలో ప్రకృతినీ (మనుషులతో సహా), దాని ఉత్పత్తులనూ స్వాధీనం చేసుకోవడమే అయితే, ప్రతి శ్రమ విభజనా దాని స్వంత ఆస్తి రూపాన్ని తయారుచేస్తుంది. స్థూల సాధారణీకరణ స్థాయిలో చెప్పాలంటే, ఉమ్మడి, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆస్తి రూపాలను మార్క్స్ గుర్తించాడు. ఐతే, ఆసియాటిక్ ఆస్తి రూపాన్ని కూడ మార్క్స్ విడిగా గుర్తించాడు. ఉత్పత్తి శక్తుల గురించిన భావనను చెప్పినంత నిర్ద్వంద్వంగా ఈ భావనను చెప్పలేదనుకోండి. బ్రిటిష్ ప్రవేశానికన్న ముందు భారత సమాజంలో వివిధ ఆస్తి రూపాలు అభివృద్ధి చెందలేదని మార్క్స్ సూచిస్తున్నాడనిపిస్తుంది. ఇక్కడ కూడ ఆయన నిర్ద్వంద్వంగా చెప్పని మాట నిజమే. ద్రవిడ నాయకులకు సంతోషం కలిగించడానికన్నట్టుగా, దక్షిణాదిన భారతీయులు ఆసియాటిక్ రూపానికి భిన్నమైన ఆస్తి రూపాలను అభివృద్ధి చేశారని ఒక దశలో మార్క్స్ సూచిస్తున్నాడనిపిస్తుంది. ఇటువంటి ఆధారం ఉన్నప్పటికీ ఆసియాటిక్ పద్ధతులే ప్రబలంగా ఉన్నాయని మార్క్స్ సూచిస్తున్నాడనిపిస్తుంది. ఈ ఆసియాటిక్ పద్ధతిని బ్రిటిష్‌వాళ్ళు శాశ్వతంగా ధ్వంసం చేశారనిపిస్తుంది.

వర్గపోరాటం ద్వారా, విప్లవం ద్వారా ఆస్తి రూపాల మార్పు చరిత్రలో రెండవ కోణం. మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్ట్ ప్రణాళికలో చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే అని ఒక నిశితమైన పరిశీలన చేశారు. ప్రతి విప్లవంతోనూ ఒక

రకమైన ఆస్తి రూపం మారిపోయి మరోరకమైన ఆస్తి రూపం ఉనికిలోకి వస్తుంది. మారిన ఉత్పత్తి శక్తుల స్థాయికి అనువుగా ఉండేందుకు ఇలా జరుగుతుంది. ఒక సారి స్థిర ఉత్పత్తి శక్తుల ప్రాతిపదికతో ప్రారంభమైన తర్వాత, భారత చరిత్రలో ఈ చరిత్రకోణం లేదని వాదించడం మార్క్స్ తర్కంలో సరైనదే. ఈ అర్థంలోనే ఆయన భారత సమాజ చరిత్రంటే దురాక్రమణల చరిత్ర తప్ప మరేమీ కాదని రాశాడు. ఇవాళ్టికీ సుదూర గతంలో తమ అస్తిత్వం కోసం అన్వేషించే, సమకాలీన సమస్యలన్నిటికీ వేదాలలో పరిష్కారాలు కనిపెట్టే, వేదాలను అనుసరించే హిందువులు ఇందువల్ల ఆనందించవచ్చు.

రైల్వేలు, ఆధునిక పరిశ్రమలు ఆసియాటిక్ కోణాన్ని ధ్వంసం చేస్తాయని నొక్కిచెపుతున్నప్పుడు మార్క్స్ బ్రిటిష్ పెట్టుబడి సామర్థ్యం గురించి కూడ మరొకసారి అతిశయోక్తి చెపుతున్నట్టనిపిస్తుంది. ఉత్పత్తి శక్తుల విషయంలో లాగనే, ఆస్తి సంబంధాలలో కూడి ఆసియాటిక్ సమాజానికి తన స్వంత పునాదిని ధ్వంసం చేసుకోకుండానే బ్రిటిష్ పెట్టుబడిని సంలీనం చేసుకోగల సామర్థ్యం ఉన్నదని సమకాలీన ఆధారాలు చూపుతున్నాయి.

గ్రామీణ, స్వయంపాలక సమాజాన్ని ధ్వంసం చేసి, ఆధునిక పరిశ్రమను ప్రవేశపెట్టడంలో భారత రైల్వేలు నిర్వహించే పాత్ర గురించి మార్క్స్ రాసిన విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి : "ఇనుము, ఉక్కు దొరికే దేశంలో రవాణా రంగంలో యంత్రాలను ప్రవేశపెట్టినప్పుడు అవి విస్తరించకుండా మీరు ఆపలేరు. రైల్వే రవాణాకు తక్షణ, ప్రస్తుత అవసరాలను తీర్చగల పారిశ్రామిక ప్రక్రియలన్నిటినీ ప్రవేశపెట్టకుండా ఒక సువిశాల దేశంలో రైల్వేల వ్యవస్థను నిర్వహించడం సాధ్యం కాదు. అందువల్ల రైల్వేలతో సన్నిహిత సంబంధం లేని పారిశ్రామిక రంగాల్లో కూడ యంత్రాల వాడకం పెరగవలసి ఉంటుంది. అంటే, భారతదేశంలో రైల్వే వ్యవస్థ నిజంగా ఆధునిక పరిశ్రమల మార్గదర్శి అవుతుంది". ఆధునిక పరిశ్రమ అనేది పెట్టుబడిదారీ స్వంత ఆస్తికి కారణంగానూ, ఫలితంగానూ ఉంటుంది. భారత రైల్వేలకు సంబంధించిన కొన్ని దైనందిన అనుభవాలను బట్టి రైల్వేలు ఎట్లా ఆసియాటిక్ పరిణామాలకు లోబడిపోయాయో గుర్తించడం ఆసక్తికరంగా ఉంటుంది.

రైల్వే స్టేషన్లలోకి వెళ్ళగానే మనకు ఒక సందేశం కనబడుతూ ఉంటుంది.

రైల్వేలు మన ఆస్తి అని, వాటిని పరిరక్షించడం మన బాధ్యత అని ఆ సందేశం చెపుతుంది. బి.ఎన్.ఆర్, ఎం.ఎస్.ఎం వంటి అనేక కంపెనీలను రద్దు చేసి రైల్వేలను జాతీయరంగంలో చేర్చిన తర్వాత ఈ సందేశం ఉనికిలోకి వచ్చింది. అయితే, హోటల్లో దొరికే కాఫీకి డబ్బులిచ్చినట్టుగా ఇంట్లో కాఫీకి డబ్బులివ్వం గదా - ఇది టికెట్ కొనని ప్రయాణికుడి ఆశయం లాగనిపిస్తుంది. స్థానిక ప్రతిభలను బట్టి ఈ రకమైన ఆశయం అనేక రూపాల్లో కనబడుతుంది. అటువంటి ఒక రూపాన్ని ఈ రచయిత స్వయంగా చూశాడు, టికెట్ కలెక్టర్ బిచ్చగాడిలా తన చెయ్యి చాపితే ప్రయాణికులు తమకు తోచినట్టుగా రూపాయో రెండో చేతిలో పెట్టారు. అయితే, స్థానిక ఆచారాలను, సాంప్రదాయాలను బట్టి అది డబ్బుకూడ కాకపోవచ్చును. అది కాసిన్ని కూరగాయల రూపంలో కూడ ఉండవచ్చును. ఆస్తికి మూర్తీభవ రూపంగా వ్యవహరించే టికెట్ కలెక్టర్ మరీ మనసులేని మనిషి కూడ కాదు. ఎవరికైనా ఇబ్బందులుంటే, ఆ ఇబ్బందుల్ని సాంఘికంగా ప్రకటిస్తే టికెట్ కలెక్టర్ వారి పట్ల దయ చూపవచ్చును. ఆధునిక దృష్టికి ఇదంతా లంచగొండితనంలా కనిపించవచ్చును. ఎడ్లబండిలోనో, సైకిల్ మీదనో ఎవరినైనా ఎక్కించుకోవడం తోటి మనిషికి సాయం చెయ్యడంగా ఉండే సమాజంలో పెరిగిన వాళ్ళకు, రైల్వేలు స్వంత ఆస్తికి ప్రతినిధులుగా కనిపించవు. స్వంత ఆస్తి లెక్కలు వేయవలసిన చోట, లంచగొండితనానికన్న ముందే స్వంత ఆస్తిపట్ల గౌరవం, దాని మీద ఆధారపడిన ఒప్పందాల చట్టం ఉంటాయి. భారత సమాజ నేపథ్యంలో ఈ అంశం కనబడడం లేదు.

స్వంత ఆస్తి పట్ల గౌరవం కనబడని సమాజంలో, పాలకులూ పాలితులూ కూడ స్వంత ఆస్తిని ఉమ్మడి ఆస్తిగానే చూస్తారు. ఒక్కటే మినహాయింపేమంటే పాలకులు అది తమ ఆస్తి అని అనుకుంటారు, పాలితులు దానిలో వాటా కోరుతుంటారు. ఇది కేవలం రైల్వేలకు మాత్రమే గాక అన్ని ఇతర జీవనరంగాలకూ వర్తిస్తుంది. డబ్బు తిరిగి రాదనే కారణం మీద, బ్యాంకింగ్ సూత్రాల కారణం మీద బ్యాంకింగ్ వ్యవస్థ ఋణమేళాలకు అభ్యంతరం చెప్పినప్పుడు, ఋణమేళాలకు బాధ్యుడైన మంత్రి ఏం చెప్పాడో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. ఆయన సమర్థన డబ్బు తిరిగి వస్తుందనే హామీ మీద ఆధారపడలేదు. పెద్ద పారిశ్రామికవేత్తల నుంచి అప్పులు తిరిగిరావడం లేదు గదా అనే వాదన మీద ఆధారపడింది. ఋణ మేళాలను

విమర్శించిన ప్రతిపక్ష పార్టీలు కూడ స్వంత ఆస్తిమీద గౌరవంతో ఆ పని చేయలేదు. తమ పార్టీ సానుభూతి పరులలోంచి అభ్యర్థుల్ని సూచించే అవకాశం తమకు ఇవ్వనందువల్లనే విమర్శించాయి.

స్వంత ఆస్తి రాజ్యాంగంలో రాయబడి ఉన్నచోట, ఈ సాధారణ వాతావరణం వల్లనే లంచగొండితనం మీద ఎంతో సమాచారం ఉన్నప్పటికీ, ఆ సమాచారాన్ని రాష్ట్రపతితో, ప్రధానమంత్రితో చెప్పినప్పటికీ, మామూలు ప్రజలకు అది ఎంతమాత్రమూ పట్టదు. ప్రజల ముందు అది ఎన్నికల సమస్యగానో, మరొక సమస్యగానో ఎంతమాత్రమూ ఉండదు. ఉమ్మడి ఆస్తి లెక్కలే ప్రబలంగా ఉండే స్థితిలో లంచగొండితనం అంతకన్న గౌరవనీయమైన 'మామూలు'కు సమానార్థకంగానే ఉంటుంది. 'మామూలు' అంటే ప్రభుత్వ ఆదరాన్ని పొందేందుకు ఎవరైనా చెల్లించవలసిన మూల్యమే. దీనికి సమానమైన పర్షియన్ పదం 'సలామి'ని బ్రిటిష్ భూమి సెటిల్‌మెంట్ అధికారులు మంచి మాటల్లో ఒకటిగా తీసుకున్నారు. భూదానానికి ప్రతిగా చెల్లించేదే ఈ 'సలామి'. బక్షీష్, సలామి, మామూలు వంటి మాటలన్నీ ఆర్థికేతర సంబంధాన్ని సూచించేవే. ఇవన్నీ కూడ పెట్టుబడిదారీ విధానానికి ముందరి సాంస్కృతిక పదజాలం లోనివే. భారతదేశాన్ని పాలించేటప్పుడు బ్రిటిష్ వాళ్ళు కూడ ఈ పదజాలాన్ని తమలో కలుపుకున్నారు.

ఉమ్మడి ఆస్తి అనే సహజాతానికి దాని సాంస్కృతిక వారసత్వానికి ఒక హాస్యాస్పదమైన కోణం కూడ ఉంది. వాటిని స్వంత ఆస్తి పదజాలం లోంచి చూసినప్పుడు ఆ కోణం బయటపడుతుంది. ఇరుగు పొరుగు గ్రామవాసుల ఇంటి అవసరాల కోసం రైల్వేలు పెద్ద మొత్తంలో బొగ్గును, వేడి నీటిని సరఫరా చేస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. రైల్వే సిబ్బంది, స్థానిక ప్రజలు చాల స్నేహపూర్వకంగా ఉండేవాళ్లు. ఈ సన్నిహిత సంబంధాన్ని ఎత్తిచూపే ఒక సంఘటనను ఒక మిత్రుడు చెప్పాడు. ఒకరోజు ఒక రైలు డ్రైవర్ తాను మామూలుగా ఇచ్చే బొగ్గు కన్న ఎక్కువ ఇచ్చేశాడు. అప్పుడు రైలు గమ్యందాకా చేరడానికి బొగ్గు సరిపోదేమో అని ఆ డ్రైవర్‌కు అనుమానం వచ్చింది. డ్రైవర్ తన స్థితి గుర్తించగానే, ఆ సంగతి ప్రజలకు తెలిసిపోగానే, వాళ్ళందరూ తమ ఇళ్ళ నుంచి ఒక్కో బొగ్గు పెళ్ల పట్టుకొచ్చి ఇచ్చారు. తద్వారా రైలు గమ్యస్థానానికి భద్రంగా చేరగలిగింది. అడవిలో ఉండేవాళ్ల ఇళ్ళకు తిరిగి వచ్చేటప్పుడు కొన్ని కట్టె పుల్లలు, కొన్ని

పల్లు ఏడుకొచ్చుకున్నట్టుగానే, జనం కూడ కొసన్ని బొగ్గు పెళ్లలు ఏరుకొచ్చుకుంటారు. మొత్తం వ్యవహారాన్ని జనం ఇట్లాగే చూస్తారన్న మాట చట్టపరంగా చూస్తే, వాళ్లు చేసేది తప్పు. కాని, వాళ్ళ చైతన్యం ప్రకారం వాళ్ల చర్య న్యాయమైనదే. చట్టపరంగా వాళ్లు చేసింది తప్పు గనుక వాళ్ళను పోలీసులు పట్టుకోవచ్చు, వేధించవచ్చు. ప్రభుత్వం కూడ ఇదంతా న్యాయబద్ధమే ననుకుంటుంది, చట్టబద్ధమైనా కాకపోయినా. రైల్వేలు ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల ఇట్లా జరుగుతోందనే నిర్ధారణకు ఎవరైనా వస్తే అది పొరపాటు. చివరికి ప్రైవేట్ రంగం కూడ ప్రభుత్వ రంగాన్ని, ప్రభుత్వాన్ని ఇట్లాగే చూస్తుంది.

ఇటువంటి సంలీనపు కోణాన్ని మార్క్స్ ఊహించలేకపోయాడు. ఇతర ఆస్తి రూపాలన్నిటినీ సంలీనం చేసుకున్న ఆసియాటిక్ విధానం చివరికి తనను తాను రద్దు చేసుకోకుండానే పెట్టుబడిదారీ ఆస్తిని కూడ తనలో సంలీనం చేసుకుంది.

3

ఉత్పత్తి శక్తులు, ఆస్తి సంబంధాలు సంలీనమైపోయిన తర్వాత, చరిత్రకు నిజమైన పునాది అయిన సామాజిక పునర్నిర్మాణం నిజంగా ఎప్పుడూ జరగలేదు. ఐనా సమాజం మనుగడ సాగిస్తూనే ఉంది. ప్రతిఘటన చూపుతూనే ఉంది. పోరాటాలు నడుపుతూనే ఉంది. ఆ పోరాటాలను మధ్య దారిలో ఆపేస్తూనే ఉంది. సామాజిక నిర్మాణంలో ఉత్పత్తి శక్తులకు, ఆస్తి సంబంధాలకు సంబంధించిన విభిన్న శత్రుపూరిత శక్తుల ఐక్యత గురించి ఇంకా వివరణ నివ్వవలసే ఉంది. అటువంటి వివరణ కోసమైన అన్వేషణలోనే మార్క్స్ తన దృష్టిని రాజ్యంవైపు, భావజాలం వైపు సారించి ఉంటాడు. "ఈ చిన్న చిన్న సమూహాలు కుల విభజనలతో, బానిసత్వంతో నిండిపోయాయి. మనిషిని పరిస్థితుల మీద ఆధిపత్యం వహించేలా చేసే బదులు ఈ కులం, బానిసత్వాలు మనిషిని శాశ్వత పరిస్థితులకింద అణగిపోయేలా చేశాయి. అవి స్వంతంగా అభివృద్ధి చెందుతున్న ఒక సామాజిక స్థితిని ఎన్నటికీ మారని సహజధర్మంగా మార్చివేశాయి. తద్వారా అవి ప్రకృతిని పాంతవికంగా పూజించడాన్ని తీసుకొచ్చాయి. ప్రకృతికి అవమానాన్ని ప్రదర్శిస్తూ ప్రకృతికి అధిపతి అయిన మనిషి, కోతి (హనుమంతుడి) ముందర, ఆవు ముందర మోకరిల్లే పరిస్థితి వచ్చింది".

ప్రకృతికి లొంగిపోవడం అనే ఈ దాదాపు శాశ్వతమైన స్థితిని కల్పించినవి ఆసియాటిక్ సమాజాలు. ఇది ఒక ఆనందమయమైన విధిగా మారి ప్రజలు ప్రశ్న లేకుండా ప్రకృతి-మానవ సంబంధాన్ని అంగీకరించేందుకు సిద్ధపరిచింది. ఇందుకు ఒకే ఒక్క మినహాయింపు దైవ సామ్రాజ్యం. ప్రకృతి ప్రాబల్యం నుంచి దైవ ప్రాబల్యానికి జరిగిన మార్పు మనుషుల మనసులలో సాంఘిక సంబంధాల విషయంలో వినాశకర పరిణామాలకు దారి తీసింది. ఈ మార్పు, ఇటువంటి భావజాలపు ప్రాబల్యం సమాజంలో కచ్చితమైన విభజనలను పోషిస్తాయి. కులాల మధ్య విభజనలు, తెగల మధ్య విభజనలు, వివిధ మతాల మధ్య, శాఖల మధ్య విభజనలు ఇటువంటివే. ప్రజల మధ్య స్పష్టమైన ఆర్థిక విభజనలు సహజమైన విభజనలుగా పవిత్రతను సంతరించుకుంటాయి. అంతేగాక దైవికమైన విభజనలుగా కూడ మారుతాయి. సాంఘిక సంపర్కం దానంతటదే ఒక సహజ/దైవిక సంపర్కంగా మారిపోతుంది. ఉదాహరణకు అస్పృశ్యతకు దైవామోదం ఉంది. చివరికి మాతృభాష కూడ దేవభాష సంస్కృతం కన్న తక్కువ స్థాయిదైపోతుంది. భగవంతుని ఆదేశం ప్రకారమే బ్రాహ్మణులు నాగలిని స్పృశించగూడదు. మరొక దైవాదేశం ప్రకారం అస్పృశ్యులు భూమిని కలిగి ఉండగూడదు. వీటన్నిటినీ 'భగవద్గీత' లో వివరంగా అభివర్ణించారు. దేశాన్ని స్వాతంత్ర్యం వేపు నడిపించే ప్రయత్నాల్లో గాంధీకి ఆ భగవద్గీతే దైవిక మార్గదర్శక శక్తి అయింది.

మనుషుల విధుల, బాధ్యతల స్వభావం ముందే ఎప్పుడో నిర్ణయమైందని కృష్ణ భగవానుడు ఉపన్యసించాడంటారు. ఆ దీర్ఘకావ్యపు నిజమైన విషాదమేమంటే, అది ఒక మానవమాత్రుని సృష్టి కావడమే. కాని దానికి మనుషుల మీద ప్రాబల్యం దొరికింది. వాళ్ళ చైతన్యాలలో దానికి ఒక స్వతంత్ర స్థానం దొరికింది. ఆ కావ్యంలో కృష్ణుడు మాట్లాడిన మాటలన్నీ మానవులు ఉత్పత్తి చేసినవే. కాని, ఆ మాటలే తమ మూలాల్ని వదిలి ఆ మనుషుల్నే శాసించే శక్తి సంతరించుకున్నాయి. తమ మూలాల్ని వదిలేయడం ద్వారా ఆ పదాలు దివ్యత్వాన్ని పొందాయి. మానవులు సృష్టించిన మాయలన్నిటిలోనూ ఇది అంతిమమైనది. ఈ మాయా ప్రపంచంలో ప్రకృతే దైవం, దైవమే ప్రకృతి. ఇటువంటి మాయా ప్రపంచంలో అంతర్గతంగానే స్థిరత్వమూ, సమతౌల్యమూ ఉంటాయి. అది బహుదైవాల ప్రపంచాన్ని

సృష్టిస్తే, మామూలు సహజ విభజనలన్నీ దైవ విభజనలుగా పరిణమిస్తాయి. సహజంగానే మనుషులు బహుదైవారాధన నుంచి ఏకేశ్వరోపాసనలోకి ప్రయాణించారు. కాని హిందూ పూజా విధానంలో ఇంకా బహుదైవారాధన ఉంటుంది. 'శతకోటి దేవతలు' అనే మాట మనకు ఉండనే ఉంది. ఈ దేవతలలో ప్రతి ఒక్కరికీ మరొకరితో వైరుధ్యం ఉంటుంది. మళ్ళీ దైవాజ్ఞ ప్రకారమే ఐక్యమవుతూ, దైవాజ్ఞ ప్రకారమే పోట్లాడుకుంటూ ఉంటారు. ప్రజల చైతన్యంలో నిజమైన పోరాటాల స్థానాన్ని ఐక్యత, ఘర్షణలతో సహా ఈ దేవతల మధ్య వైరుధ్యాలు ఆక్రమిస్తాయి. అవి వాస్తవానికి ప్రతిరూపాలుగా పనిచేస్తాయి.

హిందూ పురాణాలలో లెక్కలేనన్ని పోరాటాలు కనబడతాయి. ప్రజల చైతన్యంలోని నిజమైన పోరాటాల స్థానాన్ని ఇవి ఆక్రమిస్తాయి. ఒక అర్థంలో, ఆసియాటిక్ సమాజాలకు చరిత్ర ఉన్నదనే అనాలి. కాకపోతే అది తలకిందుల చరిత్ర. అది కేవలం మాయా ప్రపంచంలోని చరిత్రే తప్ప మాయా ప్రపంచం గురించిన చరిత్ర కాదు. ప్రజల మనసులను ఇంకా శాసించే రామాయణ, మహాభారత కావ్యాలు ఈ దృశ్యాన్నే చూపుతాయి. ఈ రెండు కావ్యాలూ కూడా నిజ జీవితంలోని వైరుధ్యాలను, ఆస్తికీ, ఆస్తి సంబంధాలకూ, ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి శక్తులపై ఆధిపత్యానికీ, రాజ్యాంగ యంత్రానికీ, ప్రజలకూ, పాలనా విధానానికీ, దౌత్యనీతికీ సంబంధం గల వైరుధ్యాలను తీసుకుంటాయి. ఐనా ఈ కావ్యాలు ప్రజలను ఆచరణకు పురికొల్పవు. రామాయణం లోని అంగీకరించిన దృక్పథాన్ని బట్టి చూస్తే, ప్రతి గ్రామం లోనూ మరొకరి భార్యను లేవదీసుకుపోగల రావణుడున్నాడని తెలుస్తుంది. ప్రతి గ్రామంలోనూ వాలి-సుగ్రీవుల లాంటి అన్నదమ్ములున్నారు. రావణ-విభీషణుల్లాంటి అన్నదమ్ములున్నారు. అయితే, ఎక్కడా గ్రామస్తులు రావణులను తొలగించేందుకు ప్రయత్నించరు. ఆ లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన కలయికలను ప్రజల మధ్య పెంపొందించేందుకు కృషి చేయరు. కాని ఆశ్చర్యకరంగా, ప్రతి గ్రామమూ స్త్రీలందరినీ సీతమ్మతల్లిలా మారిపొమ్మని విజ్ఞప్తి చేస్తుంది. అదే విధంగా ప్రతి గ్రామంలోనూ భూములన్నిటినీ ఆక్రమించే, స్త్రీలను చెరిచే, జనాలను జూదమాడడానికి ప్రోత్సహించే దుర్యోధనుల లాంటి వాళ్ళున్నారు. ప్రతి గ్రామం లోనూ జ్ఞానఫలాలు నిరాకరించబడిన ఏకలవ్యులున్నారు. అయినా దుర్యోధనులను తొలగించేందుకు, సామాజిక నిర్మాణాన్ని మార్చదలచిన స్త్రీ పురుషులకు ధైర్యసాహసా

లిచ్చేందుకు ప్రజలను మహాభారతం ప్రేరేపించడం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఈ రెండు కావ్యాల సందేశం హింసకాగా, రెంటినీ కూడ అహింసను ప్రబోధించడానికి వాడుకున్నారు. ముసుగంటే ఇదే.

విభజించబడి ఉన్న సమాజంలోని ఘర్షణలను, ఉద్రిక్తతను కావ్యాలు అభివర్ణించగా, ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడం మాత్రం ఒక రాముడి ద్వారానో, కృష్ణుడి ద్వారానో, భగవంతుడి అవతారం ద్వారానో, దివ్యస్వరూపం ద్వారానో సాధించారు. ఇట్లా చేయడం ద్వారా వైరుధ్యంలోని ఐక్యతను దైవ ప్రపంచంలో అభివర్ణించి, నిజ జీవితంలోని ఘర్షణలను యథాస్థితిలో కొనసాగనిచ్చారు. ఎన్నో పోరాటాలు జరిగినప్పటికీ, నిజ జీవితంలో పరిష్కారం ఎప్పుడూ ఒక దైవ సాక్షాత్కారం కోసం ఎదురు చూడడానికి బహుశా కారణం ఇదే కావచ్చు. ప్రజలు ఒక భగవంతుని కోసం ఎదురు చూస్తుంటారు. జాతీయ స్థాయిలో గాంధీ లాగనో, ఇరవైలలో విశాఖపట్నం కొండలలో అల్లూరి సీతారామరాజు లాగనో, నలభైలలో తెలంగాణలో కొమురం భీము లాగనో, ముప్పైలలో జార్ఖండ్ ప్రాంతంలో బిర్సా ముండా లాగనో ఈ వైరుధ్యాల పరిష్కారానికి ఒక మనిషి ప్రయత్నిస్తే, ఆ మనిషి కూడ ప్రజల దృష్టిలో ఒక మహాత్మునిగా, భగవంతుని అవతారంగా మారిపోతాడు. ఈ భగవంతుని ఆవతారం గురించి జనం తమ కథలు తాము అల్లుకుంటారు.

ఒక ఊహా ప్రపంచంలో దైవసహాయంతో వైరుధ్యాల్ని పరిష్కరించుకోవడం, నిజజీవితంలో వాటి పరిష్కారానికేమీ ఉపయోగపడదు. కాని ఒక విభజింపబడి ఉన్న సమాజంలో ఐక్యతను నెలకొల్పడానికి ఉపయోగపడుతుంది. వైరుధ్యాల పరిష్కారం కోసం దైవం కోసం నిరీక్షించే ఐక్యత ఇది. "ఈ సమాజానిది ఒక రకమైన సమతౌల్యం మీద ఆధారపడిన చట్రం. ఈ సమతౌల్యం సభ్యులందరి మధ్య ఒక సాధారణ వికర్షణ ఫలితంగానూ, నిర్మాణగతమైన ఒంటరితనం ఫలితంగానూ ఏర్పడింది" అని మార్క్స్ అన్నప్పుడు బహుశా ఆసియాటిక్ సమాజంలోని ఈ కోణాన్నే ప్రస్తావించి ఉంటాడు.

ఒక సమాజంలో విడివిడి సభ్యుల మధ్య వికర్షణ అనేది సాధారణ అనుభవమే. కాని వికర్షణలోనే ఆకర్షణ కూడ ఇమిడి ఉంటుంది. అదేవిధంగా మనుషులు ఒంటరితనం కోసం తహతహలాడతారు. కాని ఆ ఒంటరితనంలో సమష్టితత్వం ఉండనే ఉంటుంది. ఈ వికర్షణ-ఆకర్షణ, ఒంటరితనం-సమిష్టితత్వం సాంఘిక

చరిత్రకు పునాదిని సృష్టించి పెడతాయి. సాంఘిక చరిత్ర వర్గాల మీదుగా, వర్గపోరాటాల మీదుగా, తత్ఫలితమైన సామాజిక పునర్నిర్మాణం మీదుగా సాగిపోతుంది. ఆసియాటిక్ సమాజాలు తమంతట తామే ఈ వికర్షణ-ఆకర్షణ నుంచి దూరమై కేవలం వికర్షణనే ప్రకటించడం ద్వారా, ఒంటరితనం-సమష్టితత్వం నుంచి విడిపడి కేవలం ఒంటరితనాన్నే ప్రకటించడం ద్వారా తమను తాము ఏకముఖ సమాజాలుగా చూపుకుంటాయి. మరొక ముఖాన్ని దైవానికి అప్పగిస్తాయి. ఈ రకమైన ఎడబాటు, ఈ రకమైన ఏకముఖత్వం రాజ్యాంగయంత్రం ద్వారా, భావజాలం ద్వారా జరిగి, వాటివల్లనే సాధ్యమయ్యాయి. భారత సమాజంలోని ఆసియాటిక్ ప్రజలకు ప్రధాన చారిత్రక పూర్వరంగం ఈ అంశమే.

ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఈ అంశం రచయితకు మరింత బాగా తేట తెల్లమయింది. ఒక విశ్వవిద్యాలయ క్వార్టర్లలో, హీరాకుడ్ ఆనకట్ట జలవిద్యుత్ కేంద్రం ప్రక్కన నివసిస్తూ కూడ, ఒక శనివారంనాడు రోజంతా కరెంటు వస్తూ పోతూ, పన్నెండు గంటల కన్న ఎక్కువసేపు కరెంటుపోయి ఇబ్బంది అయింది. ఐనా నిరసన లేదు, కోపం లేదు. కేవలం ఒకే ఒక్క విచిత్రమైన ఆశ ఏమంటే ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు టీవీ రామాయణం సమయానికల్లా కరెంటు తిరిగి వస్తుందనేదే. ఐతే ఈ ఆశకు సమర్థన లేకపోలేదు. సరిగ్గా ప్రకటనలు అయిపోయిన తర్వాత తొమ్మిదీ ముప్పావు కల్లా కరెంటు వచ్చింది. రామానందసాగర్ తన తర్వాతి కథనంతో సిద్ధంగా ఉన్నాడు. రామాయణం అయిపోగానే కరెంటు మళ్ళీ వస్తూ పోతూ ఉండడం మొదలయింది. రాముడే కరెంటు తీసుకొచ్చాడనో, కరెంటు తిరిగి రావడానికి ప్రయత్నించిన మనిషి రాముని అవతారమనో జనం అనుకుంటే ఏమీ ఆశ్చర్యం లేదు. ఇదంతా ఒక అద్భుతాల ప్రపంచం. ఇది ఒక అధివాస్తవిక ప్రపంచం. ఇక్కడ మానవ కార్యకలాపాలన్నీ భగవంతుడికి ఆపాదించబడతాయి. భగవంతుడికి మానవ లక్షణాలుంటాయి.

భగవంతుణ్ణి మానవీకరించడం, మనుషులకు దివ్యత్వం ఆపాదించడం కేవలం హిందూ మత ధర్మంలోనూ, దాని సిద్ధాంతాలలోనూ మాత్రమే సాధ్యమవుతుంది. ఈ ద్వంద్వ శక్తి మనుషులకూ దైవానికీ ఉన్న వైరుధ్యాన్ని తోసిపుచ్చదు. కాని వైరుధ్యం మనిషిని భగవంతునితో ఐక్యం చెయ్యడంలోనూ, భగవంతుణ్ణి మనిషితో ఐక్యం చెయ్యడంలోనూ మాత్రమే ఉంటుంది. మనిషికీ భగవంతునికీ మధ్య ఘర్షణ

వ్యతిరేకత ఉండవు. ఒక వైరుధ్యంలో ఐక్యత మాత్రమే ఉంటే అది యథాస్థితిని సమర్థిస్తుంది. ఘర్షణే సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోతుంది. ఆసియాటిక్ సమాజాలలోలాగ ఈ ఐక్యతను భగవంతుడు కూడ సమర్థిస్తే, తద్వారా ఏర్పడిన స్థిరత్వం దైవ ప్రసాదంగా ఉంటుంది. బ్రిటిష్ రైల్వేలు ఈ దైవలోకాన్ని వాస్తవ లోకంలోకి తీసుకొస్తాయని మార్క్స్ సూచించాడు. కాని బహుశా ఈ కర్తవ్యం రైల్వేల వల్ల, వాటి బొగ్గు వల్ల, వాటి ఉక్కు వల్ల, వాటి స్లీపర్ల వల్ల, పర్యవసాన మైన ఆధునిక పరిశ్రమవల్ల చితికిపోయిన ప్రజలకే చెందుతుంది.

4

భగవంతుని కానుక నుంచి మానవకృషి వైపు మళ్ళించే ప్రయత్నాలు ఈ మధ్య కాలంలో, ప్రత్యేకించి గత రెండు దశాబ్దాలలో పెరుగుతున్నాయి. ఉత్పత్తి శక్తుల స్థాయిలో, భారతీయ విజ్ఞానశాస్త్రాన్ని ప్రాచీనకాలంలో గుర్తించడానికి మేధో ప్రయత్నాలు జరుగుతున్నాయి. చరిత్రకు ముడిసరుకైన మనిషిని విజ్ఞానశాస్త్రం సాయంతో, శాస్త్ర స్ఫూర్తి సాయంతో విద్యావంతుణ్ణి చేస్తున్నారు. గత రెండు దశాబ్దాలలో ఉనికిలోకి వచ్చిన పాపులర్ సైన్స్ బృందాలు విజ్ఞానశాస్త్రాన్ని ప్రచారం చేయడానికో, పాపులర్ సైన్స్‌ను సృష్టించడానికో చేస్తున్న ప్రయత్నాలు ఈ కృషికి స్పష్టమైన చిహ్నాలే. ఈ మధ్యనే ముగిసిన విజ్ఞానయాత్ర ప్రకృతి-మానవ వైరుధ్యాన్ని వాస్తవ ప్రపంచంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలకు ఒక నిదర్శనంగా నిలవ వచ్చు.

ఆస్తి సంబంధాల స్థాయిలో కూడ వేరువేరు స్వచ్ఛంద సంస్థలు కొత్త ఆస్తి సంబంధాలను ప్రవేశపెట్టడానికి చాల ప్రయత్నాలు చేస్తున్నాయి. అది కష్టకారి సంఘటన అయినా, తిలోనియా అయినా, ఇతర బృందాలయినా వ్యవస్థ లోపలినుంచే ఒక ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి చేస్తున్న ప్రయత్నం ఒక కొత్త ఆస్తి సంబంధాన్ని సృష్టిస్తోంది. గత రెండు దశాబ్దాలలో దేశవ్యాప్తంగా ఇటువంటి ప్రయత్నాలు కూడ లెక్కలేనన్ని జరుగుతున్నాయని గుర్తించడం చాల ముఖ్యం. ఒక అర్థంలో, గత రెండు దశాబ్దాలను చూస్తే పునరుజ్జీవన దశలోని వాతావరణం గుర్తుకొస్తుంది.

విస్తృతస్థాయిలోనూ, ఒక అర్థంలో చెప్పాలంటే సంపూర్ణ స్థాయిలోనూ,

పూర్తిగా కొత్త ప్రాపంచిక దృక్పథం నుంచి అన్ని సాంఘిక సంబంధాలనూ ప్రశ్నిస్తూ, చరిత్ర చోదక శక్తులేమిటని అన్వేషిస్తూ ప్రారంభమైనది నక్సలైట్ ఉద్యమం. ప్రజా ఉద్యమాలను 'వ్యక్తీకరించడం' ద్వారా ఉత్పత్తి శక్తుల రంగం లోనూ, ఆస్తి సంబంధాల సంగంలోనూ, దైవిక ఐక్యత విషయంలోనూ సంలీన క్రమాన్ని ఈ అన్వేషణ సవాల్ చేసింది. ఇట్లా ప్రశ్నించడం ద్వారా, ఈ అన్వేషణ భారత సమాజంలో చరిత్ర నిర్మాణానికి పునాదులు వేసింది. చరిత్ర, విప్లవాలు సామాజిక వ్యవస్థను మార్చేందుకు మాత్రమే కాదు, శతాబ్దాలుగా పేరుకుపోయిన బురదను వదిలించి, మానవాళిని కొత్తగా ఆలోచింపజేసేందుకు కూడ అవసరం. నక్సలైట్ ఉద్యమం ప్రారంభించినదీ క్రమాన్నే.

ఇది ఎట్లా సాధ్యమైంది? బ్రిటిష్‌వాళ్లు ప్రవేశపెట్టిన రైల్వేలు, ఆధునిక పరిశ్రమ పరివర్తనా వాహికలని మార్క్స్ దాదాపు కచ్చితంగా అన్నాడు. "భారత ప్రగతికీ, భారత శక్తికీ నిర్ణయాత్మక ఆటంకాలుగా ఉన్న భారతీయ కులాలు ఏ అనువంశిక శ్రమ విభజన మీద ఆధారపడ్డాయో ఆ శ్రమ విభజనను రైల్వే వ్యవస్థ ద్వారా రూపొందే ఆధునిక పరిశ్రమ రద్దు చేస్తుంది" అని మార్క్స్ అన్నాడు. సామ్రాజ్యవాద దశ కంటె ముందు పెట్టుబడి గురించి రాసిన మార్క్స్, పెట్టుబడి తన కంటె ముందరి అన్ని రూపాలనూ రద్దు చేస్తుందని ఆశించాడు. కాని సమకాలీన అనుభవం ఈ ఆశను భగ్నం చేస్తుంది. ఆధునిక పరిశ్రమల నిర్వాహకులు వాటిని ఎంతగా కొత్తయుగాలలోకి, కొత్త శతాబ్దాలలోకి నడిపించుకుపోతూ ఉంటే, అంత ఘనీభవ రూపాలలో కులం, మతం, మత శాఖలు వ్యక్తీకరణ పొందుతున్నాయి. బహుశా అహ్మదాబాద్ అన్నిటికన్న కొట్టవచ్చేటట్టు కనిపించే ఉదాహరణ. అక్కడ ఒక పక్క పరిశ్రమ పురోగమిస్తూ ఉంది. మరొక పక్క కుల రూపాలు దృఢంగా సంఘటితమవుతున్నాయి. మత రూపాలు ఇతోధికంగా బైటపడుతూ వీధుల్లో కొస్తున్నాయి. ఇక్కడ, ఆధునిక పరిశ్రమకు ప్రధాన చోదకమైన మిగులు సేకరణ కూడ వెనుకబడిపోతోంది. నగరం అతి ఎక్కువ సమ్మెలతో, బంద్‌లతో, కర్ఫ్యూలతో దెబ్బతింటోంది ఇదంతా కూడ సమాజంలో ఇంకా అపరిష్కృతంగా ఉన్న కుల-మత కోణం వల్లనే.

సామాజిక వ్యవస్థలోనూ, సామాజిక వ్యవస్థ గురించిన భావాలలోనూ, పరివర్తనా శకాన్ని ఆధునిక పరిశ్రమ సాధించలేకపోతే, ఇక మనం బ్రిటిష్‌వాళ్ల

రూపొందించిన ఆధునిక భారతదేశపు మరొకకోణంవైపు దృష్టి సారించవలసి వస్తుంది. ఆధునిక భారత పరిణామం అంటే ఆధునిక పరిశ్రమ, ఆధునిక కార్మిక వర్గం, ఆధునిక విద్య తడితరాల పరిణామమే అన్నట్టు చూడడం అలవాటయిపోయింది. మార్పుకోసం మనం ఇతర కోణాలు పరిశీలిద్దాం.

దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాల గురించి, అటువంటి కార్యక్రమాలకు పెరుగుతున్న బడ్జెట్ కేటాయింపుల గురించి చర్చించడంలో గత రెండు దశాబ్దాలుగా దేశం తలమునకలవుతోంది. ఎన్నికల వ్యవహారాలలో కూడ ఈ చర్చకు భాగం ఉంది. దారిద్ర్యం అనేదాన్ని చర్చనీయాంశంగానో, రాజకీయ చైతన్యాన్ని, ప్రాబల్యాన్ని పెంచే సాధనంగానో ఉపయోగించడం కాంగ్రెస్ పార్టీ అంత పాత సాంప్రదాయం. దాన్ని కురు వృద్ధుడు దాదాభాయి నౌరోజీ ప్రారంభించాడు. తర్వాత, కొందరికి దరిద్ర నారాయణులనీ, కొందరికి హరిజనులనీ పేరుపెట్టడం ద్వారా గాంధీ ఈ పరిణామానికి ఆసియాటిక్ కోణాన్ని కల్పించాడు. ఆ తర్వాత గాంధీ పేరుమీద బతికేవాళ్లు వాళ్ళనే ఆధునిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా మార్చారు. ఇందుకు సమాంతరంగా, పాపులర్ సైన్స్ బృందాలు, స్వచ్ఛంద అభివృద్ధి బృందాలు, వివిధ నక్సలైటు గ్రూపులు పేదరికం నిండిన ఈ ప్రజా బాహుళ్యంతోనే తమ ప్రయోగాలు చేస్తున్నారు. ఈ బృందాలలో భాగస్వామ్య శక్తులు ఎవరు, ఈ బృందాలు ఎట్లా ఆవిర్భవించాయి అవేవే ఆధునిక భారత ఆవిర్భావంలో రెండో కోణం. సాంస్కృతికంగా చెప్పాలంటే, ఈ బృందాలలో గిరిజన ప్రజానీకం, అస్పృశ్యులు, కింది కులాలకు చెందిన ప్రజలు ఉన్నారు. ఆర్థికపరంగా చెప్పాలంటే, ఈ బృందాలలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీళ్లందరినీ కలిపితే జనాభాలో దాదాపు సగభాగం ఉంటారు. వాళ్ళ పరిణామాన్ని రేఖామాత్రంగా చూద్దాం.

భూమి సెటిల్‌మెంటు పద్ధతిని ప్రవేశపెట్టడంతోనూ, విపరీతమైన భూమి శిస్తును ద్రవ్య రూపంలో చెల్లించాలని బ్రిటిష్‌వాళ్ళు పట్టు పట్టడంతోనూ ఇదంతా మొదలయింది. సువిశాలమైన దేశంలో, ధాన్య రూపంలో శిస్తు చెల్లింపులు ఉన్న చోట, భూమిశిస్తు రేట్లు సాంస్కృతికంగా నిర్ణయమయ్యే చోట ఎక్కువ మిగులును తీసుకుపోయేందుకూ, దాన్ని కూడ ద్రవ్యరూపంలో తీసుకుపోయేందుకూ బ్రిటిష్ వాళ్ళు జోక్యం చేసుకోవడంతో ఒక్కదెబ్బకు రెండు విరుద్ధ శక్తులు ఉనికిలోకివచ్చాయి.

ఈ రెండు శక్తులూ ఈ పరిణామ క్రమపు రెండు కోణాలను సూచిస్తాయి. ఒక పక్కన అది పెద్ద ఎత్తున డబ్బు వ్యాపారులను సృష్టించింది. మరోపక్కన, డబ్బుతో నిర్ణయమయ్యే ఆర్థిక వ్యవస్థలో తమ భూమిని పోగొట్టుకున్న చిన్న రైతులు పుట్టుకొచ్చారు. వ్యవసాయ కూలీలు అంతకు ముందు కూడ ఉండి ఉండవచ్చును. బ్రిటిష్‌వారి రాకకన్న ముందే కూలీలు ఉండవచ్చు కానీ అతివేగంగా వ్యవసాయ కూలీలు తయారుకావడం మాత్రం బ్రిటిష్ భారతదేశపు పరిణామమే. రెవెన్యూ సెటిల్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టడంతో శిస్తు లేని ఇనాం భూముల యజమానులు కూడ ఇబ్బందుల పాలయ్యారు. ఇందుకు వ్యతిరేకంగా చాల చోట్ల ప్రతిఘటన ఉద్యమాలు చెలరేగాయి. 1917 పాయిక్ తిరుగుబాటు అటువంటి ప్రతిఘటనోద్యమాలలో వెంటనే గుర్తుకొస్తుంది. పాయిక్‌లు ఒరిస్సా రాజులకు రక్షణ, సైనిక సేవలను అందిస్తూ శిస్తులేని భూయజమానులుగా ఉండేవారు. వారిని భూముల నుంచి తొలగించగానే, ఖుర్దా ప్రాంతంలో కొంతకాలంపాటు తిరుగుబాటు జరిగింది. అయితే ఈ తిరుగుబాటు అణచివేయబడింది.

ద్రవ్యరూపంలో శిస్తు, భూమి సెటిల్‌మెంట్లను వెన్నంటి సాగినది వ్యాపారీకరణ క్రమం. డబ్బు వ్యాపారులు వాణిజ్యవేత్తలు కూడ అయిపోయారు. ఈ క్రమంలో గ్రామాన్ని అంతర్జాతీయ మార్కెట్‌కు ముడివేశారు. పత్తి, వేరుశనగ, జనుపనార వంటి పంటలు కొనసాగుతున్న విధానాలను ధ్వంసం చేశాయి. డబ్బు వ్యాపారిని బలోపేతం చేశాయి. చిన్న రైతులను బలహీనపరిచి, భూమి నుంచి తొలగించాయి. ఇటువంటి క్రమానికి శిఖరాయమాన మనదగిన సంఘటన 1988లో ఆంధ్రప్రదేశ్‌లోని సంపన్న, అభివృద్ధి చెందిన ప్రాంతంలో 30కి పైగా పత్తి రైతుల ఆత్మహత్య, పత్తి పండించడానికి తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించడంలో విఫలమై వాళ్ళు తమ మనుగడనే పోగొట్టుకోవలసి వచ్చింది. కాని అది చివరి దశ. ఈ మధ్యకాలంలో వాళ్ళు పేదరైతులయ్యారు, కౌలుదార్లయ్యారు. వెట్టిచాకిరీ చేశారు. మరో కొసన వడ్డీవ్యాపారి, వ్యాపారుల సంపద పెరిగిపోయింది.

అటవీ చట్టాలు, రక్షిత అడవులు, అటవీ భూముల సెటిల్‌మెంటు మొదలైన కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాలలో కల్పించుకున్న జోక్యం ఆ ప్రాంత ప్రజల్ని వాళ్ళ జీవన విధానాలనుంచి తొలగించింది. వాళ్ళను వ్యవసాయ కూలీలుగా, కాంట్రాక్టు కార్మికులుగా, వెట్టి కార్మికులుగా, గని కార్మికులుగా మార్చింది.

ఈ పరిణామానికి ఝార్ఖండ్ ప్రాంతం సజీవసాక్ష్యంగా నిలుస్తుంది. ఇట్లా తమను నిరాశ్రితులను చేసిన చట్టాల దురాక్రమణ పట్ల ప్రతిఘటనలే గిరిజన తిరుగుబాట్లయ్యాయి. ఈ క్రమం కొనసాగుతూ ఉంటే అటవీ ఉత్పత్తుల వ్యాపారం, అవి భారీ ఉత్పత్తులయినా, చిన్నతరహా ఉత్పత్తులయినా, వడ్డీవ్యాపారులనూ, వ్యాపారులనూ ప్రవేశపెట్టింది.

ఇందుకు తోడుగా, టారిఫ్‌లకు, విదేశీ మారక రేట్లకు సంబంధించిన బ్రిటిష్ విధానం, బట్టల పరిశ్రమ గానీ, మరే పరిశ్రమ గానీ మొత్తంమీద ఆధునిక పరిశ్రమ స్థానిక చేతివృత్తి పనివాళ్ళను మార్కెట్‌లో నుంచి తొలగించాయి. భారత చేనేత పనివారి ఓటమికి చిహ్నంగా చరఖా ప్రచారంలోకి వచ్చింది గాని, చెప్పుల తయారీదార్ల గురించి, కుమ్మరివాళ్ళ గురించి, బుట్టలు అల్లేవాళ్ళ గురించి, ఇతర చేతివృత్తులన్నిటి గురించీ చాల తక్కువ తెలుసు.

బ్రిటిష్ కాలం మొత్తానికీ సారభూతమైన అంశమేమంటే, ఒకచివర వ్యవసాయ రంగంలో పెరిగిపోతున్న రుణభారం. మరోచివర, వ్యాపారి-వడ్డీ వ్యాపారి-పారిశ్రామిక వర్గపు పెరుగుదల. ఈ రంగంలో, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసర్చ్ అండ్ ట్రెయినింగ్ కోసం భారత ఆర్థిక వ్యవస్థ పరిణామం గురించి తయారయిన పుస్తకం నుండి ఉటంకించడం బాగుంటుంది." దొరుకుతున్న అంచనాలను బట్టి స్థూలమైన అంచనాలను, స్పష్టమైన పెరుగుదల సూచికలను గుర్తించవచ్చు. 1880 ఫామిన్‌కమిషన్ (కరువు పరిశీలనా సంఘం) భూయజమానులయిన ప్రజానీకంలో మూడింట రెండు వంతుల మంది రుణభారంతో ఉన్నారని నిర్ధారించింది. వాళ్ళలో సగంమంది రుణాలలో చాల లోతుగా, లేవలేనంతగా కూరుకుపోయారు. 1911లో బ్రిటిష్ ఇండియాలో వ్యవసాయరంగపు రుణభారం 300 కోట్ల రూపాయలుంటుందని మెక్లగన్ అంచనా వేశాడు. ఈ సంఖ్యను 1923-24ల్లో 600 కోట్ల రూపాయలకు తక్కువ ఉండదని డార్లింగ్ అంచనా వేశాడు. సెంట్రల్ బ్యాంకింగ్ ఎంక్వైరీ కమిటీ వేసిన సమగ్ర అంచనాలలో ఈ సంఖ్యను 900 కోట్ల రూపాయలుగా తేల్చారు. 1930ల మాంద్యం రోజులల్లో వ్యవసాయోత్పత్తులకు తక్కువధరలు ఉన్న కారణంగా, రైతులకు తమ భూమి

శిస్తు, వడ్డీ తదితర అవసరాలకు తగిన డబ్బు సంపాదించుకోవడం చాల కష్టమ యింది. తత్ఫలితంగా రుణభారం మరింత పెరిగింది."

వ్యవసాయంలో రుణభారం ఎంత ఉన్నా, అది వడ్డీ వ్యాపారులకు తిరిగి రాగల ఖాతాగానే ఉంటుంది. వ్యవసాయ కూలీ పోగొట్టుకున్నదాన్ని, వడ్డీ వ్యాపారి సంపాదించుకుంటాడు. వడ్డీ వ్యాపారులు విపరీతంగా సంపాదించారు కూడ. పారిశ్రామిక రంగంలో కూడ ఈ లాభాలు స్పష్టంగానే కనబడ్డాయి. ఇక్కడ కూడ మళ్ళీ ఆ పుస్తకం నుంచే ఉటంకిస్తాను : "1942 తర్వాత నుంచి మరీ ముఖ్యంగా పెద్ద ఎత్తున కొత్త కంపెనీలు పుట్టుకొచ్చాయి. 1939 నుంచి 1946 నాటికి జాయింట్ స్టాక్ కంపెనీల సంఖ్య 11114 నుంచి 17343 కు పెరిగింది. వాటి పెట్టుబడి 290 కోట్ల రూపాయల నుంచి 424 కోట్ల రూపాయలకు పెరిగింది". "ఆధునిక భారత పెట్టుబడిదారీ విధానం, అది మొట్టమొదటి లేత మొక్కగా పుట్టిన తర్వాత శతాబ్దంలో భారతదేశపు నేలలో బలంగానే వేళ్ళూనింది.... రెండు ప్రపంచ యుద్ధాలు దానికి ప్రేరణనందించాయి. బ్రిటిష్ యుగం ముగిసిపోయే నాటికి, భారతీయ పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం స్థిరంగానే నెలకొనింది. అది ఇంకా అసమగ్ర అభివృద్ధితో, తీవ్రమైన లోపాలతో కూడి ఉన్నప్పటికీ, అది ఒక శక్తివంతమైన సాంఘిక ఆర్థిక పునాదిగా తయారయింది".

భారత పెట్టుబడిదారీ వర్గపు పెరుగుదల ఎటువంటిదయినప్పటికీ అది భారత సమాజపు మౌలిక బలహీనతను ప్రతిఫలించింది. ఆ వర్గం బలం పెరుగుతున్న కొద్దీ, సమాజం తన లోపాల కింద కుంగిపోయింది. 1943 బెంగాల్ కరువు గురించి ఎంతయినా చెప్పవచ్చు. ఆ పుస్తకంలోనే చెప్పినట్టు "మరొక పెద్ద కరువు 1943లో బెంగాల్‌లో సంభవించింది. అయితే దీన్ని సాధారణంగా మానవ కల్పిత ఉత్పాతంగా అభివర్ణిస్తారు. పాలనాపరమైన లోపాలు, ఆహారధాన్యాల సరఫరాకు తగిన రవాణా సౌకర్యాలు లేకపోవడం, పెద్ద ఎత్తున ఆహార పదార్థాల్ని దాచిపెట్టడం, ప్రైవేట్ వ్యాపారంలోని లాభార్జన దృష్టి వంటివన్నీ కలిసి ఒక స్థానిక, పరిష్కరించదగిన కొరతను మహావిపత్తుగా మార్చివేశాయి. అందువల్ల పదిహేను లక్షలమంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చింది". యుద్ధ కాలంలో లాభాలను, విపరీత లాభాలను భారతీయ పెట్టుబడి సంపాదిస్తూ బలపడుతున్న సమయంలోనే ఈ విపత్తు సంభవించింది. అట్లా, దృశ్యానికి ఒక నివరన

పెట్టుబడిదారీ వర్గంగా పెరిగిపోయిన వడ్డీ వ్యాపారులుండగా, మరొక చివరన వ్యవస్థలో నుంచి బైటికి తోసివేయబడిన పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఉండి పోయారు.

బహిరంగంగానే అటంకాలుండిన వాతావరణంలో వ్యవహరించవలసి వచ్చిన భారతీయ పెట్టుబడిదారీ వర్గపు అభివృద్ధి కథ ఇది. 1947లో వచ్చిన స్వాతంత్ర్యం వారి విషయంలో తమ అభివృద్ధి కొనసాగింపుగానూ, స్వంత చొరవతో వ్యవహరించడంగానూ ఉండింది. ఆ తర్వాత దశలో ఎన్నో కర్మాగారాల స్థాపన జరిగింది. ఎన్నో ఆనకట్టలు నిర్మాణమయ్యాయి. అటువంటి ఆనకట్టలలో ఒకటి సంబల్‌పూర్ లోని హిరాకుడ్ ఆనకట్ట. ఈ ఆనకట్ట కింద ఇప్పుడు లక్షన్నర హెక్టేర్ల భూమికి నీరందుతుంది. కాని ఈ ఆనకట్ట ఎంతోమంది గ్రామస్థులను నిరాశ్రయులను చేసింది. భూములు, ఇళ్ళు మునిగిపోవడం ద్వారా లక్షమంది నిరాశ్రయులయ్యారనీ, వాళ్ళ జీవనోపాధి పోయిందనీ అంచనాలున్నాయి. ఆనకట్ట నిర్మాణమైన ముప్పై సంవత్సరాల తర్వాత ఆ ప్రజలు ఎక్కడెక్కడున్నారో ప్రభుత్వానికి కూడ తెలియదు. సరైన పునరావాసం గురించి చెప్పనే అక్కరలేదు. స్వతంత్ర భారతంలో స్వంత చొరవ మీద జరిగిన ఉదంతమిది. ఆనకట్టలన్నిటివల్ల నిరాశ్రయులైన వారి సంఖ్య దాదాపు రెండుకోట్ల పదిలక్షలుంటుందని అంచనా, ఎంతమందికి పునరావాసం దొరికిందో, ఎంతమంది వ్యవసాయ కూలీల, పేదరైతుల శ్రేణులలో చేరిపోయారో ఊహించవలసిందే. ఈ సమస్య చాల తీవ్రమైనదనీ, ఈ స్వంత చొరవ కార్యక్రమాలు నిరాటంకంగా జరిగిపోగూడదనీ ప్రస్తుత తెహ్రి, నర్మద లోయ, కోయెల్ కారో మొదలైన ఆందోళనల్లో వ్యక్తమవుతోంది.

స్వంత చొరవవల్ల చాల కర్మాగారాలు కూడ పుట్టుకొచ్చాయి. రూర్కెలా ఉక్కు కర్మాగారం అటువంటిదే. 30 చదరపు కిలోమీటర్ల భూమిని ఆక్రమించుకోవడమంటే భారతదేశంలో చాలామందిని నిరాశ్రయుల్ని చేయడమవుతుంది. ఇక్కడ కూడ నిరాశ్రితుల గతి ఏమయిందో ఏ ఆధారాలు లేవు. తమ సాంప్రదాయిక వృత్తుల నుంచి తొలగించబడి, మరో ఉద్యోగమేది కల్పించబడని ఈ ప్రజలు మరిచిపోబడ్డారు. జాతీయ సౌఖ్యంకోసం త్యాగం చెయ్యటమే వారి కర్తవ్యమయింది. వారి చరిత్ర నమోదు కాలేదు. ప్రస్తుతం ఒరిస్సాలో గంధమర్దన్ కొండల్లో బాల్కో గనులకు వ్యతిరేకంగానూ, బాలాసోర్ జిల్లాలో రక్షణశాఖ క్షిపణి కేంద్రా

నికి వ్యతిరేకంగానూ సాగుతున్న ప్రజా ఉద్యమాలు మాత్రమే ఇందుకు మినహాయింపు. ఈ రెండు సందర్భాలలోనూ నష్టపోతున్న ప్రజలు తమ చారిత్రక దృక్పథాలను నమోదు చేస్తున్నారు.

ముగింపుగా, భారత ఆర్థిక వ్యవస్థ పరిణామం పెద్దమొత్తంలో ప్రజానీకాన్ని బైటికి తోసేస్తోంది. వాళ్ళకు వ్యవసాయరంగంలో పని లేదు. ఆధునిక పరిశ్రమలో పనికి వాళ్ళు ఉపయోగపడరు. ఈ తొలగించబడిన ప్రజానీకం, భారత జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీళ్ళందరూ భారత ఆర్థిక వ్యవస్థ పరిణామ ఫలితాలే. ఈ ప్రజానీకాన్నే అధికారులు దారిద్ర్యరేఖకు దిగువన గల ప్రజలుగా నమోదు చేస్తారు. అన్ని పాపులర్ సైన్స్, విజ్ఞానశాస్త్ర ప్రచారక, అనియత విద్య వగైరా స్వచ్ఛంద సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నది ఈ ప్రజానీకాన్నే. స్వచ్ఛంద అభివృద్ధి బృందాల పనికి ప్రేరణ కలిగించేది ఈ ప్రజానీకమే. పార్లమెంటరీ ఎన్నికలకు వోట్ బ్యాంకులుగా పని చేసేది ఈ ప్రజానీకమే. ఈ ప్రజానీకంలోనే నక్సలైట్ ఉద్యమం మొత్తం సమాజాన్నే మార్చే చోదకశక్తుల్ని గుర్తిస్తోంది.

కనుక చరిత్ర నిర్మాణ సమస్య, చరిత్ర రచన సమస్య ఈ ప్రజానీకం చుట్టూనే తిరుగుతుంది. ఆ ప్రజల పోరాటాలు ఐక్యతను సాధించగలవా, లేక ఊహాత్మక స్థాయిలో ఐక్యతను సాధించడంలో రాజ్యాంగయంత్రం, భావజాలం విజయం సాధిస్తుందా, ఇదంతా ఆసియాటిక్ సాంప్రదాయంలో భాగంగా జరుగుతుందా అనేదే ఆ చారిత్రక ప్రజల చరిత్రకు మూలమైన చిక్కుముడిగా ఉంటుంది.

సమీక్షా వ్యాసం :

వసంతగీతం

వి. స్వాతి

"అట్టడుగు అగాధాల నుంచి
కష్టజీవులు కమ్యూనిజం లోనికొస్తారు !
గనుల గర్భాల నుంచి
కొడవళ్ళ లోంచి
కార్ఖానాల నుంచి !"

—మయకోవ్‌స్కీ

కష్టజీవులు కమ్యూనిస్టులుగా మారే, ఎదిగే క్రమం మానవ సంబంధాల అభివృద్ధికి గల సృజనాత్మక, ప్రగతిశీల అంశాలనెన్నిటినో రుజువు చేస్తుంది. కమ్యూనిస్టు కావడమనేది ఒక సత్యత్వమో, ఒక పచ్చబొట్టో కాదని, అది నిరంతరం జ్వలించే చైతన్యమని అర్థం చేసుకున్నప్పుడు కమ్యూనిస్టుగా మారే పరిణామ క్రమం చాల ఆశ్చర్యకరంగానూ, అద్భుతంగానూ కనిపిస్తుంది. మనిషి తన మీద తాను చేసుకునే పోరాటంలోనూ, వ్యవస్థ మీద చేసే పోరాటంలోనూ ఎంత ప్రగతిశీలంగా, ఎంత సృజనాత్మకంగా ఉన్నాడనేదే కమ్యూనిస్టుగా గుర్తించడానికి గీటురాయి అవుతుందని సాంస్కృతిక విప్లవ అనుభవం తేల్చింది.

సామాజిక పురోగమనం ఎట్లా సరళరేఖ కాదో, వ్యక్తి పురోగమనమూ అట్లాగే సరళరేఖ కాదు. ఏ మామూలు వ్యక్తి జీవితంలోనైనా ఉండే శిఖరాలూ లోయలూ, ఆనందాలూ విషాదాలూ, కమ్యూనిస్టు కాదలచిన వ్యక్తి జీవితంలో మరింత ఎక్కువగా ఉంటాయి. కమ్యూనిస్టు కావడమనేది వ్యవస్థతో, కొనసాగుతున్న విలువలతో, తనకు అందిన అభిప్రాయాలతో నిత్య పోరాటక్రమం. గనుక ఈ క్రమంలో పొరపాట్లు, వైఫల్యాలు, అలసటలు కూడా ఉంటాయి. అందువల్ల కమ్యూనిస్టు పరిణామక్రమం మరిన్ని మలుపులతో, మరింత ఉద్వేగమయంగా ఉండక తప్పదు. అంతేగాక కమ్యూనిస్టు కావడమనేది ఒక స్థలంలో, ఒక కాలంలో ముగిసిపోయే క్రమం కూడ కాదు గనుక కమ్యూనిస్టు కాదలచిన వ్యక్తి జీవిత విధానం కల్పన కన్న దిగ్భ్రాంతి కల్పించే అవకాశమూ ఉంది.

గోర్కీ 'అమ్మ' నుంచి ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు నవలా కారులు చాలమంది ఈ కమ్యూనిస్టు పరిణామక్రమానికి కాల్పనిక రూపం, నవలా రూపం ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ సాంప్రదాయంలో సమున్నతంగా నిలవ దగిన నవల 'వసంతగీతం'. ఐతే ఈ నవల విశిష్టత కేవలం మనుషులు కమ్యూ నిస్టులుగా మారే పరిణామ క్రమాన్ని చిత్రించడంలో మాత్రమే కాక మరికొన్ని అంశాల్లో కూడ ఉంది. తెలుగు విప్లవ నవల అభివృద్ధి క్రమంలోనూ, సాధారణంగా తెలుగు సాహిత్య చరిత్రలోనూ గుర్తించదగిన ఎన్నో అంశాలు ఈ నవలలో ఉన్నాయి. ఆ అంశాల్ని గుర్తించి విశ్లేషించడం 'వసంతగీతం' విశిష్టతను చెప్పడా నికి మాత్రమే కాక, మొత్తంగా విప్లవ నవలల వస్తు శిల్పాల విశ్లేషణకు ఉపయోగ పడుతుంది.

మొట్టమొదటగా, 'వసంతగీతం' తెలుగులో తొలి సైనిక నవల. సైనిక జీవి తాన్ని చిత్రించే కథలూ, కవితలూ తెలుగులో వచ్చాయి గాని పూర్తిగా సైనిక జీవి తాన్ని చిత్రించిన నవల ఇదే. కొన్ని నవలల్లో కొన్ని భాగాలు సైనిక జీవితాన్ని చిత్రించిన నవలలు కూడ వచ్చాయి గాని, ప్రజాసైన్యపు విస్తరణను, నిర్మాణాన్ని చిత్రించిన నవల ఇదే. తెలుగునాట బీజరూపంలోనైనా ప్రజాసైన్య నిర్మాణాలు అల్లూరి సీతారామరాజు కాలం నుంచి ఉంటూ వస్తున్నాయి. ఆ వీరోచిత సాంప్ర దాయంలో ఇటు సైనిక శిక్షణనూ, అటు స్పష్టమైన రాజకీయ, సామాజిక లక్ష్యాలనూ కలగలిపి ప్రజా సైన్యానికి తొలిదశ అయిన దళ నిర్మాణాలను సాగిస్తున్నది నక్సల్బరీ పంథా. ఆ పంథా భారత పీడిత ప్రజా ఉద్యమంలోనే ఒక మైలురాయి.

పీడిత ప్రజా ఉద్యమం తన లక్ష్యాలన్నిటినీ సంపూర్ణంగా సాధించదలచు కుంటే తప్పనిసరిగా రాజ్యాధికారం దాని కనీస లక్ష్యం కావాలి. పాలక వర్గం చేతిలో హింసా సాధనంగా, దోపిడీ పీడనల వ్యవస్థను కొనసాగించే సాధనంగా ఉన్న రాజ్యాన్ని తమ చేతిలోకి తీసుకోకుండా ప్రజలు ఆ హింసను, దోపిడీ పీడనలను రద్దు చెయ్యలేరు. అంటే సామాజిక మార్పును తీసుకు రాదలచిన వర్గానికి రాజ్యాధి కారాన్ని హస్తగతం చేసుకోవడమే ప్రధాన లక్ష్యం కావలసి ఉంటుంది. మిగిలిన సామాజిక లక్ష్యాలను వాయిదా వేయడమో, విస్మరించడమో కూడదని, వాటికి కూడ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే క్రమంలోనే తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆధునిక విప్లవాల అనుభవం నేర్పుతోంది.

భారత కమ్యూనిస్టు ఉద్యమ అనుభవం మాత్రం ఈ స్థితి కన్న భిన్నమైన స్థితిని ఎదుర్కొంది. రాజ్యాధికారాన్ని ఏకైక లక్ష్యంగానో, ఒకానొక లక్ష్యంగానో కూడ భారత కమ్యూనిస్టు ఉద్యమం గ్రహించలేదు. తొలినాటి డాక్యుమెంట్లను పరిశీలిస్తే ఒక కమ్యూనిస్టు పార్టీకి సహజంగా ఉండవలసిన రాజ్యాధికార లక్ష్యం ఎక్కడా కనబడదు. నిజానికి అప్పటికే ఒక వైపు నుంచి రైతాంగ, గిరిజన ఉద్యమాలు, మరో వైపు నుంచి "టెర్రరిస్టు" ఉద్యమాలు భారత ప్రజా ఉద్యమంలోకి సైనిక అంశాన్ని తెచ్చి ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ మాత్రం ఈ సైనిక అంశాన్నీ, రాజ్యాధికార అంశాన్నీ విస్మరించింది.

తెలంగాణ విమోచనోద్యమంలో తొలిసారిగా భారత కమ్యూనిస్టు పార్టీకి సైనిక ఆచరణా వచ్చింది. ఎంతో కొంత రాజ్యాధికార స్పృహా కలిగింది. కాని సాయుధపోరాట విరమణతో, పార్లమెంటరీ పంథా మీద నమ్మకం పెరగడంతో కమ్యూనిస్టు పార్టీకి సైనిక ఆచరణ రద్దయిపోయింది. రాజ్యాధికార స్పృహ మిగిలిందేమోగాని అది పార్లమెంటరీ మార్గాన్ని దాట లేదు. నక్సల్బరీ ప్రజ్వలనం తర్వాతనే, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆవిర్భవించిన తర్వాతనే పీడిత ప్రజా ఉద్యమపు ప్రధానలక్ష్యం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమనీ, ఇందుకు సాయుధ పోరాటం, గెరిల్లా పోరాట ఎత్తుగడలు, ప్రజాయుద్ధ వ్యూహం, సైనిక ఆచరణ అత్యవసరమనీ స్పష్టమైంది.

ఇరవై సంవత్సరాలుగా సాగుతున్న ఈ ప్రజా సైనిక ఆచరణ 1980ల తర్వాత గణనీయమైన అభివృద్ధిని సాధించింది. దండకారణ్యమంతా విస్తరించాలనే ఈ అవగాహన అమరుడు పెద్ది శంకర్ కృషితో మారాకు లేసింది. ఆ తర్వాత కాలంలో, ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా అడవులలో విప్లవోద్యమ విస్తృతినీ, వైవిధ్యాన్ని 'వసంతగీతం' ఉత్తేజకరంగా చిత్రించింది.

గెరిల్లాదళం రెగ్యులర్ సైనిక యూనిట్ కాదు. గెరిల్లా దళానికి సహజంగానే సైనిక కర్తవ్యాలతోపాటు సాంస్కృతిక, ప్రచార, నిర్మాణ, వైద్య, ఆరోగ్య, రంగాలలోని కర్తవ్యాలు కూడ ఉంటాయి. అందువల్ల 'వసంతగీతం' కూడ ఈ అన్నిరంగాల విప్లవ కృషిని చిత్రించింది.

1985 ఎండాకాలంతో ఈ నవల ప్రారంభమవుతుంది. సరిగ్గా అది ఉత్తర

తెలంగాణ అంతటా తీవ్రమైన నిర్బంధం మొదలయిన కాలం. ఆ వేసవిలో 15 మంది కార్యకర్తలు, సానుభూతిపరులు బలయిపోయారు. ఉత్తర తెలంగాణలో బహిరంగ ప్రజా ఉద్యమం అజ్ఞాతమైపోవలసి వచ్చింది. "ఎండాకాలం శత్రువు చుట్టుముట్టి ఏరివేయాలనే ప్రయత్నంలో ఉన్నాడు. మైదాన ప్రాంతంలో తీవ్ర నిర్బంధం కొనసాగిస్తున్నాడు—" అని జిల్లా కమిటీ సభ్యుడు నవల ప్రారంభం లోనే దళానికి రాసిన ఉత్తరం ఈ పరిస్థితినే సూచిస్తుంది. ఈ "నిర్బంధం రీత్యా—దళాలు అన్ని విషయాల్లో వాటికవే స్వయంపోషకంగా ఎదగాలి" అని కూడ నిర్ణయమైంది. అందువల్ల ఉద్యమానికి రెండు మూడు స్థాయిలలో మేలు జరిగింది. దళాలు స్వయంపోషకమయ్యాయి. దళాల చొరవ పెరిగింది. నిర్మాణాన్ని ప్రజా స్వామికీకరించే క్రమం కింది నుంచి మౌలికంగా మొదలయింది. ఈ క్రమం కేవలం దళాలలోనే గాక ఉద్యమమంతటా ఏదో ఒక స్థాయిలో అమలయినందువల్లనే నిర్బంధం మధ్య నుంచి పురోగమనం సాధ్యమయింది.

ఇక దళాలు ఆ ఎండాకాలంలోనే నిలదొక్కుకుంటూ, పట్టుదలగా ఆకుల పోరాటాన్ని కొనసాగించాయి. వర్షాకాలం మొదలయ్యేనాటికి భూములు దున్నుకునే కార్యక్రమానికి జనాన్ని సిద్ధం చేశాయి. గిరిజనులను దళాల్లోకి సమీకరించే పనిని తీవ్రతరం చేశాయి. ఇందుకోసం దళాలే గోండు గూడాల్లో సభలు నిర్వహించాయి. దళాలే ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాయి. గిరిజనులకు భూమిమీది మమకారాన్ని గుర్తుచేశాయి. ప్రభుత్వ అటవీ విధానపు మోసాన్ని బయటపెట్టాయి. సారా కాంట్రాక్టర్ల, తునికాకు కాంట్రాక్టర్ల దోపిడీని బైటపెట్టాయి. ప్రభుత్వ నిర్బంధ కాండను వివరించి, ప్రతిఘటించే చైతన్యాన్ని అందించాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ కాలంలో దళాల జీవితమంతా "పోరాటమే జీవన విధానం" అన్నట్టు సాగింది. "ఒక వారం రోజులు మనం అప్రమత్తంగా ఉండాలి. ఈ వారంలో శత్రువు కదలికల స్వభావం, శత్రువు బలం, దాడిచేసే పద్ధతి అర్థమవుతాయి. మనకు ఈ కొత్త స్థితిలో ఎట్లా మెదులుకోవాలో తెలుస్తుంది" అనే జాగరూకతతో దళాలు తిరిగాయి.

అడవిలో ఎండాకాలానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. అన్ని దేశాలలోనూ అడవులలో రక్షణ తీసుకున్న గెరిల్లా దళాల అనుభవాలలో ఎండాకాలం కఠినమైన పాఠాలనే నేర్పింది. "ఎండాకాలం గెరిల్లాలకు శత్రువు. శత్రువుకు, వాళ్ళ కదలిక

లకు అనుకూలమయ్యింది. అయితే ఈ అడవి ప్రాంతంలోని గిరిజనులకు ఈ ఎండ కాలం కొంత డబ్బు సంపాదించే సీజన్. అంతేగాక వర్షాకాలానికి, భూములు దున్నడానికి సహాయత్తమయ్యే సీజన్. కనుక ఈ కాలం మనకు ఆత్మరక్షణతో పాటు మన కార్యక్రమాన్ని విస్తృతపరిచే సమయం —" అని ఉత్తర తెలంగాణ అడవిలో ఎండాకాలంలోనే ఎట్లా ఆత్మరక్షణ, విస్తరణ కలగలిసి ఉంటాయో సందయ్య వివరించాడు. గెరిల్లా ఎత్తుగడల ప్రకారం ఎట్లా ఆత్మరక్షణ చేసుకోవాలో ఎట్లా విరుచుకుపడాలో సూచించాడు.

అ ఎండా కాలంలోనే 1985 మే 13న పులి మధునయ్యను, అంకోలి రమేశ్‌ను పోలీసులు కాల్చేశారు. 'వసంతగీతం' దళ కమాండర్ లచ్చన్న మధునయ్య ప్రతిరూపమే. ఆయన "పిట్టపిల్లంత మనిషి. పిడికెడు మనిషి. ఆ చుట్టుపక్కల యాభై గ్రామాలలో మనుషులకు బతకడం నేర్పిన మనిషి. ప్రియాతి ప్రియమైన గెరిల్లాల నాయకుడు". "దాదాపు అయిదు సంవత్సరాల నుండి ప్రభుత్వాన్ని, అనేకమంది పోలీసులను, అధికార్లను గడగడ లాడించిన"వాడు.

లచ్చన్నను కోల్పోవడం దళానికి పెద్దదెబ్బ. ఈ దెబ్బకు దెబ్బతీయాలనే అభిప్రాయమూ వచ్చింది. "యుద్ధంలో మనం ఈనాడు దెబ్బ కాచుకుంటూ మన కార్యక్రమం మీద పట్టు సడలకుండా పోరాడుతున్నాం. మనకు మన కార్యక్రమమే ప్రధానమైంది. కాని శత్రువు రెండు రకాలుగా తాడోపేడో తేల్చాలని చూస్తున్నాడు. గ్రామాలకు గ్రామాలే కిందామీద చేస్తున్నాడు. కనిపిస్తే కాల్చివేస్తున్నాడు" అనే జవాబూ వచ్చింది. "ఏదో ఒకటి చెయ్యకపోతే వాళ్ళు రెచ్చిపోతారు" అంటే "ఏదో ఒకటి చెయ్యడం కాదు, ఒక క్రమ పద్ధతిలో చేద్దాం" అనే స్పష్టతా వచ్చింది.

ఈ స్పష్టమైన చైతన్యం వల్లనే, ప్రజలు సిద్ధపడకపోవడంతో, దళం ఒక పెత్తందారును శిక్షించకుండా కూడ వదిలేసింది. "నీ పనైపోయింది. నువ్వు వెళ్ళు. చూడు. నువ్వు పోలీసుల దెప్పుకున్నావని తెలిసిన మరుక్షణాన నీ పనైపోతుంది. వాళ్ళు నిన్ను కాపాడలేరు. మంచి మాటకు భూములు ఎవరివి వాళ్ళకు విడిచిపెట్టకపోతే నువ్వు భూమ్మీద బతకడం కల్ల" అని హెచ్చరించి మాత్రం వదిలింది. అది కూడ "తన్నగలరో, తుపాకినేసి చంపగలరో, మొత్తానికి ఈసారి తనను విడిచిపెట్టరనే నిర్ణయానికి భిక్యా వస్తుండగా"!

ఈ చైతన్యాన్ని, ఈ స్పష్టతను ప్రజలకు కూడ అందించవలసి ఉన్నది. ఈ పోరాటం నిజానికి వాళ్ళదేనని ప్రజలకు అర్థం చేయించవలసి ఉన్నది. అందుకే.... సంఘం ఒక్క గోండోల్లదే కాదు. ఎవరైతే నాగలి పట్టి భూమి దున్నుతరో, ఎవరైతే కొడవలి పట్టి పొదలు నరుకుతరో వాళ్ళందరిది. గరీబోల్లందరిది. ఉన్నోడు ఏ కులపోడన్నా కాని మన భూములు గుంజుకున్నవాడే. రెక్కలనమ్ముకొని పొట్ట చేత బట్టుకొని ఇక్కడికొచ్చిన లంబాడా, మరాఠా పేదోల్లంత మనవాళ్ళే. మన వాళ్ళే కనుక మనతో ఉండనిచ్చినం. భిక్యా లాంటి వాడు- గోండు, మరాఠాల మీదనే కాదు, లంబాడాల మీద కూడ జులుం చేస్తున్నాడు. ఆ జులుంను అందరు ఒక్కటై ఎదిరించాలె. వర్షాలు పడగానే భూములు దున్నుకోవాలె" అన్నాడు రామన్న.

ఇట్లా దళం ప్రజల చొరవను, క్రియాశీలాన్ని, భాగస్వామ్యాన్ని ఇతోధికంగా పెంచడానికి ప్రయత్నించినందువల్లనే ఆ ఎండ కాలం గడిచి వర్షాకాలం వచ్చేనాటికి విజయవంతంగా భూమి పోరాటాలు నిర్వహించగలిగారు. లచ్చన్న లాంటి కామ్రేడ్‌ను పోగొట్టుకున్నప్పటికీ, ఆ కన్నీళ్ళ నుంచి పాఠాలు గ్రహించారు. దెబ్బకాచుకున్నారు. తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు గ్రెనేడ్లలాంటివి అడవిలోనే తయారు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గిరిజనుల నుంచి ప్రజా మిలీషియాను అభివృద్ధి చేయాలని, పోరాటాలను విస్తృతపరచాలని నిర్ణయించారు.

వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పోలీసు బలగాలు అడవిలోకి వెళ్ళడం చాల కష్టం. అప్పటికే ఉత్తర తెలంగాణ మైదాన ప్రాంతాలలోను, అడవి కొసల గ్రామాలలోను పెద్దఎత్తున రాక్షస నిర్బంధం అమలయింది. డాక్టర్ రామనాథం గారిని చంపేశారు. ఏజెన్సీలో ఒక దళంలోని ఐదుగురు కామ్రేడ్స్‌ను కాల్చేశారు. ఇంద్రవెల్లి స్థూపాన్ని కూల్చేశారు. కార్యకర్తలను మాత్రమే గాక ఉద్యమ సానుభూతిపరులను కూడ చంపడం ప్రారంభించారు. ఊళ్ళను సత్యనాశనం చేశారు. ఎవరు దొరికితే వాళ్ళను పట్టుకుపోయి కేసులు పెట్టడం మామూలయిపోయింది. దిగజారుడు, లంచాలు ప్రారంభమైనాయి. పోలీసు పెట్రోలింగు పెరిగిపోయింది.

ఇటువంటి పరిస్థితులలోనే దళం కేవలం సైనిక ఆచరణను మాత్రమే కాక ప్రచారం నిర్వహించింది, ప్రజా సంఘాలను నిర్మించింది. గిరిజన గూడాలలో వైద్య కార్యకర్తగా పనిని చేసింది. సాంస్కృతిక కార్యకర్తగా పని చేసింది. సంఘ

సంస్కర్తగా పని చేసింది. గిరిజనులకు మిత్రుడుగా, బంధువుగా పని చేసింది. గిరిజన జీవితాలతో ఇంత సన్నిహిత సంబంధంవల్లనే, విస్తృతమైన జీవితానుభవం వల్లనే దళం పురోగమించగలిగింది.

భయంకరమైన నిర్బంధం మధ్య పురోగమించిన ఈ విప్లవ కృషి వల్లనే "నిర్బంధం మనం కోరి తెచ్చుకున్నది కాదు. నిర్బంధం లేకుండా మన పోరాటం ఉండదు, ఉండబోదు. కాని ఆయా సందర్భాల్లో దొరికిన అవకాశాలను మనం వాడుకోవడంలో ఫేలైనమా లేదా చూడాలని మన ప్రజాసంఘాలలోని కామ్రేడ్స్‌కు మనం అర్థం చేయిస్తున్నాం. నిర్బంధం పెరగడానికి గాని, తగ్గడానికి గాని కారణాన్ని ఏదో ఒక ఘటనలో వెతకవద్దు. ఈ మొత్తం పరిస్థితి వెనుక మనకు ఒక పద్ధతి, క్రమం, లక్ష్యం ఉన్నట్టుగానే శత్రువుకూ ఉన్నాయి. మనం మన దీర్ఘకాలిక యుద్ధానికి దొరికిన ప్రతి అవకాశాన్ని వాడుకుంటాం. శత్రువు దానికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ అణచడానికి పూనుకుంటాడు" అనే సంయమనదృష్టి, విప్లవ భవిష్యత్తు పట్ల సమగ్ర దృక్పథం అలవడ్డాయి.

ఉద్యమం తన అభివృద్ధి క్రమంలో సాధించిన ఈ విజయాల్ని ఒక డాక్యుమెంటులాగనో, వ్యాసంలాగనో కాక హృద్యమైన, ఉద్వేగ భరితమైన ఘట్టాలుగా, మానవ సంబంధాల ప్రతిఫలనాలుగా మలచడంలో రచయిత నైపుణ్యం బైటపడుతుంది. అందుకు అవసరమైనంత కాల్పనికతను, ఉద్వేగాలను, విలువలను, పాత్రల ఎదుగుదలను వాడుకోవడంలో రచయిత నేర్పు ప్రదర్శించారు. శిల్పపరంగా 'విప్లవ నవల'కు ఒరవడి కాదగిన ప్రయోగాలు చేశారు.

ఈ నవలలో చాలమంది మామూలు మనుషులున్నారు. మయకోవస్కీ చెప్పిన లాంటి "అట్టడుగు అగాధాల కష్టజీవులు" వాళ్ళు.

"ఏది ఏమైనా ఈ ఎండాకాలం ఆకలి బాధ ఉండదు. ఏదన్న పని చూసుకొమ్మని అన్న తిట్టే తిట్లుండవు. తను కోపంతో అందరి మీదికి ఉరికి అందరిచేత తిట్లు తినడం ఉండదు. తను పని చూసుకున్నాడు. ఒకని మేకలు కాస్తూనో, పాలేరుండో తను బతకదలచుకోలేదు" అనుకున్న లింగయ్య ఉన్నాడు. "నిరుపేద కుటుంబం నుంచి వచ్చినవాడు పోరాడాలని దృఢ సంకల్పం కలిగినవాడు" అని జిల్లా కమిటీ సభ్యుడు అంచనా వేసిన లింగయ్య ఉన్నాడు. తల్లి పడినను తిడితే, తల్లి మీద

ఆగ్రహించిన లింగయ్య ఉన్నాడు. వదిన కాపురానికొచ్చాక, అన్నా వదినల కోసం గుడిసె బయట ఎక్కడెక్కడో పడుకునేవాడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న వాని లాగ తిరిగేవాడు. ఎవరు ఏ మాటన్నా పడేవాడు కాదు. అటువంటి లింగయ్య గెరిల్లా గట్టయ్యగా మారాడు. మొట్టమొదటిసారి ట్రిగ్గర్ మీద వేలుంచితే తల్లి, అన్న, వదిన తళుక్కున కళ్ళ ముందు మెరిశారు. క్రమక్రమంగా గట్టయ్య మంచి గురికా డయ్యాడు. కొండలు, అడవిదారులు అవలీలగా నడవగలిగాడు. ప్రజల సుఖదుఃఖాలు అర్థం చేసుకోగలిగాడు.

కాని హఠాత్తుగా ఒక విఘాతం కలిగింది. తల్లి దిక్కులేని పక్షి అయిపో యింది. కుటుంబం నుంచి, రక్తబంధాల నుంచి విముక్తుడయిన లింగయ్య, సాయుధు డైన గట్టయ్య, తన భవిష్యత్తును విప్లవ భవిష్యత్తుతో ముడివేసుకున్న గట్టయ్య ఈ విఘాతాన్ని ఎట్లా ఎదుర్కొంటాడు? గట్టయ్య మళ్ళీ లింగయ్యగా మారిపోదలచు కుంటాడు. కాని విముక్తుడయిన మనిషి బంధనాలలోకి పోవడం, చైతన్యవంతు డయిన మనిషి చైతన్యరహితమైన బతుకు గడపడం సాధ్యమేనా? రామన్న గట్టయ్యను ఈ ప్రశ్నలన్నీ అడుగుతాడు. కాని, దళంలో ఉండిపొమ్మని బలవంతం చెయ్యడు. గొప్ప సంయమనంతో మంచి చెడులన్నీ చర్చిస్తాడు. చిట్టచివరికి "విప్లవం అడవిలో మాత్రమే లేదు. మనం జీవించే జీవన విధానంలో ఉన్నది. నీ చేతనైన సహాయం చేయి. విప్లవం ఎవరికోసం ఆగిపోయేది కాదు. నువ్వెప్పుడు నిండు మనసుతో పిలిచినా పలుకుతుంది" అని వీడ్కోలు చెపుతాడు.

తిరిగి వెనక్కి వెళితే లింగయ్యను అందరూ 'ఏమున్నదని వచ్చినవ్' అని ప్రశ్నించేవాళ్ళే. పైగా ఊళ్ళు కదలబారుతున్నట్టు, ఆ కదలిక పైకి తెలియకుండా లోలోపల సాగుతున్నట్టు కూడ లింగయ్యకు తెలిసిపోతుంది. వెనకడుగు వేసిన లింగయ్యకు, ఆ వెనకడుగు కూడ పాఠం నేర్పింది. ఆయన కమ్యూనిస్టు కావడా నికి నేర్చుకోవలసి ఉన్న ముఖ్యమైన సంగతి ఒకటి వెనక్కి వచ్చిన తర్వాతనే అర్థ మయింది. "తను ఏ కారణం చూపి దళంలో నుంచి బయటకు వచ్చాడో అది ఉత్తమాటని తేలిపోయింది. బాగుపడచుకోవడానికి గాని, చెడగొట్టుకోవడానికి గాని ఎవని బతుకు వాని చేతిలో లేదు. అందరి బతుకుల తాళ్ళు ఎవల చేతుల్లోనో ఉన్నాయి. ఆ తాళ్ళకందకుండా పోతే తప్ప అంతకంతకు బిగుసుకోవడం తప్పదు."

నిజానికి కమ్యూనిస్టుగా మారదలచిన వ్యక్తి పొందవలసిన అవగాహన అదే.

కొనసాగుతున్న ప్రమాణాలు, కొనసాగుతున్న ప్రాతిపదికలు, కొనసాగుతున్న వ్యవస్థ - అన్నిటినీ ప్రశ్నించగలగాలి. అన్నిటినీ ధిక్కరించగలగాలి. కొత్త ప్రమాణాల గురించి, కొత్త ప్రాతిపదికల గురించి, కొత్త వ్యవస్థ గురించి కలగనాలి. ఆ కల నిజం చేసే ఆచరణ ప్రారంభించాలి. ఈ అవగాహనతోనే లింగయ్య మళ్ళీ గెరిల్లాగా మారగలిగాడు.

ఈ అవగాహనలో తరతమ భేదాలుండవచ్చు. ఈ అవగాహనను సైద్ధాంతికంగా విశ్లేషించలేకపోవచ్చు కేవలం తమ జీవితగాథ చెప్పుకుంటున్నట్టుగానో, నాభిలోంచి పెకలివస్తున్న దుఃఖానికి మాటలు తొడుగుతున్నట్టుగానో, ఉద్వేగభరితమైన హృదయాన్ని విప్పుతున్నట్టుగానో అనిపించవచ్చు. కాని, వసంతగీతంలోని పాత్రలన్నీ ఈ కమ్యూనిస్టు పరిణామక్రమంలో ఎన్నెన్నో మెట్లు ఎక్కి వచ్చినవే. మరెన్నో మెట్లు ఎక్కగలమని హామీ ఇచ్చేవే.

జగిత్యాల జైత్రయాత్ర నుంచి క్రమక్రమంగా ఎదిగి వచ్చిన భీమన్న, నాలుగేళ్ళ కింద జంగలాతు వాళ్ళను, షావుకార్లను, తెల్లబట్టల వాళ్ళను చూస్తే గజగజ వణికిపోయి, జీవితంలో ఎన్నెన్నో మలుపులు తిరిగి గెరిల్లాగా మారిన బొజ్జు, బొగ్గు గనుల గర్భాల నుంచి అరణ్య గర్భంలోకి వచ్చిన రామన్న, పెంపుడు కొడుకుగా కూడ కష్టాలుపడి, "నేను మల్ల గిపారిటిల కచ్చినంకనే కడుపు నింద తిన్న. నాకైతే ఈ దళమే అయ్య-అవ్వన్నే అవ్వ" అనే గోపాల్, "నా బతుకులో స్వంత సుతం లేదన్న. మా అవ్వ నాయనను సూసే దిక్కులేదు. నాది దిక్కుమల్లె బతుకై పోయింది...." అనుకునే దశ నుంచి గిరిజన స్త్రీలను ఉత్తేజపరచ గల నాయకురాలిలా మారిన రాధక్క - వీళ్ళలో ఏ ఒక్కరి జీవితాన్ని నిశితంగా పరిశీలించినా, కష్టజీవులు తగిన ప్రేరణలందితే ఎంత సహజంగా, ఎంత తార్కికంగా, ఎంత చిత్తశుద్ధితో కమ్యూనిస్టులు కాగలరో అర్థమవుతుంది.

నవలలో ఎదురైన గోండుల జీవితాలయినా, రాయమల్లు జీవితమయినా, బాదు జీవితమయినా, గంగమ్మ జీవితమయినా కూడ మనుషులు దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడడాన్ని ఎంత సహజంగా అంగీకరిస్తారో చూపుతాయి.

ఈ పాత్రల పరిణామాలను, అభివృద్ధిని రచయిత ఏవో యాంత్రికంగా, యాదృచ్ఛికంగా జరిగినవిగా చిత్రించలేదు. సాహిత్యంలో చాల పాత్రలు మార్పు చెందే మాట నిజమే గాని ఆ మార్పులు చాల నాటకీయంగా, ఆకాశంలోంచి ఊడి

పడ్డట్టుగా చిత్రించడం జరుగుతుంది. జీవితంలో హఠాత్తుగా కనబడే గుణాత్మక మార్పులను నాటకీయంగా కాకుండా సహజంగా, ఒక తార్కిక అభివృద్ధిగా చిత్రించడానికి చాల నేర్పు, జీవిత పరిశీలన ఉండాలి. జీవితం ఉద్విగ్నమైనదనీ, ఆ ఉద్విగ్నత సహజాతం కాదనీ, జీవన పరిణామ క్రమంలోనే ఏర్పడుతుందనీ గుర్తిస్తే, జీవితంలో ఉద్వేగాల పాత్ర గురించీ, సమాజం పాత్ర గురించీ, స్పష్టమైన అవగాహన కలుగుతుంది.

'వసంతగీతం' నవలలో పాత్రల అభివృద్ధికి పైన చెప్పిన రెండు కోణాలనూ రచయిత చిత్రించారు. ఆయా పాత్రల ఉద్వేగాలనూ విలువలనూ అక్షరీకరించడానికి ఎంత ప్రయత్నించారో, ఆయా ఉద్వేగాలు ఏ సామాజిక నేపథ్యంలో రూపొందాయో చూపడానికి, రాజ్యం ప్రవేశం వాళ్ళ జీవితాలను ఎట్లా అతలాకుతలం చేసిందో చూపడానికి అంత ప్రయత్నించారు.

నక్సలైట్లు హింసావాదులయిపోతున్నారని మిత్రులనబడేవాళ్ళు కూడ అంటున్న, అనుకుంటున్న స్థితిలో ఒక దళంలోని సభ్యుల ఉద్వేగాలు ఎంత ఆర్ద్రంగా, ఎంత మానవీయంగా ఉన్నాయో ఈ నవల స్పష్టం చేస్తుంది. ఒక రోజు రేడియోలో ఒక ఎన్‌కౌంటర్ వార్త వచ్చింది. చనిపోయిన వాళ్ళెవరో తెలియదు. పత్రికలు అందే అవకాశం లేదు. వార్తలు తెలిసిన మనుషులు కలిసే అవకాశం లేదు. అటువంటి చోట ఒక కామ్రేడ్ ఉద్వేగాలు ఎట్లా ఉంటాయి? ఆ వీరుల మరణాల పట్ల దుఃఖం కలిగే మాట నిజమే. దుఃఖం కన్న బలంగా ఆ అమరవీరులెవరో తెలుసుకోవాలని, వాళ్ళు తనలో పోరాటస్ఫూర్తి కలిగించిన వాళ్ళో, తన సహచరులో కావచ్చునేమో అనీ అనిపిస్తుంది. సహచరుల మరణం పట్ల మాత్రమే కాదు, తోటివాళ్ళ దుఃఖం పట్ల గిరిజనుల, అనారోగ్యం పట్ల, గిరిజనుల చైతన్యంలో వెనుకబాటుతనం పట్ల, కుటుంబాల నుంచివచ్చే వార్తల పట్ల కూడ వాళ్ళ ఉద్వేగాలు ఇంత ఆర్ద్రంగానే ఉంటాయి.

కమ్యూనిస్టులకు, శత్రువులకు విలువల్లో, ఉద్వేగాల్లో స్పష్టమైన తేడా ఉంటుందా, ఉండదా? కమ్యూనిస్టుల పేరుమీద ఎందరెందరో కమ్యూనిస్టేతరులు చలామణీ అవుతున్న సమయంలో ఈ ప్రశ్నకు చాల ప్రాధాన్యత ఉంది. జీవితంలోని చాల సందర్భాలలో కమ్యూనిస్టుల ప్రతిస్పందనను, కమ్యూనిస్టేతరుల ప్రతి

స్పందనను పోల్చి చూపి రచయిత కమ్యూనిస్టు విలువలకు, కమ్యూనిస్టేతర విలువ లకు తేడాను చూపారు.

ఒక గోండు గూడెం మీద పోలీసులు పడితే "గొర్రెమంద మీద తోడేలు దునికినట్లుగా-ఆవుల మందమీద పులి దాడి చేసినట్లుగా-లొల్లి, ఏడుపులు, కొట్టుకోళ్ళు, మొత్తుకోళ్ళు—" గంగమ్మ కడుపు చీల్చుకుపోతుంది. అటువంటి దుర్మార్గాలెన్నో సాగిపోతాయి. దళపోళ్ల స్త్రీలను లేపుకుపోతారని ప్రచారమూ సాగుతుంది.

మరోవైపు దళం గోండుగూడెంలోకి వస్తే, "నా కొడుక్కు జెరం. ఆరం దినాల నుంచి మీ కోసం సూత్తన్న" అని పిలుపు వస్తుంది. ఒకరి కాలిపుండుకు ఆయింటుమెంటు రాస్తారు. కట్టుకడతారు. మరోచోట గాయానికి అయొడిన్ వేస్తారు. "వీళ్ళ వ్యవసాయం లేక ఉత్పత్తి విధానం మొరటుగా వెనుకబడి ఉన్నట్లుగానే చైతన్యం వెనుకబడి ఉంటది— మనం వీళ్ళను వెనుకబడిన స్థితిలో ఉంచిన దోపిడీ ప్రభుత్వంతో పోరాడుతున్నట్లుగానే, వెనుకబడిన చైతన్యంతో తలపడాలి. అంటే మాటలు కాదు" అని ఒక సుదీర్ఘ శ్రమానికి నాంది పలుకుతారు.

ఒకవైపు శత్రువు బలప్రయోగంతో, దౌర్జన్యంతో, తుపాకితో, హింసతో రాజ్యం చేస్తున్నప్పుడు, కమ్యూనిస్టులు "మనం పరిస్థితిని అర్థం చేయించడానికి సర్వ విధాలా ప్రయత్నం చేస్తాము. బతుకు ఎదురుంగ కనిపించే కోణమే కాక దాని వెనుకగల అన్ని కోణాలను తెలియజేస్తాము. కాని మన అభిప్రాయాలను రుద్దలేం గదా! కొన్ని సందర్భాలలో, కొందరి విషయంలో తాకొస్తెగాని తెలియదు. ఒక్కొక్క విషయంలో అనుభవంలోకి వస్తే తప్ప మారలేరు. ఓపిగ్గా ప్రయత్నం చేయడమే" అంటారు.

ఈ తేడా ఎందుకంటే ఇక్కడ తలపడుతున్న రెండు వర్గాలలో ఒక వర్గం ఈ లోకంలో దుఃఖానికి మూలకారణం. మరో వర్గం "గుండె దిటవు చేసుకోవాలె. మనం గీలోకంలనుంచి ఏడుపును ఎల్లగొట్టేందుకు ఇగో బందూకు పట్టినం" అం టుంది. ఒక వర్గం తన గురించి లోకానికి తెలిసిపోయిందనీ, ఇక తాను గద్దె దిగక తప్పదనీ తెలుసుకుని చివరిప్రయత్నంగా హింసను ప్రయోగిస్తోంది. మరో వర్గం తన గురించి తాను తెలుసుకుని, తన భవిష్యత్తును తాను నిర్ణయించుకునేందుకు ఆయుధం పట్టింది.

ఈ తేడా పాఠకుల అవగాహనలోకి రావడం మాత్రమేగాక లింగయ్యకు కూడ అవగాహనలోకి వస్తుంది: "అధికార్ల మధ్య ఉండే గొడవలు, ఒకరి మీద ఒకరికి పడకపోవడం- అధికార్లంతా ఎంత పనికిమాలినవాళ్ళో అర్థమౌతూనే ఉన్నది. లింగయ్యకు దళం జ్ఞాపకం వచ్చింది. దళం- దళ సభ్యుల మధ్య అప్యాయతలు, ప్రేమ గుర్తుకొచ్చాయి".

ఈ అవగాహన, సామాజిక ధర్మంలో రెండు ప్రత్యర్థివర్గాల వైఖరులలో తేడా వల్ల అవగాహన కలిగితే మనిషి నూతన మానవుడవుతాడు. ఆ నూతన మానవుడు అనామకుడు కావచ్చు, నిరక్షరాస్యుడు కావచ్చు. కాని ఆ నూతన మానవునిలో రగిలే ఆకాంక్షలను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదు: "మోహన్ రెడ్డి హఠాత్తుగా లేచి గట్టయ్య మీద పడ్డాడు. ఆ నిబ్బరం చూస్తే అతనికి మంట. ఇంత క్లిష్ట పరిస్థితిలో ఒక అనామకుడు- చదువు లేనివాడు ఎట్లా నిబ్బరంగా ఉంటున్నాడు. తనకు అధికారం ఉంది. తుపాకులున్నాయి. అయినా తను—తను— ఈ లోకంలో ఎవరూ నిబ్బరంగా ఉండరాదు. మోహన్ రెడ్డి గట్టయ్యను కసితీరా కొడుతున్నాడు. గుద్దుతున్నాడు".

అయితే ఈ తేడా కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టేతరులకు మధ్య మాత్రమే కాదు, ప్రజలకు, ప్రజాశత్రువులకు మధ్య సహజంగానే ఉంటుంది. ఈ సహజమైన తేడా మీద ఎంతో దుమ్ము కప్పుకుపోయింది. తమ రక్షణలో ఉన్న ఖైదీని అధికారులు అన్యాయంగా కాల్చేయబోతున్నారని తెలిసినప్పుడు సెంట్రీ మనసు మీదినుంచి ఆ దుమ్ము చెదిరిపోయింది. చివరిసారిగా ఏమన్నా తినాలనిపిస్తున్నదా అని గట్టయ్యను అడగాలనిపించింది. "నీ చెయ్యి ఇట్లా ఇయ్యి బిడ్డా! ఎంత లేత చెయ్యిరా నాయిన్నా! ఎన్ని పంటలు దీసిన చెయ్యిరా బాబు! నన్ను మన్నించరా నా తండ్రీ- నేను బతికున్నంతకాలం నీ లేత ముఖం నాకు గుర్తుంటుంది బిడ్డా! నన్ను మన్నించరా!—" అంటూ సాల్యూటు చేస్తాడు.

ప్రజలకు, కమ్యూనిస్టులకు ఈ ఉద్వేగాలు ఎక్కడినుంచి వస్తాయి? వాళ్ళ విలువలను నిర్ణయించేదేమిటి? సామూహిక జీవనం, ప్రజాస్వామికత, తోటి ప్రజల పట్ల అపారమైన ప్రేమ, భవిష్యత్తు పట్ల ప్రగాఢ విశ్వాసం వంటి లక్షణాలే కమ్యూనిస్టులకు ఈ విలువలను ఇస్తాయి. అయితే నిర్మాణపరమైన నిర్దిష్టతల వల్ల కమ్యూనిస్టుల విలువలు 'నిర్దాక్షిణ్యమైనవ'ని, 'హృదయం లేనివ'ని అనిపిస్తాయి. 'నీకు

రవ్వంత నెనరు లేదు' అని రాధక్క అంటే గుండెలు బండబారిపోతే సాయుధులమై ఉండేవాళ్ళమే కాదంటాడు. "ఈ అడవిలో కలిసిన మనం ఎవరం మిగులుతామో తెలియదు. కాని మన ఆశయాలు మోయడానికి మానవులు మిగులుతారు. మనం శోధించిన, నడిచిన ఈ అడవిదారులు రేపటి విముక్తికి దారులవుతాయి. ఎవరు మిగిలినా ఈ ఆత్మీయతను, ఈ స్వచ్ఛమైన ప్రేమను పంచుతారు" అంటాడు.

ఒకవైపు ఆత్మీయత గురించి, స్వచ్ఛమైన ప్రేమ గురించి కలలుగనే కమ్యూనిస్టులు ఉంటే, మరోవైపు మనుషులను విడదీయదలచిన రాజ్యం ఉంది. మనుషుల మధ్య ద్వేషం ఉండడమే అవసరమయిన రాజ్యం ఉంది. ఆ రాజ్యహింస నేపథ్యంలో చూడకపోతే కమ్యూనిస్టుల విలువ, విశిష్టత అర్థం కావు. 'వసంతగీతం' నవల అంతటా సాగిన ధార మనుషుల జీవితాల్లో రాజ్యం దురాక్రమణ.

నవల ప్రారంభంలోనే లారీ చెక్ చేయడానికి వచ్చిన పోలీసులతో రాజ్యం ప్రవేశిస్తుంది. పాలకవర్గ ప్రయోజనాలు, పాలకపార్టీ ప్రయోజనాలు, కంట్రాక్టర్ల ప్రయోజనాలు, భూస్వాముల ప్రయోజనాలు నెరవేర్చడానికి ప్రభుత్వమూ రాజ్యాంగ యంత్రమూ ఎన్నెన్ని దౌర్జన్యాలకు దుర్మార్గాలకుసిద్ధపడతాయో అడుగడుగునా ఎదురవుతుంది. గాలింపు చర్యలు ఎక్కువవుతాయి. గ్రామాలలో తునికాకు కోయక తప్పదని ప్రచారం జరుగుతుంది. నక్సలైట్ల మీద దుష్ప్రచారం సాగుతుంది. కొన్ని గ్రామాల ప్రజలను బలవంతంగా అడవిలోకి తీసుకువెళ్ళి ఆకులు కోయించి సమ్మెను విఫలం చేయాలని చూస్తారు. అడవి అధికారులు, పోలీసు అధికారులు ఒక్కుమ్మడిగా గ్రామాల మీద దాడులు చేస్తారు. ప్రజలను నక్సలైట్లనుంచి విడదీసి, నక్సలైట్లను ఏకాకులను చేయాలని పథకాలు వేస్తారు. "ప్రభుత్వం మీకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నది. మీ కష్టసుఖాలు తెలుసుకుంటున్నది. స్కూళ్ళు కట్టిస్తున్నది. సర్కారు ఇన్ని చేస్తున్నా మీకు పొరకల పార్టీ వాళ్ళను రానిస్తున్నారు. అన్నం పెడుతున్నారు. వాళ్ళు దొంగలు—" అని అధికారులు ఉపన్యాసాలిస్తారు. పోలీసు క్యాంపులు పెంచుతారు. ఇదివరకు పదిమందికి మించని క్యాంపుల్లో, ఇప్పుడు ఇరవై ఐదు మందినీ, అరవై మందినీ ఉంచారు.

అయితే రాజకీయార్థిక సాంఘిక సమస్యలను రాజ్యహింస పరిష్కరించజాలదు.

ఆ సమస్యలలోంచే ఆ సమస్యలకు పరిష్కారాలు అన్వేషించేవాళ్ళు బయల్దేరుతారు. రాజ్యహింస మరికొంత మందిని ఆ అన్వేషకుల శ్రేణులలోకి పంపుతుంది. ఆ అన్వేషణ గట్టయ్య, గంగమ్మ వంటి మామూలు మనుషులను ప్రజాసైనికులుగా మలుస్తుంది. ఈ జీవిత గమనాన్ని యాథాతథంగా, ప్రతిభావంతంగా, ఉత్తేజకరంగా వర్ణించింది 'వసంతగీతం'.

'వసంతగీతం' లో లోపాల గురించి చెప్పకపోతే, ఆ లోపాలకు కారణాలను అర్థం చేసుకోక పోతే విప్లవనవల' భావనను పరిపుష్టం చెయ్యలేం.

నిజానికి 'వసంతగీతం' రూపపరంగా ఇప్పటి వరకు వచ్చిన నవలలన్నిటిలోకి మేలైన నవల. కాని ఎంచుకున్న వస్తువుకు తగిన రూపాన్ని సాధించడంలో ఒకటి రెండు లోపాలు ఇంకా మిగిలిపోయాయి. నవల కథాకాలం 1985 మార్చి/ఏప్రిల్‌లలో మొదలై 1986 నవంబర్ దాకా సాగుతుంది. ఈ కథాకాలం ఏడాదిన్నరే అయినప్పటికీ ఉత్తర తెలంగాణ చరిత్రలో ఈ కాలం చాలా భారంగా, సుదీర్ఘంగా, కష్టభరితంగా గడిచింది. ఆ కాలానికి నిర్బంధంలోనూ, రాజకీయ పరిస్థితిలోనూ, ఉద్యమంలోనూ అనేక కోణాలున్నాయి. అంటే ఈ కథాకాలం స్వల్పమైనదని అనిపించినప్పటికీ వస్తువు దృష్ట్యా ఈ కేన్వాస్ చాలా పెద్దది. ఇంత పెద్ద కేన్వాస్‌లో ఉండవలసినంత సమాజం, ఉండవలసినన్ని పాత్రలు, ఉండవలసినన్ని సంఘటనలు లేకపోవడంతో నవలలో ఇంకా ఏదో ఉండవలసిందనిపిస్తుంది.

అట్లాగే నిర్మాణం గురించి వివరించడం, ప్రేరణనందించడం, కొత్త పాఠకులకు విప్లవ రాజకీయాల పట్ల సానుభూతి కలిగించడం, జీవితాన్ని చిత్రించడం అనే నాలుగు లక్ష్యాలలో ఏ సన్నివేశంలో దేనికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలనే విషయంలో కూడ రచయిత పునరాలోచించి ఉండవలసింది. ఎందుకంటే ఈ నాలుగు లక్ష్యాలు నాలుగు రకాల పాఠకులను ఉద్దేశిస్తాయి. ఏ ఒక్కరకపు పాఠకులనైనా అసంతృప్తి పరచకుండా అన్ని లక్ష్యాలనూ సాధించడం అంత కష్టమైన పనేమీకాదు.

పాత్ర చిత్రణలో పోలీసు అధికారుల ప్రవర్తనకు మానసిక కారణాలను వివరించే ప్రయత్నం కొంత జరిగింది. ఆయా అధికారులు విపరీత ప్రవర్తనకు ఏదో ఒక స్థాయిలో వారి మనఃస్థితి కారణం అవుతుందేమో గాని, అది చిత్రించవలసినంత

ముఖ్యమైనదేమీ కాదు. ఎటువంటి మనఃస్థితి గలవాళ్ళయినా పోలీసు అధికారులయి క్రూరంగా ఉండడం అందరికీ తెలిసిన సంగతే. పోలీసు వ్యవస్థను ప్రధానమైన రాజ్యాంగ సాధనంగా చేసుకుని, దానికి అపరిమిత అధికారాలను కట్ట బెట్టిన తర్వాత కలిగిన ఫలితమిది. దానికి ఆయా అధికారుల మంచి చెడులు, ఇంటాబైటా అసంతృప్తులతో ప్రమేయం తక్కువ.

ఈ నవలకు డి. అక్కారావు రాసిన ముందుమాటలో చాల వివాదాస్పదమైన విషయాలూ, తప్పుడు అభిప్రాయాలూ ఉన్నాయి. వాటిని వివరించడానికి ఇది సమయం కాదుగాని, చారిత్రక నవల గురించి జార్జి లూకాచ్ వంటి విమర్శకులూ, రారా, వరవరరావు వంటి విమర్శకులూ చాల నిశితమైన వ్యాఖ్యానాలు ప్రకటించి ఉన్న తర్వాత అక్కారావు ఇచ్చిన వివరణలు విచిత్రంగా ఉన్నాయి. ఆయన నిర్వచనం ప్రకారం మాలపల్లి, అనుభవం, ప్రజల మనిషి, చిల్లర దేవుళ్ళు, రాజు-మహిషి చారిత్రక నవలలు. కాని వీటిలో ప్రజల మనిషి మినహా మరేదీ చారిత్రక నవల కాదు. ఈ మాట అనడం ఆ నవలల విశిష్టతను తగ్గించడానికి కాదు. తెలుగు సాహిత్య విమర్శా సాంప్రదాయంలో ఏర్పడి ఉన్న ఒక భావనను అంత సులభంగా, ఒక అలవోక వ్యాఖ్యతో మార్చలేమని చెప్పడానికి మాత్రమే.

ఈ లోపాలు 'వసంతగీతం' విశిష్టతకు అటంకం కావు. 'వసంతగీతం' నిజంగా అపూర్వమైన నవల. ఆ అపూర్వత్వం ఉద్యమంలో ఉన్నది, ఉద్యమం ప్రదర్శించిన సంయమనంలో ఉన్నది. ఉద్యమాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్న ప్రజల్లో ఉన్నది.

× × ×

వసంతగీతం - నవల - పులి ఆనందమోహన్, గోదావరి ప్రచురణలు, విజయావాడ. 300 + x పేజీలు, 1/8 డెమ్మీ, ఇరవై రూపాయలు, ప్రతులకు : కె. సులోచన, 36-9-29, గిరిపురం, విజయవాడ.

సమీక్ష :

నేలతల్లి విముక్తి కోసం

ఆర్

తెలుగు సాహిత్య విమర్శకులలో కథనూ నవలనూ గురించి తరుచుగా రెండు రకాల అభిప్రాయాలు ప్రకటిస్తుంటారు. తెలుగులో కవిత్వం మాత్రం వ్యాపారానికి లొంగకుండా తన ప్రయోజనాన్ని నెరవేరుస్తుండగా, నవల, కథ పూర్తిగా అప మార్గం పట్టిపోయాయన్నది అందులో ఒక రకం అభిప్రాయం. విప్లవ రచయితలు వచన కవితనూ, పాటనూ అభివృద్ధిపరచినంతగా కథనూ నవలనూ అభివృద్ధి పరచ లేదన్నది రెండో అభిప్రాయం.

మొదటి అభిప్రాయానికి రావలసిన సందేహాలేవీ రానేలేదు. కథ, నవల వ్యాపార సూత్రాలకు లొంగిపోయినప్పుడు, కవిత్వం లొంగకుండా ఎలా వుండి పోయిందీ? అన్న ప్రశ్నకూడా వాళ్ళకు వచ్చినట్టులేదు. కవిత్వంవల్ల డబ్బు సంపా దించే అవకాశం అట్టే లేకపోవడాన్నే 'వ్యాపారానికి లొంగకపోవడం'గా వాళ్ళు భావిస్తున్నట్టుంది. కథ, నవల ఒకప్పుడు ప్రయోజనకరంగా వుండేవనడానికి వాళ్ళు కిందటి తరం రచయితలను చూపిస్తూ, అవి పూర్తిగా భ్రష్టుపట్టాయనడానికి ఇప్పటి వాళ్ళను పేర్కొంటూ వుంటారు. కిందటి తరంలోనైనా అందరూ ప్రయోజన కరంగా రాశారా? ఇప్పటి తరం వాళ్ళలో కూడా ప్రయోజనకరమైనవి రాసేవాళ్ళు లేరా? అన్న పరిశీలన లేదు. అలాగే, కవిత్వం మొత్తంగా తన ప్రయోజనం నెర వేరుస్తోందా అని కూడా ఆలోచించినట్టు లేదు. మొత్తం మీద యీ అభిప్రాయంలో వ్యక్తమయ్యే ఆక్షేపణ అంతా ఎక్కువగా శిల్ప సంబంధమయిందనిపిస్తుంది. వస్తు ప్రాధాన్యత పెరుగుతూ రావడంపట్ల వాళ్ళకున్న వైముఖ్యం, కిందటి తరం వాళ్ళను మొత్తంగా మెచ్చుకునేట్టూ, ఇప్పటి తరం వాళ్ళనూ పూర్తిగా ఆక్షేపించేట్టూ చేస్తోంది. అందుకే, ఇంకా ఎక్కువగా చెప్పే తీరుకే (శిల్పానికి) ప్రాధాన్యత నిస్తోన్న కవిత్వం వాళ్ళ అభిమాన పాత్రమవుతోంది. విప్లవోద్యమాన్ని బలపరచే సాహిత్యమైతే వాళ్ళ దృష్టిలో చవకబారు ప్రచార సాహిత్యం.

ఇక రెండో అభిప్రాయం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. దీని నిర్దిష్టత

విప్లవ రచయితలను దృష్టిలోకి తీసుకోవడంలో కనిపిస్తున్నా, నిజానికి వస్తు ప్రాధాన్యతను అంగీకరించడంలో వుంది అంతేకాదు, ఇంకో సూచనా వుంది. అది, చెప్పే తీరుకూ, చెప్పే అంశానికీ సంబంధించిన వైరుధ్యాల నుంచీ బయలుదేరి, చెప్పే అంశంతో చెప్పే తీరు సమన్వయించాలన్న దృక్పథంగా వుంది. 'విప్లవ రచయితలు వచన కవితనూ పాటనూ అభివృద్ధి పరచినంతగా, కథనూ నవలనూ అభివృద్ధి పరచలేదనడంలో ఆ అర్థమే వుంది. అయితే, యీ అభిప్రాయంలో కూడా ఒకప్పు డుండినంత న్యాయం ఇప్పుడు వుండదు నవల విషయంలో ('వసంతగీతం' వంటి నవలలు వచ్చినా) విప్లవ రచయితలు అభివృద్ధి సాధించవలసే వుంది అని వొప్పు కున్నా, కథల విషయంలో అలా అనుకోలేరు. విప్లవోద్యమాన్ని బలపరిచే అన్ని కథల్నీ చదవకపోయినా, ఈ 'నేలతల్లి విముక్తి కోసం' అన్న కథా సంకలనం మాత్రమే చదివినా అలా అనుకోవడం సాధ్యం కాదు. అలా అనుకుంటే, అది తాము ఆశించిన ఫలితాలు ఎదురుగా కనిపిస్తున్నా కావాలని కళ్ళు మూసుకోవడమే అవు తుంది.

ఈ సంకలనంలో మొత్తం, 41 కథలున్నాయి. ఇవి 1978–1990 మధ్య కాలంలో వెలువడిన, జీవన పోరాట రూపాలను కథా రూపంలో చిత్రించినవి. 'అరుణతార', 'సృజన', 'రాడికల్ మార్చ్' వంటి పత్రికల్లో ప్రచురితం కావడమేకాక కొన్ని కథలు ఆ యా రచయితల కథా సంపుటాల్లో కూడా వచ్చాయి. అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, వుప్పల నరసింహం, సాహూ, కార్మిక వంటి ప్రసిద్ధులతో పాటు కొత్త వాళ్ళ కథలూ వున్నాయి. కథల్లో అనుభవజ్ఞులూ, కొత్తవాళ్ళూ వున్నట్టుగానే సమగ్రమైన కథగా రూపొందినవనిపించేవీ, కొన్ని లోపాలతో వున్నట్టూ, కొంత కథ కొంత వ్యాసంగా వున్నట్టుగానూ అనిపించేవీ వున్నాయి. అయితే ఈ కథలన్నిటి స్పందనా ఒకటే. అది జనజీవన స్పందన. ఆ లక్షణంలో ఏ కథా దేనికీ తీసిపోదు. ఈ కథలన్నిటి స్పందనా ఒక్కటే అయినట్టూ అన్నిటి నుంచీ వినిపిస్తున్న బలమైన పిలుపూ ఒక్కటే. అది విప్లవాన్ని మనసా వాచా కర్మణా ఆహ్వానించడం. ఆ ఆహ్వానంలో అన్ని కథలూ గొంతు కలపడం.

'వస్తు ప్రాధాన్యతను గుర్తించడం' అంటే, 'సాహిత్యం సామాజిక ప్రయోజనం కలిగించేదిగా వుండా'లనడం కాదు. ఆ మాట ఎప్పుడో పుట్టింది. 'సామాజిక ప్రయోజనం' అనే మాటకు ఒక నిర్దిష్ట రూపంలేదు. అది బూర్జువా రచయితలకూ,

విమర్శకులకూ కూడ ప్రమాదం లేనిది. అందుకే వాళ్ళు ఆ మాటను చిలకపలుకు ల్లాగా అంటున్నారు. 'వస్తు ప్రాధాన్యత' అంటే, మధ్యతరగతి వర్గం దగ్గర ఆగి పోయిన సాహిత్యాన్ని కదిలించి, తరతరాల దోపిడికీ, అణచివేతకూ గురైన అసం ఖ్యాక ప్రజానీకం వైపుగా తీసుకురావడం. సాహిత్యాన్ని ఆకాశం నుంచీ, త్రిశంకుని స్వర్గం నుంచీ దించి నేలమీదికి రప్పించడం. నేలమీదికి రప్పించడమెందుకు? ఊరికే నేలమీద వుంచడానికి కాదు- 'నేలతల్లి విముక్తి కోసం'. అదీ లక్ష్యం. ఈ మహోద్య మం ఎవరో కొందరి వల్ల జరుగుతున్నదీ, జరిగేదీ కాదు. సాహిత్యం అటు భాషా పరంగా గ్రాంథికం నుంచీ, శిష్టవ్యావహారికం, అక్కణ్ణుంచీ వ్యావహారికం, ఇంకా అక్కణ్ణుంచీ మాండలికం దగ్గరకు రావడం....వస్తుపరంగా ఉత్తమ నాయకుల నుంచీ సామాన్యులవరకూ, సామాన్యులనుంచీ శ్రామికులవరకూ రావడం.... యీ మొత్తం క్రమాన్నంతా చూస్తూ వస్తే, 'సాహిత్య గమనం' కనిపిస్తుంది. అది అని వార్యమని తెలిసివస్తుంది.

భాషాపరంగానూ, వస్తుపరంగానూ సాహిత్యంలో ఇంత మార్పు వచ్చిన తర్వాత, ఆయా ప్రక్రియలకు సంబంధించిన 'శిల్పం' లో మాత్రం మార్పు రాకుండా వుంటుందా? ఒక వైపు అది కూడా మారుతూ వచ్చిన నిదర్శనాలు మన కళ్ళ ముందున్న వేనాయె. అంటే, ఇప్పటి 'శిల్పం' వస్తువు నతిక్రమించి రచయితదిగానో, రచయిత 'ప్రతిభావిశేషం'గానో వుండదు. వస్తువుదిగా, ఆ వస్తువులో రచయిత కలిసిపోయేదిగా వుంటుంది. రచయిత ప్రాధాన్యత తగ్గిపోయి, వస్తు ప్రాధాన్యత పెరుగుతుంది. 'వస్తుప్రాధాన్యత' అంటున్నది దీన్నే. సాహిత్యంపైన కొందరు మేధావుల అధికారం తొలగకపోతే, కొందరు ఆక్రమణలోవున్న 'నేలతల్లి విముక్తి' సాధ్యంకాదు. ఈ క్రమంలో భాగంగానే బొగ్గుగనిలో పనిచేస్తున్న కార్మికుడు అక్కడి కార్మికుని జీవితాన్ని గురించి తెలియజేస్తున్నాడు. గిరిజనుల్తో కలిసివున్న వాళ్ళే గిరిజనులను గురించి రాస్తున్నారు రచయితకూ, వస్తువుకూ వున్న యీ అన్యోన్య సంబంధాన్ని అర్థం చేసుకుని ప్రేమించగలిగిన వాళ్ళకు యీ 'శిల్పం' అర్థ మవుతుంది. విప్లవానికీ, విప్లవ కథకూ భాష వుండదు. అందువల్ల యీ కథలన్నీ తెలుగులో వున్నంతమాత్రాన తెలుగు కథలు కావు తెలుగువాళ్ళ జీవితాలకు సంబం ధించిన కథలే వుండే పత్రికల్లో యీ కథలు కనిపించవు. జనజీవన పోరాటాల్లో, అదీ కళ్ళు తెరచి చూడదల్చుకున్న వాళ్ళ కళ్ళకు కనిపిస్తాయి.

ఒక వీరుడు మరణిస్తే (సృజన 181, అక్టోబర్/నవంబర్ 1990) నాటకం రాజకీయ ఆయుధం కాగల సజీవ కళాసాధనానికి మంచి నమూనా అన్న కాకరాల అభిప్రాయంతో (సృజన-182, డిసెంబర్, 1990) అంగీకరిస్తూనే ఆయన లేఖకు మరికొంత వివరణ అవసరం అని తోచి ఈ ఉత్తరం. ప్రదర్శన కళగా నాటక ప్రయోజనాన్ని (ఫంక్షన్) విశ్లేషిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు ఆయన తీసుకున్నట్టు కనిపించదు. ప్రతి కళారూపంలోనూ ఒక టెక్నొలాజికల్ సంబంధం, ఒక సామాజిక సంబంధం మిళితమయి ఉంటాయి. కాకరాల ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత నివ్వలేదు. నాటకం విషయంలో సామాజిక చరిత్ర పరంగా విశ్లేషణకు సృజన పాఠకులు పరిచితులే. (నాటక ప్రయోజనం - అధ్యయన పద్ధతి - త్రిపురనేని మధుసూదనరావు, సృజన-136, ఫిబ్రవరి 1983)

'ప్రజా ప్రతిస్పందనల్ని౦చి....చెప్పదల్చుకున్న విషయాన్ని అభివృద్ధి చేసు కుంటూపోగల శక్తి నాటకం లాంటి సజీవ (దృశ్య) కళారూపాలకే ఉంది' అన్న మాట నిజమే. కాని దానికి కారణం మాత్రం టెక్నాలజీలో లేదు. సినిమా, వీడియో, టీవి లాంటి యాంత్రిక ప్రధానమయిన కళాసాధనాలు నాటకాలకి ప్రత్యామ్నాయం కాకపోవడానికి 'యాంత్రికత' కారణం కాదు. ప్రేక్షకులకి కళకు మధ్య సామాజిక

ఈ సంకలనంలో వున్న 41 కథల్ని గురించీ ప్రస్తావిస్తూ, అందులోవున్న లోపాల్ని గురించీ విశేషాల్ని గురించీ వివరిస్తూ, సమీక్షించడం సాధ్యమైనా సక్రమం కాదని నా ఉద్దేశం. ఎందుకంటే, ఇవన్నీ విడివిడిగా కన్పిస్తున్నా అన్నీ పరస్పర సంబంధం కలిగినవిగా వుండి ఒకే 'విప్లవకథ'గా తమని తాము కలుపుకుంటున్నవి. విప్లవ రచయితలు వచన కవితనూ, పాటనే కాక, కథను కూడా ఎంత విస్తృత ఉద్యమ సాధనంగా చేపట్టారో యీ సంకలనం తెలియజేస్తుంది. ఏ పరిశోధనో చేస్తే తప్ప తెలుసుకోలేని యీ విషయాన్ని ఒక్క పుస్తకం చదివితే తెలిసేట్టు చేసిన నెల్లూరు జిల్లా విరసం యూనిట్ ని అభినందించాలి.

నేలతల్లి విముక్తికోసం - జనజీవన పోరాట కథలు - విరసం నెల్లూరుజిల్లా యూనిట్ ప్రచురణ, 428+Xvi పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : వి. చెంచయ్య, 6-5-13, పిన్నంరాజువారి వీధి, కావలి, 524 201, నెల్లూరు జిల్లా.

సంబంధాలలో రెంటికీ మధ్య ఉన్న తేడా కారణం. ఎంతో కొంతమేరకు టెక్నాలజీ అన్ని కళారూపాలకి అవసరమే. ఆ టెక్నాలజీ అందుబాటులో ఉందా లేదా అన్నది పెద్ద సమస్య కానేకాదు. దానికి కావాల్సింది పెట్టుబడి కాదు, మదుపు. [ప్రస్తుతం విప్లవోద్యమానికి ఆ మదుపు కొరత కూడా పెద్దగా ఉన్నట్టు లేదు!] ఇటీవలి కాలంలో జననాట్యమండలి ఆడియో కాసెట్లని, వీడియో కాసెట్లని విడుదల చేసింది. తీవ్ర నిర్బంధకాలంలో ప్రదర్శనలివ్వడానికి అనువయిన పరిస్థితి లేనప్పుడు ఆ వీడియో కాసెట్లు ఎంతో కొంత మేరకు ఒక ప్రయోజనాన్ని నెరవేర్చగలిగాయి కూడా!

సజీవ కళారూపాలకి- 'యాంత్రిక ప్రధానమయిన' కళారూపాలకి మధ్య తేడా యాంత్రికతలో లేదు. అది ఆయా కళారూపాలకి-ప్రేక్షక ప్రజలకి మధ్య ఉండే అన్యోన్య సంబంధంలో ఉంది. సజీవ దృశ్య కళారూపాలు-వాటి ప్రేక్షకులు ఒకదాన్నొకటి ప్రభావితం చేసుకుంటాయి (రు) లేదా సంఘర్షిస్తాయి. ఈ పరస్పర ప్రతిచర్యలే వాటి అస్తిత్వాన్ని నిర్దేశిస్తాయి. ఈ రకం కళారూపాలలో కళకుగాని, ప్రేక్షకుడికిగాని స్వతంత్ర ప్రతిపత్తి లేదు. అందుకే అవి కొకరాల చెప్పినట్టు తాము 'చైతన్యవంతమవుతూ ప్రజల్ని చైతన్యవంతం' చేయగల్గుతాయి. గత రెండు దశాబ్దాలలో జననాట్యమండలి ప్రజల్ని ప్రభావితం చేసింది. దానికి ప్రధాన కారణం జనం జననాట్యమండలిపై చూపించిన ప్రభావమే. ప్రతిపాట, కళారూపం వివిధ ప్రాంతాలలో సందర్భాలలో తన ప్రదర్శనాక్రమంలో ప్రజల ప్రతిస్పందనకనుగుణంగా మారుతూ పోయింది. ఈ నిరంతర క్రమంలో ఒకటి రెండు మైలురాళ్ళు ఉండవచ్చు. కాని అవి ఎంతమాత్రమూ 'ఫైనల్ ప్రతి' కావు, నాటకం, పాట ఏదో ఒక దశలో అచ్చవుతాయి. లేదా ఇతరత్రా రికార్డ్ అవుతాయి. ఆ తర్వాత మళ్ళీ ప్రదర్శనాక్రమంలో స్థల కాలానుగుణంగా మార్పులకి గురి అవుతాయి. ఆ క్రమంలో అవి తమ ఒరిజినల్ రచయిత నుండి స్వతంత్ర ప్రతిపత్తిని పొందుతాయి. (ఏ దశలో ప్రచురించాలి అన్న విషయంపై విప్లవ సాహిత్య పత్రికలకు స్పష్టమైన అవగాహన ఉన్నట్టు కనిపించదు, అది వేరే సంగతి) ఈ క్రమం, దాని స్పిరిట్ కూడా మౌలికంగా విప్లవపోరాట గమన సూత్రానికి ప్రతిఫలనాలే. ఈ స్పిరిట్‌ని కళా సాహిత్య రంగాలలో సరిగా అర్థం చేసుకోలేకపోతే కళ ఆ కళాకారుడి సొత్తు అనే భావన ప్రజాసాహిత్య సాంస్కృతిక రంగాలలో కూడా మరో రూపంలో కొన

సాగుతూ ఉంటుంది. "అచ్చుకోసం ఆరాటపడే ఔత్సాహిక రచయితలకీ, ఉద్యమ రచయితలకి మధ్య ఉండవలిసిన తేడా" గురించి కాకరాల చేసిన వార్నింగ్‌కి కూడా సమాధానం ఇక్కడే ఉంది. సృజన అట్టమీద ఒకప్పుడు రచనల శీర్షికల మాత్రమే ప్రకటింపబడేవి. తర్వాత కాలంలో రచయితల పేర్లు, రచనల శీర్షికలు ప్రకటింపబడేవి. మొన్న కాకరాల లేఖ ప్రచురించిన సంచికలో అట్టమీద రచయితల పేర్లే మిగిలాయి! ఈ రకం ప్రభావాల గురించి మనకు మరింత స్పృహ కలగనంత కాలం కళారూపాల రాజకీయ శక్తికి కారణాల్ని ఎక్కడెక్కడో వెతకాల్సివస్తుంది. అది మనల్ని టెక్నాలజీ దగ్గరికి, పెట్టుబడి దగ్గరికి, నటుల ఆరాధన దగ్గరికి తీసుకెళ్తుంది. కాని ప్రజా కళాసాహిత్యాలకున్న బలాన్ని అర్థం చేసుకోవడానికి అభివృద్ధి చేసుకోవడానికి పనికిరాదు. విప్లవ సాహిత్యోద్యమాన్ని పీడిస్తున్న ఈ ధోరణి నుండి విప్లవోద్యమం విముక్తి చెందినట్టు మాత్రం గమనించడం మన కనీస బాధ్యత (కారా 'కథా కథనం' పుస్తకానికి ఆర్. ఎస్. రావు ముందుమాట)

సజీవ కళారూపాలకుండే శక్తి వాటి సామాజిక స్వభావంలో ఉంది. "పి. శశిధర్ రాసిన" నాటకం, పి. శశిధర్ నాటకంగా తన అస్తిత్వాన్ని కోల్పోయే క్రమం, కాకరాల ప్రస్తావించిన "ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే క్రమం" రెండూ ఒకటే. ఒకటయినప్పుడే కళ రాజకీయ సాధనం కాగలుగుతుంది.

సందర్భం వచ్చింది కాబట్టి మన దేశంలో పాపులర్ సంస్కృతిలో ప్రధాన భాగమయిన సినిమాలకున్న ఒక విచిత్రమయిన స్వభావం గురించి కూడా చెప్పుకోవాలి. సినిమాల్ని, ముఖ్యంగా హిట్ అయిన సినిమాల్ని, పాటల్ని మన జనం నాటకంలా చూస్తారే గాని సినిమాలా చూడరు. ఈలలు, చప్పట్లు, కామెంట్లు ఇతర హావభావాలతో వాళ్ళు సినిమాకు ప్రతిస్పందిస్తు ఉంటారు. అది నాటకం కాదని, వాళ్ళ ప్రతిస్పందకు ఆ కళారూపం ప్రభావితం కాదని మన జనానికి తెలుసు. బహుశా ఒక స్థాయిలో తెలియదు కూడా. వాళ్ళెరిగిన రూపానికి అనుగుణంగా మరో కళారూపాన్ని వాళ్ళు వాళ్ళ చైతన్యంలో (భౌతిక వాస్తవికతలో కాదు) మలచుకోగలుగుతున్నారు. సినిమాల వల్ల నాటకాలకి ఆదరణ తగ్గిందనేది పాక్షిక సత్యం మాత్రమే సినిమా కూడా నాటకం అయిపోవడం ఈ నాణానికి రెండోవైపు, ప్రజల్ని కళారూపాలకి మధ్య ఉన్న ప్రగాఢ సామాజిక సంబంధం గురించి ఇంతకంటె మంచి ఉదాహరణ ఏముంది?

— ఒక పాఠకుడు.

జనవరి/ఫిబ్రవరి '91 సృజన చూశాను. యుద్ధం గురించిన వ్యాసాలు యిందు లోనూ—యితరత్రాను చదివాక సైతం నా ప్రశ్నలు అలాగే వుండిపోయాయి. ఆ ప్రశ్నలు చర్చించవలసినవి.

యుద్ధమే గనుక వస్తే యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి అని ఒకప్పుడు ఆచరించారు. ఇపుడూ ఆచరించాలని చాలమంది చర్చించారు. రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాలకు, రష్యాకు సహకరించే పేర భారత కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యత ప్రధానం పరమార్థం చేయడంపై తీవ్ర విమర్శకూడా ఈ నేపథ్యంలోనే చేయడం జరిగింది. కాగా కాంగ్రెస్ ఈ బలహీనతల్ని ఆసరా చేసికొని బ్రిటన్‌లో బేరానికి దిగింది. అంటే ఎంతో కొంత సాధించింది. అనాడు కమ్యూనిస్టు వైఖరి కన్నా కాంగ్రెసు వైఖరే ఎంతో కొంత సరైనదని అంతర్లీనంగా ప్రచారంలో వుంది.

కాగా ఈనాడు సద్దాం, బుష్‌ల్లో ఎవరికో ఒకరికి పూర్వం 50 ఏళ్ళ క్రితం లాగే ఐక్యతే ప్రధానం పరమార్థం చేయడమే నేను ఎన్నో వ్యాసాల్లో చూస్తున్నాను ఇది రెండోసారి విషాదంగా చరిత్ర పునరావృతం కావడం కాదా ?

రాజకీయాల కొనసాగింపే యుద్ధం అయినపుడు పాలకవర్గం సద్దాం బుష్‌లు తీవ్రస్థాయి రాజకీయాల్ని (యుద్ధాన్ని) ఆచరిస్తూ ప్రజల మీద రుద్దుతున్నపుడు ఆయా దేశాల్లో ప్రజలు సద్దాం బుష్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సివుందని తద్వారా అంతర్యుద్ధంగా మార్చాలని అనే కోణం వెలుగులోకి రావాలా లేదా ? ప్రత్యక్ష యుద్ధానికి ముందు నుంచీ ఈ పని జరగాల్సి వుందా లేదా ? అంతర్యుద్ధం చేయ కుండా ఏ దేశంలోనైనా విప్లవం వస్తుందా ? చచ్చిపోబోయే శత్రువును కాపాడి బల వంతుణ్ణి చేసి, గెలిపించి, అనక అతనితో తిరిగి పోరాడి విప్లవం సాధించాలా ? ఖొమైనీకి సహకరించిన విప్లవకారుల గతి ఏమైంది ? సద్దాం గెలిస్తే జరిగేదేమిటి ? అసలు విప్లవం అంటేనే ఒక స్థలకాలాల్లోని రెండు వర్గాల మధ్య అంతర్యుద్ధం కదా ? దీన్నే ఘర్షణ ప్రాథమికం అంటుంటాం. కాగా దీన్ని వదిలేసి మిగతా అంతా వ్యాసాల్లో రాయడం శాస్త్రీయమవుతుందిదా ? ఎలా అవుతుంది ?

—బి.ఎస్. రాములు,

జగిత్యాల,

.... ఈ ఉత్తరం మీకు అందేటప్పటికి యుద్ధం ఏ దశలో వుంటుందో తెలియదు. పరిస్థితులు రోజురోజుకీ మారిపోతున్నాయి. పూర్వం వియత్నాం యుద్ధం రోజుల్లో వచ్చిన యుద్ధ వ్యతిరేకత దేశంలో కనిపించడం లేదు. పైగా ముమ్మరంగా దేశ భక్తీ, జండా భక్తీ పెల్లుబుకుతోంది. దేశమంతా సైన్యానికి మద్దతుకి చిహ్నంగా ఇళ్ళముందూ, కార్లమీద పసుప్పచ్చ రిబ్బన్లు కడుతున్నారు. జండాల వ్యాపారస్థులూ, రిబ్బన్లు తయారుచేసే వాళ్ళూ విరామం లేకుండా డబ్బు చేసుకుంటున్నారు.

స్టాక్ మార్కెట్ పైకి పోతోంది.

ఈ యుద్ధం రెండు మూడు వారాల్లో విజయవంతంగా ముగిసిపోతుందనే నమ్మకం ప్రభుత్వ ప్రచార యంత్రాంగం కలిగిస్తోంది. పత్రికల వాళ్ళూ, టి.వి. వాళ్ళూ తమకు మామూలుగా అలవాటైన ప్రభుత్వ విమర్శనీ, వార్తా స్వాతంత్ర్య దృక్పథాన్నీ నిర్లజ్జగా వొదిలేసి - ప్రభుత్వం, సైన్యం సెన్సారు చేసి ఇచ్చిన వార్తల్ని పెద్ద అక్షరాల్లో ప్రకటిస్తున్నారు. ఎప్పుడో తప్ప ప్రభుత్వ భిన్నమైన గొంతుక వినిపించడం లేదు.

ఈ యుద్ధం చాలా నెలలు కొనసాగితే మాత్రం - సైన్యం మీద ఈ నమ్మకం, దేశభక్తి క్రమలూ నిలవవనీ - యుద్ధానికి అసలు కారణం పెట్రోలు మీద ఆధిపత్యం కోసం పెట్టుబడిదార్లు చేస్తున్న ప్రయత్నం అనీ మామూలు జనానికి తెలిసిపోతుందనీ, వ్యాపార రంగం కూడా రీసెషన్‌లోకి కూరుకుపోకుండా ఎంతో కాలం ఆడుకో లేదనీ - పెట్టుబడిదారీ వర్గాలు కూడా అంటున్నారు.

ఇంతవరకూ అమెరికన్ సైనికులు ఎక్కువమంది చచ్చిపోలేదు. అమెరికన్ ఆయుధాలు అనుకున్న ప్రకారం పని చేస్తున్నాయి.

దౌత్యరంగంలో గాని, యుద్ధరంగంలో గాని, అమెరికాకి ఎదురులేదనే నమ్మకం బలపడుతోంది.

ఇండియాలో పరిస్థితి ఎలా వుందో తెలియదు. పెట్రోలు ధర చాలా పెరిగి, రవాణా పరిస్థితులు చాలా దెబ్బతిని వుంటాయి. అసలు మామూలుగానే అంతంత మాత్రంగా వుండే పరిస్థితి ఈ యుద్ధం వల్ల ఇంకా క్షీణించి వుంటుంది—

ప్రపంచం కళ్ళముందు మారిపోతోంది.

— నారా

మాడిసన్ (అమెరికా)

వె లు వ డి ం ది :

Selected Works of
Mao Tse Tung - Volume VI

ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, పెకింగ్ ప్రచురించిన ఐదు సంపుటాల తర్వాత
తొలిసారిగా క్రాంతి ప్రచురణలు సంకలితం చేసి ప్రచురించిన
ఆరవ సంపుటం. వెల : రు. 60-00

ప్రతులకు : పీస్ బుక్ సెంటర్, 1-8-518/16/2, వెంకటేశ్వరాలయం దగ్గర,
చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020

←

* విశాఖపట్టణమ్ - నగర కావ్యమ్ - మానేపల్లి, రు. 5, ప్రతులకు : టి. కృష్ణాబాయి, 15 ఎల్ ఐజి, ఎచ్ బి కాలనీ, విశాఖపట్నం-530 022.
* పునరంకితం - నాటకం - రుద్రజ్వాల, రు. 10, ప్రతులకు : రుద్రజ్వాల, బోస్‌నగర్, చీరాల-523 155.
* గల్ఫ్ యుద్ధం-పూర్వాపరాలు - ప్రసాద్, ప్రజాపంథా ప్రచురణలు, రు. 2, ప్రతులకు : మేనేజర్, ప్రజాపంథా, కొరిటిపాడు, గుంటూరు-522 007.
* కవిత్వం-గతితార్కికత - జె.సి. - సృజన ప్రచురణలు (జనవరి 1991), రు. 15, ప్రతులకు : సృజన, ఫ్లాట్ II, బ్లాక్ 2, ఎం.ఐ.జి. II, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్-500 044.
* మతవర్గతత్వం - (వ్యాస సంకలనం), ఎడిటర్ : హరి పురుషోత్తమ్ - పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు - రు. 10, ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, 3-3-865, ఆర్యసమాజ్ ఎదురుసందు, కాచిగూడ, హైదరాబాద్-500027.
* కుటుంబంలో స్త్రీలపై హింస - ఎ.పి.సి.ఎల్.సి. విశాఖపట్నం జిల్లా ప్రచురణ, మార్చి 1991 - రు. 3. ప్రతులకు : యు. వింధ్య, 5 ఎఫ్, క్లాసిక్ అపార్ట్‌మెంట్స్, ఆర్.కె. బీచ్, విశాఖపట్నం-530 003.

స్వీకారం :

* నీటిపుట్ట - దేవిప్రియ వచన పద్యాలు - ఝరీ పొయెట్రీ సర్కిల్, హైదరాబాదు ప్రచురణ (డిసెంబర్ 1990), 136 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 15. ప్రతులకు : ఝరీ పొయెట్రీ సర్కిల్, 6-1-711, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004.
* అయోధ్యలో రావణకాష్టం - శివకుమార్ - జనసాహితి ప్రచురణ (నవంబర్ 1990), 88 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 6. ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, కార్ల్ మార్క్స్ రోడ్, విజయవాడ-520 002.
* ప్రతి పాటకు ఒక కథ ఉందా ? అ ఉంది ! - గద్దర్, జననాట్యమండలి ప్రచురణ (ఫిబ్రవరి 1991) 122+4 పేజీలు, 1/8 డెమ్మీ, ఎనిమిది రూపాయలు. ప్రతులకు : పీస్ బుక్ సెంటర్, 1-8-518/16/2, రత్న కేఫ్ పక్కసందు, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
* ప్రజాసాహితి - సాహిత్యోద్యమ మాసపత్రిక-మతతత్వ వ్యతిరేక పోరాట సంచిక, ఫిబ్రవరి 1991, 128 పేజీలు, 1/8 డెమ్మీ, ఎనిమిది రూపాయలు. ప్రతులకు : మేనేజర్, ప్రజాసాహితి, 29-28-67, దాసరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-520 002.
* ఇక ఈ క్షణం - నీలిమా గోపీచంద్, కవిత్వం ప్రచురణలు (సెప్టెంబర్ 1990) 24 పేజీలు, రు. 5.
* ఫోర్త్ పర్సన్ సింగ్యులర్ - గుడిహాళం రఘునాథం - కవిత్వం ప్రచురణలు (అక్టోబర్ 1990), 36 పేజీలు, రు. 5.
* బాధలూ-సందర్భాలూ - త్రిపుర : కవిత్వం ప్రచురణలు (నవంబర్ 1990), 36 పేజీలు, రు 6.
* గురిచూసి పాడే పాట - స్త్రీవాద కవితలు - కవిత్వం ప్రచురణలు (డిసెంబర్ 1990) 64 పేజీలు, రు. 10.

పై నాలుగు పుస్తకాలూ ప్రతులకు : త్రిపురనేని శ్రీనివాస్, 40 5/6-10, ఇబ్రేల్ పేట, విజయవాడ-520 010.

←

SRJANA Telugu Monthly March/April 1991
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజనకు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించండి !

1990 జనవరిలో మళ్ళీ ప్రారంభమైన 'సృ జ న' తీవ్రమైన ఆర్థిక సమస్యలను, రచనల కొరతను ఎదుర్కొంటున్నది. సృజన పట్ల పాఠకులలో, విప్లవోద్యమ సానుభూతిపరులలో కనబడుతున్న విస్తృత ఆదరణ ఆర్థిక రూపం లోకి పరిణమించడం లేదు. సృజన చందాదారుల సంఖ్య, ఏజెంట్ల సంఖ్య గణనీయంగా పెరగడం లేదు. సృజన మీ పత్రిక. సృజన ప్రజల పత్రిక. సృజనను గతంలో కూడ ప్రజలే తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మళ్ళీ ఒకసారి హెచ్చు సంఖ్యలో చందాలు చేర్పించడం ద్వారా, విరాళాలు సేకరించడం ద్వారా, కొత్త ప్రాంతాలలో ఏజెంట్లను కుదిర్చిపెట్టడం ద్వారా, ఏజెంట్లు సక్రమంగా బకాయిలు చెల్లిస్తున్నారో లేదో కనుక్కోవడం ద్వారా ప్రజలే సృజన జీవనానికి బాసటగా నిలవవలసి ఉన్నది. సృజనను రక్షించుకునే బాధ్యతను విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు స్వచ్ఛందంగా స్వీకరించవలసి ఉన్నదని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం.

సృజన సంవత్సర చందా రు. 40. విడి ప్రతి రు. 4.

* సృజనకు విరివిగా చందాలు సేకరించండి !
* సృజనను పదికాలాల పాటు నిలిపి ఉంచేందుకు మీ వంతు కర్తవ్యం నిర్వహించండి !

SRJANA
Flat 11, Block 2,
MIG II, Baghlingampalli,
Hyderabad-500 044.

Rs. 4/-